
కీర్తనలు

# అన్నమాచార్యుల అమృతవర్షిణి



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని తెలుగు భక్తి వెబ్ సైట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ ఫౌండేషన్ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) తెలుగు భక్తి వారి వెబ్ సైట్: www.telugubhakti.com
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో తెలుగు భక్తి వారి సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.


Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org

Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123


" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## తెలుగు భక్తి వారి వెబ్ సైట్:

## http://www.telugubhakti.com/



# అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014



# అన్నమాచార్యుల
# అమృతవర్షిణి

(అన్నమాచార్యుల 75సంకీర్తనల సచిత్ర సరస వ్యాఖ్యానం)




వ్యాఖ్యాత
ఐ.వి.సీతాపతిరావు



# అమృతాంజలి

శ్రీ ముత్తుస్వామి దీక్షితుల 'ఆనందామృతాకర్షిణి' కృతిని నేను కొత్తపేటలో, మా తాతగారింట్లో, రేడియోలో, వీణపై తొలిసారిగా విన్నాను. అమృతవర్షిణి ఆరోహణా అవరోహణా అర్థంకాక సంగీతవిద్యాదర్పణంలో చూచి, 'సునాద వినోదిని'కి దగ్గరగా ఉన్నదని గ్రహించి, 'సునాద వినోదిని' లోని చతుశ్రుతి ధైవత స్వరానికి బదులుగా పంచమ ప్రయోగ ప్రయత్నం చేశాను. శ్రుతి నిలవలేదు.  ఆ రోజుల్లో (1970 - 71లో) నేను కనీసం శ్రుతిపెట్టెకుకూడా నోచుకోలేదు. మా తాతగారింట్లో ఒక పెద్ద నుయ్యి ఉన్నది. ఆ నూతి గట్టున నిలబడి, వంగి నూతిలోకి తల వంచి, షడ్జాంతరగాంధార ప్రతి మధ్యమ కాకలీనిషాద స్వరాలు పలుకుతూ పంచమ స్వరాలు కలుపుకుంటూ ఒక గంటసేపు సాధన చేశాక 'అమృత వర్షిణి' రాగం పట్టువడింది.  'అమృతవర్షిణి' రాగాన్ని తన ప్రతిధ్వనులతో నాకు నేర్పిన సంగీతగురువైన ఆ నూతిచుట్టూ ఇప్పటికీ కొత్తపేట వెళ్లినప్పడల్లా 'నమఃశ్రవాయచప్రతిశ్రవాయచ'అంటూప్రదక్షిణ నమస్కారాలర్పిస్తూంటాను.మాశ్రీమతి అరుణ యశోద వీణపై సహకరించగా ప్రప్రథమంగా అమృతవర్షిణి రాగంతో మా సాధన ఆరంభమైంది. మా ఒక్కగానొక్క అమ్మాయి పేరు అమృతవర్షిణి. ఈ సంకీర్తనల వ్యాఖ్యాన గ్రంధానికి నేను పెట్టిన 'అన్నమాచార్యుల అమృతవర్షిణి' డా॥ శివప్రసాద్, శ్రీ శాండిల్యలకు ఎంత నచ్చిందంటే గిఫ్ట్‌బాక్స్ లోని ఆడియో క్యాసెట్లకు ఆ పేరే నిర్ణయించారు. 'అన్నమాచార్యుల అమృతవర్షిణి' పేరులోని భావం వివరించగా, ఆ భావాన్ని అద్దం పట్టినట్లుగా చిత్రించిన ప్రముఖ చిత్రకారుడు శ్రీ గంగాధర్ ప్రతిభ ముఖపత్రంలో 'ముద్దుగారు'తున్నది. ఇహపరాలకు అమృతవర్షిణి ఒక వారధి. శ్రీమద్భగవద్గీతకు అమృతవర్షిణీవ్యాఖ్య ఉన్నది. అన్నమాచార్యుల ఆంధ్రవేదగీతకు ఇది అమృతవర్షిణీవ్యాఖ్యగా అమ

ర్చాలన్న నా ప్రయత్నసాఫల్య వైఫల్యాలు రసజ్ఞులు ' అమలోదాత్తమనీష'లు నిర్ణయించవల సినదే.

అన్నమాచార్యుల కీర్తనలతో  నన్ను అత్యంతప్రభావితుణ్ణి చేసినది డా॥ బాలమురళీ కృష్ణ. ఆయన పాడిన హెచ్ఎమ్వీ ఎల్పీ అన్నమాచార్య సంకీర్తనల తొలి ఎల్పీ రికార్డ్. తొల్లి కలవే యివియు సంకీర్తన (82పీ) ఆ ఎల్పీకి వన్నె తెచ్చింది. ఈ సంకీర్తనలకు నేను చేసి న స్వరనిర్దేశంలో డా॥ బాలమురళీకృష్ణ ప్రభావం ప్రత్యక్షంగా కనబడుతూనే ఉన్నది. చంద్రికా హిందోళ - వీణాధరి - మోహనరవళి రాగాలలో ప్రత్యేకంగా, సంగీతపరమైన ప్రేరణ అంతా డా॥ బాలమురళి నుండి వచ్చినదే.

అన్నమాచార్యుల 32వేల సంకీర్తనలకూ వెరసి ఆంధ్రవేదమని వ్యవహారం. ద్రవిడవే దం 'నాలాయిరం నాలుగువేల గ్రంథం. ద్రవిడ వేదానికి 8 రెట్లు ఆంధ్రవేదం. (ఋగ్వేదం 10 మండలాల 1072 సుక్తాల 10472 ఋక్కులు - మంత్రాలు, ఋగ్యజుస్సామాధర్వ ణాలు కారికలతో కలసి 20389 మంత్రాలు) అన్నమాచార్యుల సంకీర్తనలన్నింటికీ ఆధార మైన వేదమంత్రాలను వెదికి ఉదాహరించ గలిగితే ఆంధ్రవేదానికీ, వేదానికీ భాష్యం వ్రాసి నట్లే. అన్నమాచార్యులు ఆదిశంకరులేనని నా విశ్వాసం.నా ఛిక్రోడయత్నం నేను చేశాను. శ్రీవిద్యా విషయాలు వివరించిన మిత్రులు శ్రీ వి.వి. సాంబశివరావుగారికీ, అర్ధరాత్రి ఫోన్ లో 'నీటిలో చిపుకక' పద్యం చెప్పిన జస్టిస్ పి. కోదండరామయ్యగారికీ, సంకీర్తనల సంస్కృతంలో సహకరించిన శిరోమణి చి.సౌ. ఎ..ఆర్. విజయశ్రీకి ఈ అవకాశం నాకు కల్పించిన డా॥ ముదిగొండ శివప్రసాద్ గారికీ కృతజ్ఞుడిని. వారి ఋణం నేను తీర్చలేనిది. అన్నమాచార్య ట్రస్టువారికి నా కృతజ్ఞతలు. అసూర్యంపశ్య అయిన నా అమృతవర్షిణిని, ఈ సంకీర్తనావ్యాఖ్యానసరస్వతిని వెలుగువెన్నెలలలోకి తెచ్చినవారు వీరే. రమేష్ ప్రింటర్స్‌కి ధన్యవాదాలు.

నాకు నిజంగా సంగీతం రాదు. నేను సాహితీవేత్తనూ కాదు. వేదవిద్యా జ్ఞానం కూడా నాకు లేదు. ఈ వ్యాఖ్యానాలు ఎలా వ్రాయగలిగానంటే అది కేవలం శ్రీతిరుమలే శుని దయ. 'కందువల నీతని సంకల్పమీ పనులు' అన్నట్లుగా త్రిశంకుడంటాడు 'ఓం

అహం వృక్షస్యరేరివ కీర్తిః పృష్ఠం గిరేరివ ఊర్ధ్వ పవిత్రో వాజినోవస్వమృతమస్మి దవిణగ్ం సువర్చసం సుమేధా అమృతోక్షితః ( నీ దయ వల్ల) నేను పెద్ద చెట్టువలె శాఖోపశాఖలు గా విస్తరించాను. నా కీర్తి నా వెనుక కొండంత ఉంది. పరమపదానికి అమరమైన పవిత్రమైన నిచ్చెనలు వేశాను. నా ఐశ్వర్య వైభవ తేజో బుద్ధులు (నీచే) అమృతప్రోక్షితమై నవి. పరితృప్తుగను. నాకింకేమికావాలి అన్న ఉపనిషద్వాక్యాన్ని స్మరిస్తూ 'త్వయి ప్రసన్నే మమకిం గుణేనత్వయ్య ప్రసన్నే మమకిం గుణేన' అన్న లీలాశుకుడి మాటగా

'శైవావయం నఖిలు తత్ర విచారణీయం
పంచాక్షరీ జప పరానితరాంతధాపి
చేతో మదీయ మతసీకుసుమావభాసం
స్మేరాననం స్మరతి గోపవధూకిశోరం'

నేను శైవుడినే. ఇవటూరివాడిని. ఆరాధ్య బ్రాహ్మణుడిని. 'పంచాక్షరీ జప పరాయణు డినే. నా మనసుమాత్రం నగుమోముగల నవనీతచోరుణ్నే స్మరిస్తున్నది' అని విన్నవిస్తున్నా ను. ముద్రణలో అచ్చుతప్పులు చాలానే దొర్లాయి. తప్పొప్పుల పట్టిక చూచాకగాని నన్ను తిట్టుకోవద్దని శ్రీస్వామికి మనవి.

యదక్షర పదభ్రష్టం మాత్రాహీనంతు యద్భవేత్
తత్సర్వంక్షమ్యతాం దేవ నారాయణ నమోస్తుతే.

ఇవటూరి వేంకట సీతాపతిరావు

501,Doshi Crest Apts.3-6-170,

Hyderguda,
Hyderabad-500029.

ముకుంద మూర్ధ్నా ప్రణి పత్యయాచే
భవంతమే కాస్త మియంతమర్థం
అవిస్మృతి స్త్వచ్చరణార వించే
భవే భవే మేస్తు భవత్ప్రసాదాత్

# అమృతోదయం

పదకవితాపితామహుడని ప్రసిద్ధినందిన అన్నమయ్య ఆంధ్ర వాగ్గేయకారులందరికీ ఆద్యుడు. పూజ్యుడు సంగీతము ఆయన ప్రాణము. భక్తి ఆత్మ. హింసోన్మత్తమైన పృథ్విలో ప్రేమ, త్యాగము, దయ, శాంతి, సమానతలను భక్తి ద్వారా సాధించిన ఒక ప్రవక్త అన్నమయ్య. ఆడినమాటెల్ల అమరకావ్యమై పాడిన పాటెల్ల పరమరాగమై పరిఢవిల్లిన రసయోగి అతడు. ఆయన సంగీత సాహిత్య తాత్విక భక్తి యోగాలను రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతముల లోనే కాదు, దేశ విదేశములలో ప్రచారం చేసి, భారతీయ సాంస్కృతిక పునరుజ్జీవనానికి తోడ్పడాలనే మహాసంకల్పంతో అన్నమాచార్య ట్రస్టు హైదరాబాదులో 1987 ఉగాదికి అవతరించింది. గ్రంథ ప్రచురణలు, తాళ్ళపాక అభివృద్ధి పథకాలకు సహకారాన్ని అందించడం, హైదారాబాదులో అన్నమాచార్య కళామందిరం నిర్మించి - సంస్కృత, సంగీత, నృత్య కళాశాలల నిర్వహణ, దేశ విదేశములలో సంస్థ శాఖల వ్యాప్తి వంటివి మేము నిర్ణయించుకున్న కొన్ని లక్ష్యాలు. ఈ లక్ష్య సాధనలో ఒక భాగంగా ముందుగా ఒక బహుమతి పాకెట్ అందజేస్తున్నాము. అందులో అన్నమాచార్య విగ్రహం, నాలుగు ఆడియో కాసెట్లు, (అన్నమాచార్య సంగీతం) శ్రీవేంకటేశ్వరుని చిత్రపటం. డాక్టర్ ముదిగొండ శివప్రసాద్‌గారి ప్రామాణిక చారిత్రక నవల “శ్రీపదార్చన”, అన్నమాచార్య సంకీర్తన వ్యాఖ్యాన గ్రంథం 'అన్నమాచార్యుల అమృతవర్షిణి' ఉంటాయి.

'అమృతవర్షిణి' ఒక మధురమైన దివ్యనామం. అదే ఈ వ్యాఖ్యాన గ్రంథానికి పేరు. అన్నమయ్య రసహృదయాన్ని గుర్తెరిగి ఆయనపదాలకు తాత్పర్య వ్యాఖ్యానాలను ఈ గంథంలో అందించినవారు ప్రముఖ సంగీతవిద్వాంసులు, బహుభాషావేత్తలు శ్రీ ఐ.వి.సీతాపతిరావు. తొలి ముద్రణ ఈ గ్రంథం లక్ష ప్రతులు వేస్తున్నాము. శ్రీ సీతాపతిరావుగారికి అన్నమయ్యపదాలకు ఇందులో అందమైన రూపకల్పన చేసిన విఖ్యాత చిత్రకారుడు 'గంగాధర' గారికీ మా ధన్యవాదాలు. ఈ ప్రయత్నంలో మాతో సహకరిస్తున్నవారందరికీ శ్రీ పద్మావతీ శ్రీవేంకటేశ్వరుల అమృతాశీస్సులు లభించాలని కోరుతున్నాము.
ఇది అన్నమాచార్య పదకవితా క్షీరసాగర మధనంలో జరిగిన అమృతోదయం.

బి.ఎ.వి. శాండిల్య
కార్యనిర్వహణాధికారి 'అన్నమాచార్య ట్రస్టు'



# ఆపాతమధురం

చిరంజీవి సీతాపతిరావు 'అమృతవర్షిణి'నీ చూశాను, విన్నాను. కొంతమందికి జాతకం బ్రతికివున్నప్పుడు, మరికొంతమందికి తర్వాత బాగుంటుంది. అన్నమయ్య, త్యాగయ్య ఈ రెండోకోవకు చెందినవారు. వారి ప్రతిభ నిత్యోత్సవమడానికి కారణం, వారి తర్వాతవారు. త్యాగరాజాదులవల్ల రామునికి, అన్నమయ్యవల్ల శ్రీ వేంకటేశ్వరునికి శాశ్వతత్వం లభించి ది. అన్నమయ్య సాహిత్యంలో ఆపాతమధురమైన సంగీతంవుంది. ఆపాత మధురమైన అన్నమయ్య సంగీతం మనకులేదు. వారిరచనలకు స్వరకల్పనలు విరివిగా జరుగుతున్నవి ప్రస్తుతం. అయితే ఈ స్వరకల్పనలు ఆలోచనామృతాలుగానే వున్నవిగాని ఆపాతమధుర ములుగా లేవు. అయినా జరుగుతున్న కృషి అభినందనీయమే. అన్నమయ్య సంకీర్తనలలో భక్తి, వేదాంతపూర్వకమైన పాటలు శృంగారపూరితములు గాను. శృంగార రచనలు వేదాంత భావపూరితములుగాను వుండడం ప్రత్యేకత. అన్నమయ్య రచనలో కొన్నిటిని మంత్ర శాస్త్రీయంగాను, వేదాంగ విదితములుగాను విశదీకరించిన అద్భుతపరిశోధన ఈ అమృతవర్షిణి. అన్నమయ్యను ఆదిశంకరావతారముగా, పరిశోధించి నిరూపించిన కొంగ్రొత్త సృష్టి ఈ అమృతవర్షిణి. ఈ 'సరస్వతీ కరణం' నిజంగా సరస్వతీయం అనడం అతిశయోక్తికాదని నా అభిప్రాయం. దీనికి నా అభిప్రాయం కావాలనడం కేవలం నాయందుగల భక్తి, ప్రేమ తప్ప, అభిప్రాయం వ్రాయగల 'తనం' నాకులేదు. ఒక్క 'ప్రాయం' తప్ప. ఈ రచనకర్తను ఏకవచన ప్రయోగంతో పిలవడానికి కారణం నాకు ఇతను ఏకలవ్యుడు గావడమే!.

గ్రంథకర్త రచనలు "అన్నమాచార్యుల ఇన్ని కీర్తనల" "అడుగుల తలనిడి" అన్నమయ్య కీర్త నలవలె ఉన్నవి. ఈ కీర్తనల్లో 'తిరువేంకటేశ' అన్నపదం చేర్చితే అన్నమయ్య రచనలే అనిపి స్తాయి.

'అన్నామయా నీకు సాష్టాంగ వందన
మన్నామయా ఓ అన్నమయ్యా
విన్నామయా నీదు వివిధ సంకీర్తన
లేన్నోవిని నిన్ను కవితాపితామహు ॥డన్నామయా

కన్నామయా మహిమలెన్నో నీలో
కని నీదు బోధనలన్నీ తెలుసు ॥కున్నామయా

పున్నామ యాతనల బోగొట్టు వర మివ్వ
మన్నాము మురళీరవ రూప నీ సాటి లే ॥రన్నామయా

అని అన్న నేను చి॥ సీతాపతిరావు 'చిరంజీవ' అంటాను.

డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ
3, కనకశ్రీనగర్, కెథడ్రల్‌రోడ్,
మద్రాసు. 600086.

# మధురభక్తి మందారమాల

పదకర్తలలో అన్నమాచార్యులు మధురభక్తి ప్రస్థానంచేసిన భాగవతోత్తముడు. పద్య రచనలో పోతనగారిదొక పద్ధతి; పద్యరచనలో అన్నమయ్యగారిది మరొక పద్ధతి. పోత నగారు శబ్దంతో, అర్థంతో పఠితల మనసులను లాస్యంచేయించి భక్తి భావతన్మయత్వా న్ని కలిగిస్తారు. అన్నమయ్యగారు రాగంతో రంగరించిన భావంతో భక్తులమనసులను ప రవశింపచేసి వేంకటేశుని భక్తిమాధుర్యంలో ముంచెత్తుతారు. పోతనగారి కవితలో శబ్దా నిది పైచేయి; అన్నమయ్యగారి కవితలో అర్థానికే అగ్రతాంబూలం. మల్లెపూలకంటే మెత్తనై న మాటలు, మకరందంకంటె మధురమైన భావనం, నవనీతంకంటె మృదువైన అభివ్యక్తి. అమృతంకంటె రుచియైన భావానురక్తి అన్నమయ్యగారి కీర్తనల్లో అమృతవర్షిణి గా జాలువారుతుంటాయి. అందువల్లనే కాబోలు ఈ సరళవ్యాఖ్యగ్రంథాన్ని 'అన్నమాచార్యు ల అమృతవర్షిణ' అనే పేరు సార్థకంగా ఉంచారు.

వ్యాఖ్యాత శ్రీ ఇవటూరి వేంకట సీతాపతిరావుగారు సంగీత సాహిత్యాలను శ్వాసకో శాలుగా పోషించుకొనే రసికులు. వారిలో ఒక విశిష్ట సంశ్లిష్ట వ్యక్తిత్వం అమృతవాహిని గా జాలువారింది. వృత్తికి పారిశ్రామ్యవాది; ప్రవృత్తికి సాహిత్య సంగీత రస రమ్యవాది. పుట్టుకతోవచ్చిన సంగీత సహజ పాండిత్యం; పెద్దలవద్ద నేర్చుకున్న వేదవిజ్ఞానం, మిత్రుల స్నేహంలో సేకరించినన సాహితీ సంస్కారం, దైవదత్తంగా వచ్చిన ధారణాశక్తి.పూర్వజన్మ సుకృతం వల్ల ఏర్పడిన పదకవితా రచనాశక్తి - ఇవన్నీ కలిసి వారి ఈ వ్యాఖ్యాన గ్రంథర చనకు పూర్వరంగాన్ని సిద్ధం చేశాయి. గతానుగతికంగా వ్రాయటం సీతాపతిరావుగారి బాటకాదు; తన అనుభవాన్ని ఎదుటి వారి కంటేటట్లు అభివ్యక్తీకరించడం ఆయన ప్రత్యే కత. ఈ సరళవ్యాఖ్య సంకీర్తన సౌరభాలను వెదజల్లుతోంది. సంకీర్తనకు సంగీతం ఒకరెక్క, సాహిత్యం మరోరెక్క. ఆ రెండూ ఆడితే తప్ప ఈ గీతవిహంగం భావాంతర వీధు ల్లో విహరించలేదు. మిత్రులు శ్రీ సీతాపతిరావుగారు ఉభయశక్తులూ ఉన్న ప్రతిభావంతు లు కావడంతో అన్నమయ్యకీర్తనలకు అన్వయం చెప్పే అమృతధారగా అమరింది.

అన్నమయ్య సాహిత్యాన్ని సామాన్య ప్రజల్లోకూడా విశేషంగా ప్రచారం చేయడానికి ఇటువంటి సరళవ్యాఖ్య గ్రంధాలు అవసరం. ఇందులో ఎన్నిక చేసిన కీర్తన ఒక్కొక్కటీ ఒక్కొక్క ప్రత్యేకతను సంతరించుకొన్నది; అన్నమయ్య భక్తిరసమహాసముద్రంలో ఉవ్వెత్తు గాలేచిన ఒక్కొక్క తరంగం లాంటిది. శ్రీ సీతాపతిరావుగారి వ్యాఖ్యానం బంగారానికి తావిలా అబ్బిన అపూర్వసంఘటన. భావాన్ని ప్రసన్నంగా వివరించి చెప్పడం,భావంలోని సూక్ష్మదశలను విశ్లేషించి వివేచించటం, ప్రతిపాదించే అంశాలకు ప్రాచీన సాహిత్యం నుంచి ప్రమాణాలను చూపించడం, కొసమెరుపుగా స్వీయసమన్వయాన్ని సంఘటించ టం - అనే గుణాలు ఈ సరళవ్యాఖ్యకు సహజంగా అమరిన అలంకారాలు.

అన్నమయ్య కీర్తనలోని శృంగారానికి యోగపరంగా చెప్పుకునే వ్యాఖ్యానానికి "ఇది గాక సౌభాగ్య..." కీర్తనం ఉదాహరణం. అలమేలుమంగ వేంకటేశ్వరునితో సలిపే శృంగా రకేళి బహిరంగానికి శృంగారం; అంతరంగానికి శ్రీ యోగవిద్యాతంత్రరహస్యం. ఆదిశంక రుల సౌందర్యలహరిలోని "మహీంమూలాధారే" అనే శ్లోకాన్ని ఆధారంగా చేసికొని 'శృంగారలక్ష్మీ హృదయమంత్రం'గా అన్వయించడం శ్రీ సీతాపతిరావుగారి మధురతాత్త్వి క దృష్టికి నిదర్శనం (చూడు. పు. 30-33) " తొల్లి కలవే యివియు" అనే కీర్తనకు వ్రాసి న వ్యాఖ్య మరోరకమైన ప్రజకు ఉదాహరణం. నరనారాయణులకు అన్వయించి అర్థవిశ్లే షను వివరించే శక్తి ఒకవైపు ప్రదర్శిస్తూనే, అన్నమాచార్యులకూ అయన్‌స్టీన్‌కూ ఉన్న సంబంధాన్ని సమీక్షించే ఆధునిక విజ్ఞానదృష్టిని మరొకవైపు ప్రదర్శించిన వైఖరి ఈ వ్యాఖ్య చూపిస్తుంది. వేదాంతం విజ్ఞానానికి విరుద్ధం కాదు; విజ్ఞానం భక్తికి విదేశీయం కాదని ఈ వ్యాఖ్య నిరూపిస్తోంది. ఆధునిక జీవితానికి అన్నమయ్యకు అన్వయించడం శ్రీసీతాపతిరావు గారి వ్యాఖ్య విశేషం.

వ్యాఖ్యకు జీవగర్ర తులనాత్మక పరిశీలనం. అది పూర్వకవుల కవితతో కావచ్చు; పూ ర్వశాస్త్రవిజ్ఞానంతో కావచ్చు; "సందెకాడ బుట్టినట్టి" కీర్తనకు వ్రాసిన వ్యాఖ్య ఇటువంటి శక్తికి నిదర్శనం. వర్ణ్యవస్తువు 'చందమామ'. వ్యాఖ్యసీమలో ధూర్జటికీ అన్నమయ్యకూ మధ్య తులనాత్మక పరిశీలనం. చందమామ పాటలోని అమృతవారాశిలో జ్యోతిశ్శాస్త్ర

రహస్యరత్నాల అన్వేషణ; చంద్రికామంత్రకళారహస్యమనే అమృతకోశంయొక్క ఆవిష్కరణ. ఇటు సాహిత్యం; అటు వేదోపనిషత్తులు; ఇటుశాస్త్రం; అటు మంత్రతంత్రాలు; ఇటు ఇహలోకం; అటు పరలోకం; ఇటు శృంగారం; అటు ఆధ్యాత్మికం - ఇన్ని దిక్కులా, అన్ని దిక్కులా, కమ్ముకున్న వ్యాఖ్య పరిపూర్ణతను సాధించుకున్న సాహితీయోగం. ఇలా వివరిస్తూపోతే ఎన్నో విశేషాలు; ఎన్నో రుచులు. ఈ అమృతం త్రాగండి; దేవతలుకండి; దేవ దేవుణ్ణి దర్శించండి. సంకీర్తన రచన అలమేలుమంగపతికి అక్షరార్చన; సంకీర్తన గానం శ్రీవేంకటేశుని భక్తికి అమృతవర్షిణి; ఈ వ్యాఖ్యానం ఆనందరూపుని కందించే మధురభక్తి నైవేద్యం. ఈ నివేదన స్వామికి 'అలమేలుమంగ అధరామృతం' సహృదయులకు "అమృతభావాల ఆలోచనామృతం".

డా. జి. వి. సుబ్రహ్మణ్యం
అధ్యక్షులు ఆంధ్రశాఖ
కేంద్రీయ విశ్వవిద్యాలయం
హైదరాబాద్.

ముఖారి (రేకు) - ఆది

ఆహోసాధు త - వాగమనం
బహుళవైభవైః - ప్రతివచనైఃకిం

తతోపసరమి - ధ్యా శరవచనై
రితస్త వైర్మమ - హితం కిం
బతమమదేహో - త్ప్రాణస్త ధాపి
గత ఏవైతత్ - కారణమిహకిం?

సంవృతిచేలం - జహిచపలత్వం
సంవాదేమే - సతతంకిం
త్వంవామమచి - త్తంసాత్వయసి
కింవా కురుమమ - ఖేలనమిహకిం?

అతిబిభేమి - భవదాచరణాదిహ
చతుర వేంకటా - చలరమణా
సతీం మామను - సరసికిమదర్థం
రతిరాజవిభవ - రచనమిదంకిం?

అన్నమాచార్యులు తన సంస్కృత సంకీర్తనలను స్వచ్ఛందంగా, స్వతంత్రంగా సర స్వతీకరించారు. ఆంధ్రవేదస్రష్టకు అమరవాణి ఎంత కరతలామలకంవలె ఉన్నదో, తన శృంగార పదాలలోని తెలుగు తేటల తేనెమాటలను, సంస్కృతంలోకి ఎక్కించి గీర్వాణ భాషకు ఏవిధంగా తెలుగు ఒరవడి తెచ్చారో ఆయన సంస్కృ త కీర్తనలు సందర్శించే భాగ్యవంతులకి తెలుస్తుంది.

ఈ కీర్తనలో నాయిక ముగ్ధ కలహాంతరిత శ్రీవేంకటాచలపతితో అంటున్నది. వచ్చా వా? (ఆశ్చర్యం) మంచిది వస్తేవచ్చావుగానీ, గొప్పగొప్ప కల్లబొల్లి కబుర్లు చెప్పకు.

నాదారికి అడ్డుగా నిలువకు లేలే. తొలగు నీ మిధ్యాశర వచనాలతో, దొంగ పొగడ్త లతో - నాకేంపని - నేను జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాను ( నీవు నాచెంతనే ఉండని కార ణాన) చెప్పవోయిబతుకుతున్నాను ( నీవు నాచెంతనే ఉండని కారణాన) చెప్పవోయి ఇం దుకు కారణమేంమంటావు? ఎవరంటావు?

నాతో మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకో - ఈ చిలిపి వేషాలేమిటి - నా చీర కొంగు విడిచిపెట్టు. నీవల్లనే నాకీమనస్తాపం అంతాను. నీవా నన్ను ఊరడించే వాడివి. నీవల్లకాదు(మమచిత్తస్య సాంత్వనే త్వమసమర్థ యేవ)  నీవేమి చేసినా ఏమీలాభం లేదు. నీ చేష్టలకి నేను ముచ్చట పడగలననుకొంటున్నావా?

నీవాలకం, నడవడీచూస్తే నాకు భయం వేస్తున్నది. నీవేమో గొప్ప చతురుడవు. నేర్పరివి. మీదుమిక్కిలి శ్రీ వేంకటాచలపతివి, నావెంట వెంట రావద్దంటే వస్తున్నా వెందుకు? నీ మన్మథవైభవపు రంగవల్లులు, స్మర సంక్రాంతి ముగ్గులు పెట్టడానికా ఎందుకు వస్తున్నావు?

శుభపంతు వరాళి - రూపకం

ఆకటి వేళల - అలపైన వేళల
తేకువ హరినామమే - దిక్కు మరిలేదు

కొఱమాలి యున్న వేళ - కులము చెడిన వేళ
చెఱవడి యొరులచే - జిక్కిన వేళ
నొఱపైన హరినామ - మొక్కటే గతిగాక
మఱచి తప్పిననైన - మఱిలేదు తెఱగు

ఆపద వచ్చినవేళ - యాఱడి బడినవేళ
పాపపు వేళల - భయపడిన వేళ
ఓపినంత హరినామ - మొక్కటే గతిగాక
మాపుదాకా బొరలిన - మరిలేదు తెఱగు

సంకెల బెట్టిన వేళ - చంప బిలిచిన వేళ
అంకిలిగా నప్పులవా - రాగిన వేళ
వేంకటేశు నామమే - విడిపించ గతిగాక
మంకుబుద్ధి బొరలిన - మరిలేదు తెఱగు

శృంఖలా బద్ధుడైన అన్నమాచార్యులు తన బాల్యమిత్రుడైన సాళ్వ నరసింగరాయలు ఆగడానికి ఖిన్నుడై పలికిన సంకీర్తన ఇది.

ఆకలియైనపుడు అలపు మిక్కిలియైనప్పుడు ఓదార్పు తరణోపాయము హరి నామ మేతప్ప వేరొక గతిలేదు.నిష్ప్రయోజకుడుగా ఉన్నప్పుడు - కులాచార భ్రష్టత కల్గినప్పుడు ఇ తరుల చేజిక్కినప్పుడు శరణ్యమైన హరినామస్మరణ మాత్రమే గతి. పొరపాటునగూడా వే రొక మార్గంలేదు.

ఆపదలు వచ్చినప్పడు ఆవేదనలు కల్గినప్పుడు పాపం మిక్కిలియై చరించేటప్పుడు - ధన మాన ప్రాణ భయాలు కల్గినప్పుడు యధా శక్త్యనుసార హరినామ సంకీర్తన మొక్కటేగాని, ఉదయాస్తమయందాకా ఎంత గింజుకున్నా మార్గాంతరం లేదు.

సంకెళ్లు తగిలించినవేళ - చంపకొనిపోయేవేళ - అప్పులవాళ్లు వేచి వున్న వేళల్లో శ్రీవేంకటేశుని నామమొక్కటే విడిపించగలిగిన గతి.  అది ఒక్కటే విమోచనకారి. మూర్ఖంగా ఇతరత్రా ఎంత అన్వేషించినా మరొక దారిలేదు అని ఈ సంకీర్తనం పాడగానే ఆచార్యుల చేతులకు వేసిన మూరురాయరగండ సంకెల తెగి కిందపడింది. ఈ అద్భుతం చూసి భయపడ్డ భటులు పరుగుపెట్టి రాయలకు ఈ సంగతి నివేదించగా రాయలుతానే స్వయంగా వచ్చి అన్నమాచార్యులతో 'నీ కనికట్టు విద్య నా ముందర పారదు. అంతమహిమగలవాడవైతే ఏదీ మళ్లీ పాడు. ఈసారి ఈ సంకెల విడిపించుకో చూద్దాం' అనితన ఎదురుగా మళ్లీ సంకెల వేయించారు. తన మిత్రుని అజ్ఞానానికి చిరునవ్వు చిందించారు అన్నమాచార్యులు.

నీలాంబరి రూపకం

అనతియ్యి గదవయ్యి - ఆకడ నీకడ నీకు
తానకపు కానుకలు - దక్కెనో దక్కదో

మోవితేని బోనాలు - మోసునవ్వు మోనాలు
ఆవల చెలి యొకతె - అంపె నీకదే
కాని కంటి కుంకుమలు - కమ్మవూర్పు సురటులు
ఈవల నీకంపితిని - యెక్కెనో యెక్కదో

చేసన్న వీడేలు - చిమ్ముగోరి మేడేలు
పోసరించి వేరొకతె - పుత్తెంచె నీకు
యీసు జెమట పన్నీరు - యింపుగాకల రతులు
వాసిగ నీకంపితిని - వచ్చెనో రాదో

పలుకుల కప్పురాలు - భావరతి చప్పరాలు
యెలమి శ్రీవేంకటేశ - యిచ్చే నెవ్వెతో
బలు సరసపు మొక్కు - పొన్నుపై కూటమి చొక్కు
తలకిక నీకిచ్చితిని - తనిసెనో తనియదో

శ్రీనివాసునికి ఇద్దరు భార్యలు. భూదేవి, శ్రీదేవి, కుడివైపు భూసతి, యెడమన శ్రీసతి అమరినారాయనకు. (శ్రీ వేంకటేశ్వరుడు తానొక్కడే ఉంటాడు. తిరుమలలో సతులిద్దరూ శంఖ చక్ర సంజ్ఞగా మిగులుతారు. శంఖు చక్రాల మధ్య తిరునామ సంజ్ఞ గా వెలసినవాడు స్వామి). ఈ భూదేవి - చక్రం - ఏమీ మాట్లాడడు. తిరుగుతూ తన పని తాను చేసుకుపోతూ ఉంటుంది. ఇక శంఖం శ్రీదేవి. (నవ నిధులలో ఒక నిధి శంఖం.) మధుర స్వ రాలు శంఖకంఠంలోనుండి  నీలాంబరి రూపకం

అనతియ్యి గదవయ్యి - ఆకడ నీకడ నీకు
తానకపు కానుకలు - దక్కెనో దక్కదో

మోవితేని బోనాలు - మోసునవ్వు మోనాలు
ఆవల చెలి యొకతె - అంపె నీకదే
కాని కంటి కుంకుమలు - కమ్మవూర్పు సురటులు

ఈవల నీకంపితిని - యెక్కెనో యెక్కదో

చేసన్న వీడేలు - చిమ్ముగోరి మేడేలు
పోసరించి వేరొకతె - పుత్తెంచె నీకు
యీసు జెమట పన్నీరు - యింపుగాకల రతులు
వాసిగ నీకంపితిని - వచ్చెనో రాదో

పలుకుల కప్పురాలు - భావరతి చప్పరాలు
యెలమి శ్రీవేంకటేశ - యిచ్చే నెవ్వెతో
బలు సరసపు మొక్కు - పొన్పుపై కూటమి చొక్కు
తలకిక నీకిచ్చితిని - తనిసెనో తనియదో

శ్రీనివాసునికి ఇద్దరు భార్యలు. భూదేవి, శ్రీదేవి, కుడివైపు భూసతి, యెడమన శ్రీసతి అమరినారాయనకు. (శ్రీ వేంకటేశ్వరుడు తానొక్కడే ఉంటాడు. తిరుమలలో సతులిద్దరూ శంఖ చక్ర సంజ్ఞగా మిగులుతారు. శంఖు చక్రాల మధ్య తిరునామ సంజ్ఞ గా వెలసినవాడు స్వామి). ఈ భూదేవి - చక్రం - ఏమీ మాట్లాడడు. తిరుగుతూ తన పని తాను చేసుకుపోతూ ఉంటుంది. ఇక శంఖం శ్రీదేవి. (నవనిధులలో ఒక నిధి శం ఖం.) మధుర స్వ రాలు శంఖకంఠంలోనుండి వినబడుతూనే ఉంటాయి. చెప్పవయ్యా నీవు అటునుంచి, ఇటునుంచి నీకు ఆస్థానపు కానుకలూ, ఈ స్థానపు కానుకలూ దక్కుతున్నాయా లేదా? అని ప్రశ్నిస్తున్నది. జావాబేమీయగలడు శ్రీనివాసుడు?

అధరామృతపు విందులు, సెలవినవ్వుల సంబరాలు అటువైపు చెలియ ఒక్కతె పంపినది నీకు (నేను చూశానులే అని ధ్వని సవతి పేరు చెప్పదు ఈర్ష్యాకషాయిత గనక)అందువల్ల ఎట్టనైన నా కంటి చూపుల కుంకుమలూ రోషోద్విగ్నపు కమ్మని, వెచ్చని, నిట్టూర్పుల ఉచ్ఛ్వాస నిశ్వాసాల వింజామరలూ యిటునుండి నేను పంపిచాను. ముట్టినవా ? లేదా ?

చేతి సొంజ్ఞల తాంబూలములు, కొనగోటి నొక్కుల సరసాలు అతిశయపు ఆత్మా హంకారం గల ఒకతె (నేనుగాని మరొకర్తె) నీకు పంపినది. యీసువేడి మూలాన గల్గిన జెమట పన్నీరు, కోవపు వేడి ప్రేమలు ప్రతిష్టాకరంగా నీకు నేను పంపినదానను. అవి వచ్చినవా ? లేదా ?

కప్పురం వంటి పలుకులు మనోభావములోని రతి శృంగారానుభవాలు. శ్రీ వేంక టేశా నీ కెవ్వేతయో యిచ్చినది. ఆమెది మానసికమైన అలరింపు మాత్రమే. సంసపు మొ క్కులతో, పొన్నపై కలయికలచొక్కులు మనోవాక్కాయకర్మలా (త్రికరణశుద్ధిగా) నేనునీ కిచ్చినాను. శృంగార రససిద్ధి గల్గిందా ? లేదా ?

శ్రీనివాసునికి పెద్ద చిక్కే వచ్చింది. 'అవునంటే భూదేవి పరంగా' అంటే తనపరంగా భావించగలదు శ్రీదేవి. తత్రాపీ తనను సాధించగలదు. అలదువల్ల నిరుత్తరముఖుడ య్యాడు ఆ దక్షిణనాయకుడు. శ్రీ వేంకటేశ్వరుని నోట మాట రానీయని అందాల మాట ల మూట అన్నమాచార్యుల ఈ పాట రసపు వూటల తేట.

భూపాలం - ఆది

అదివో అల్లదివో - హరి వాసము
పదివేల శేషుల - పడగలమయము

అదె వేంకటాచల - మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల - కపురూపము
అదివో నిత్యనివాస - మఖిలమునులకు
అదె చూడుడదె మ్రొక్కు - డానందమయము

చెంగట నల్లదివో - శేషాచలము
నింగినున్న దేవతల - నిజవాసము
ముంగిట నల్లదివో - మూలనున్న ధనము
బంగారు శిఖరాల - బహు బ్రహ్మమయము

కైవల్యపదము వేం - కటనగమదివో
శ్రీవేంకటపతికి - సిరులయినది
భావింప సకల సం - పద రూపమదివో
పావనములకెల్ల - పావనమయము

అన్నమాచార్యులు శ్రీవేంకటగిరిని పొడగని, భక్తిపారశ్యంతో, భావపారమ్యంతో పలికిన పదమిది. శ్రీవేంకటగిరి వైకుంఠంగా, ఏడుకొండల నిమ్నోన్నత శిఖరాలు అనంతుని మణిఫణాళిగా గోచరించాయి ఆ పరమభాగవతునికి.

అత్యున్నతమైన వేంకటాచలము, బ్రహ్మాదులకు సైతం అపురూపమై, అలవి కానిది. మునులందరికీ నెలవు ఇది. ఈ శేషాచలమే దేవతలందరికీ నివాసస్థలం. ముందరే ఉన్నది ఈ కొండపైన తిరుమందిరంలో దాగిన పెన్నిధి ఈ వేంకటగిరి బంగారు శిఖరాలు పలుబ్రహ్మల శిలాకారాలు. ఐశ్వర్యమంతా క్రోడించి, ప్రోదిచేసి ముద్దయై, శ్రీ వేంకటేశ్వరునికి, శ్రీనివాసునికి నివాసమైన శ్రీనివాసమిది. పరమపావనమైనది. పావనకరమైనది. ఇదే కైవల్యపదం. దర్శించండి - సాష్టాంగ దండప్రణామాలు ఆచరించండి అని భక్త సక్త ప్రపంచానికి ఈ ఉద్గాత సంగీత సందేశం సంకీర్తనగా సంతరించారు సంకీర్తనాచార్యులు.

'వేం కటతీతి వేంకటః - వేం పాపాన్ని కటతి - త్రుంచేది అని వేంకటశబ్దార్థం. పాప నాశనం చేసే ఈశ్వరుడు శ్రీవేంకటేశ్వరుడు. శ్రీ వేంకటేశ్వర స్మరణ దర్శనాదులచే నరులు దురితదూరులౌతారు.

యస్య స్మరణ మాత్రేణ జన్మ సంసార బంధనాత్
విముచ్యతే జగస్తస్మై విష్ణవే ప్రభవిష్ణవే

ఓం నమోవిష్ణవే ప్రభవిష్ణవే అని విష్ణు సహస్ర నామస్తోత్రం. ఎవ్వని స్మరించినంత మాత్రాన జన్మ సంసారాదిబంధాల నుండి విముక్తి లభిస్తుందో అట్టి విష్ణునికి, తనకుతానై ఆవిర్భవించే స్వయంభవిష్ణునికి ప్రణవపూర్వక నమస్కారం అని భావం. శ్రీమహావిష్ణువే శ్రీ వేంకటేశ్వరుడు.



శంకారభరణం - ఆది

అలరులు గురియగ - నాడెనదే
అలకల కులుకుల - నలమేల్మంగ

అరవిరి సొబగుల - నతివలు మెచ్చగ
అర తెర మఱుగున - నాడెనదే
వరుసగ పూర్వదు - వాళపు దిరుపుల
హరి గరగింపుచు - నలమేల్మంగ

మట్టపు మలపుల - మట్టెల కెంపుల
తట్టెడి నడమల - దాటెనదే
పెట్టిన వజ్రపు - పెండెపు దళుకులు
అట్టిటు జిమ్ముచు - నలమేల్మంగ

చిందుల పాటల - సిరి పొలయాటల
అందెల మ్రోతల - నాడెనదే
కందువ తిరువేం - కటపతి మెచ్చగ
అందపు తిరుపుల - అలమేల్మంగ

అలమేల్మంగ దివ్య నృత్య సంకీర్తనమిది. అలమేల్మంగ ఆడిన నాట్య ముద్రల అభిన య భంగిమల ఆట అన్నమాచార్యుల రసపు పూటల మాటల పాటగా పరిణమించింది. ఈ సంకీర్తనాగానం జరిగే యింట అలమేల్మంగ - శ్రీమహాలక్ష్మి నిత్య నృత్యమాడుతుంది. అధర్వణ రహస్యంలోని లక్ష్మీహృదయ మంత్ర స్తోత్రాన్ని ఈ చిందు విందుల పదంలో అం దంగా పొందుపరచారు ఆంధ్రవేదస్రష్ట.

తన ముంగురులు చెలరేగుతుండగా, నల్లత్రాచు వంటి జడ నర్తించగా, అందాలు కురిపిస్తూ అలమేల్మంగ నృత్యమాడింది. వికసించిన ఆమె సొబగులు, ఆ అలమేల్మంగ ఓ సపరితనాలు - అరవిరియై కనరాగా, వనితలందరూ మెచ్చేరీతిని సగం తెరచాటున అల మేల్మంగ నృత్యమాడింది. అలమేల్మంగయే లక్ష్మి. వనితలందరూ మెచ్చేది సౌభాగ్యం. సౌభా గ్యం లక్ష్మీ స్వరూపం. అరతెర మఱుగున - తొయ్యలుల పయ్యెదల చాటున - బంగారు మంగళసూత్రం రూపై, నానుతాడై, మంగళసూత్రానికి కట్టిన తాళిబొట్టుగా ప్రసిద్ధిగాంచి న ముత్తైదువతనపు వైభవమై నృత్యమాడింది ఆ జగన్మాంగళ్య సౌభాగ్యలక్ష్మి. నాట్యశాస్త్ర క్ర మానుసారంగా పూర్వదువాళపు తిరుపులతో - నాట్యారంభ వేళలో ఆచరించే - ప్లుతగతి కి సమానమైన - రంగస్థలం అంతా త్రుటిలో చరించే వేగధాటిగల ఆంగికమైన అభిన య ప్రదర్శనలతో శ్రీహరి మనసు రసార్ద్రమౌ విధంగా ఆ లక్ష్మీ లావణ్యవతి లాస్యమా డింది.

అభినయవేళ అలమేల్మంగ పాదాలంకారాలైన కెంపుల మట్టెలు - ఆమె మట్టమైన భంగిమలో ఆత్మ ప్రదక్షిణంగా తిరిగినప్పుడు చిందులు వేసినప్పుడు వజ్రాల గండ పెండేరాల కాంతులతో ఒరసి నలుగడలా వెదజల్లబడి ఒనరుతున్నవి. నాట్యోపయుక్తమైన ధాతు మాతువుల గానంతో, తాళ లయబద్ధమైన అడుగుల నమరిన నర్తనా నైపుణ్యంతో, అందెలు ఘల్లు ఘల్లున మ్రోయగా అలరి, రసజ్ఞుడైన శ్రీ వేంకటేశ్వర రసహృదయం పరవశించగా, అందమంతా - జగత్సౌందర్య సర్వస్వం తామే అయిన నృత్య లీలా గతుల తో అలమేల్మంగ నాట్యాభినయమాచరించింది. అన్నమయ్య పల్కిన పద కవితలతో అల మేల్మంగ నాట్యాభినయమాచరించింది. అన్నమయ్య పల్కిన పద కవితలలో అలమే ల్మంగా నృత్యగానం సౌభాగ్య లక్ష్మీ సావాహన నర్తన మంత్రమై సాక్షాత్కరించింది.

ఈ మంత్రఫలం - ఈ సంకీర్తనా గానబలం చేత దీనిని చదివే, గానం చేసేవారికి సౌభాగ్యమూ, భాగ్యమూ కూడా అలమేల్మంగా శ్రీస్వాముల కృప వల్ల నిస్సందేహంగా సిద్ధిస్తాయి.

## అమృతవర్షిణి - ఆది

అన్ని మంత్రములు యిందే - ఆవహించెను
వెన్నతో నాకు గలిగే - వేంకటేశు మంత్రము

నారదుడు జపియించె - నారాయణ మంత్రము
చేరె ప్రహ్లాదుడు నార - సింహ మంత్రము
కోరి విభీషణుడు చే - కొనె రామ మంత్రము
వేరె నాకు గలిగే - వేంకటేశు మంత్రము

రంగగు వాసుదేవ మం - త్రము ధ్రువుడు జపియించె
అంగవించె కృష్ణ మంత్ర - మర్జునుడు
ముంగిట విష్ణు మంత్రము - మొగి శుకుడు పఠించె
వింగడమై నాకు నబ్బె - వేంకటేశు మంత్రము

ఇన్ని మంత్రముకెల్ల - యిందిరానాధుడే గుఱి
పన్నిన దిదియే పర - బ్రహ్మ మంత్రము
నన్నుగావ గలిగెబో - నాకు గురుడీయగాను
వెన్నెల వంటిది శ్రీ - వేంకటేశు మంత్రము

అన్నమాచార్యుల అనుభవ వైభవమిది. అందరు దేవతలూ శ్రీవేంకటేశ్వరునందే నెలకొన్నారు. అన్ని మంత్రాలూ శ్రీవేంకటేశ మంత్రంలోనే ఆవహించి ఉన్న ఈ శ్రీవేంకటేశ మంత్రం అన్నమయ్యకు వెన్నతో కలిగిందట; ధన్యులైన ఆచార్యుల తల్లిదండ్రులు ఉగ్గుతో నిగ్గుదేర్చి పట్టించినదీ మంత్రమే.

నారదులు నారాయణ మంత్రాన్ని జపిస్తూఉంటారు. 'ఓంనమో నారయణాయ' అని నారాయణాష్టాక్షరి. 'నారాయణాయ విద్మహే వాసుదేవాయ ధీమహి తన్నో విష్ణుః ప్రచోద యాత్' అని నారాయణ గాయత్రి. ప్రహ్లాద భక్తాగ్రేసరుడు నారసింహ మంత్రాన్ని చేరినాడు. 'ఓం శ్రీమద్దివ్య నృసింహాయ' అన్న మంత్రంలో బీజాక్షర జపరూపం నృసింహ మంత్రం - ఓం వజ్రనఖాయ విద్మహే తీక్ష్ణ దంష్ట్రాయ ధీమహి, తన్నో నారసిగ్ంహః ప్రచో దయాత్ - ఇది నృసింహ గాయత్రి 'శ్రీరామశ్శరణంమమ' ఇది శ్రీరామ రక్షా మంత్రం. విభీషణుడు చేసిన శ్రీరామ శరణాగతి మంత్ర మిదే. ధ్రువుడు జపించిన వాసుదేవ మంత్ర గాయత్రి - 'ఓం వాసుదేవాయ విద్మహే మహా హంసాయ ధీమహి తన్నో విష్ణుః ప్ర చోదయాత్' అర్జునుడు ఆశ్రయించినది కృష్ణమంత్రం - ఓక్లీం కృష్ణాయ గోపీజన వల్లభా య నమస్స్వాహా;' ఓం వాసుదేవాయ విద్మహే దేవకీసుతాయ ధీమహి తన్నః కృష్ణః ప్రచోద యాత్' అని కృష్ణ గాయత్రీ మంత్రం. ధ్రువుడు సాధించినది విష్ణు మంత్రము. పైన చెప్పిన మంత్రాలన్నీ విష్ణు మంత్రాలే. ఆ విష్ణు మంత్రాలన్నిటికీ లక్ష్యం శ్రీమహావిష్ణువే. ఇదే పరబ్రహ్మమంత్రం. (ఆనంద పరంబ్రహ్మేతి యోనిః- విష్ణు సహస్రనామస్తోత్రం) ఇందరిని యిన్ని విష్ణు మంత్రాలు రక్షించినవి నన్ను రక్షించడానికే ఏర్పడినట్లున్న.. అస్మదాచార్యుడు నాకనుగ్రహించిన మంత్రం శ్రీవేంకటేశమంత్రం. వెన్నెల వంటిది ఇది మనసుకెంతో ఆహ్లాదమొనర్చేది - అని బాహ్యార్థం. సహస్రదళకమలోపరి చంద్రుడు చిందించే బ్రహ్మానం దానుభవజ్యోత్స్నలవంటిది అని గూఢార్థం.

'ఓం నమో వేంకటేశాయ' అన్న అష్టాక్షరీ మంత్రంలో తక్కిన మంత్రాలన్నీ ఇమిడి ఉన్నవి. అన్నమాచార్యుల మనోవాక్కర్మలలో స్థిరనివాసం ఏర్పడింది ఆ వేంకటేశ మంత్రా నికి. శ్రీ వేంకటేశ్వర కరుణామృతవర్షిణీ విలాసం ఆ మంత్ర ప్రభావంవల్ల సంకీర్త నాచార్యులకు సతమైన సొమ్మై ఇమ్మైంది.

పాడి - ఆది

అంటి నిన్ను బాయలేని - దాపె తలనేవేగేనా
వెంట వెంట దిరుగరా - వెలదు లెల్లాను

తలకొని నీమోము - తప్పక చూచితేను
వలవరా యెటువంటి - వనితలైనా
సెలవుల నేపాటైనా - చిరునవ్వు నవ్వితేను
మొలవవా పులకలు - మోపుల కొలదులు ?

చనవున నీతోను - సరసములాడితేను
మనసులు కరగరా - మగువలెల్లా
యెనసి నీతోగన - యేపాటి మాటాడినాను
తనుదానె కాగిళ్ళు - తగులు కోకుండునా

నివ్వటిల్లు తమకాన - నీమేను సోకితేను
నివ్వెరగు బొందరా - నెలతలెల్లా
రవ్వగా శ్రీ వేంకటేశ - రతి నలమేలుమంగ
యివ్వల కూడినందుకు - హెచ్చవా వేడుకలు

అన్నమాచార్యులు అద్వైతి. వేంకటేశ్వర పరచర్చకై పరమాత్మ జీవాత్మ లిద్దరు ఏర్పడాలి గనుక ద్వైతం ఆయన పదాలలో సాక్షాత్కరించింది.

'ఆవామే వామార్ధే సకలము భయాకార ఘటనాత్
ద్విధా భూతం రూపం' అన్నట్లుగా పరమేశ్వరుడు ఒక్కడే. ప్రకృతి పురుషులిద్దరు. రససిద్ధికి ఇద్దరూ ఉండాలి. రస రసాస్వాదు లిద్దరూ. ఏకత్వనుండి ద్వైతం' అనేకత్వం కలగటంగూర్చి మయూరమహాకవి చెప్పిన చక్కని శ్లోకం ఉన్నది సూర్యశతకంలో

ఏకంజ్యోతిః దృశౌద్వే త్రిజగతి గదితాన్యబ్జ జాస్యై శ్చతుర్భిః

భూతానాం పంచమం యాన్య లమృతుషు
తధాషట్సు నానావిధాని

యుష్మాకం తాని సప్తత్రిదశ ముని మతాన్యష్ట దిగ్భాంజి

భానోర్యాంతి ప్రాప్తే నవత్వం దశ దధతు శివం దీధి

తీనాం శతాని

అది ఒకే వెలుగు రెండు (కన్నుల) చూపులుగా మూడులోకములలో నాలుగు ము ఖాల బ్రహ్మచేత అయిదు భూతాల రూపమై ఆరు ఋతువుల కాల విధానమై ఏడుగురు మహర్షుల సతులు స్వీకరిస్తూ, ఎనిమిది దిక్కులనూ కాంతింపజేస్తూ ప్రభాతవేళ నిత్య నవమైన (తొమ్మిదియైన) రవి అరుణోదయ కాంతులు మీకు పది నూఱుల శుభములు ఒనర్చుగాక అని స్థూలార్థం. ఒక వెలుగే ఇన్నీ అయినది.

నిరతి శయమైన ప్రేమ శృంగారరసానికి స్థాయీభావం.
దానికేరతి అని వ్యవహారం. (రతి అంటే సామాన్యార్థంలో తెలిసే స్త్రీ పురుష శారీరక సంగ మ సుఖం అన్న అర్థం ఇక్కడ నిరర్థకం) రసమంటే ఏమిటి? రసమే బ్రహ్మం అనిశ్రుతి ర సోవైసః ర స గ్గ్ హ్యేవాయగ్ం లబ్ధ్వానందీ భవతి అని తత్ప్రమాణం. శ్రీవేంకటేశ్వరుడు ర సపరబ్రహ్మ. ఆయనను జగమంతా వెతుకుతూ ఉంటుంది. జగమంతా ఆయన నిండి ఉ న్నా జగత్తులోని ప్రత్యంశమూ ఆయన అయి, ఆనందాన్ని పొందుదామని ప్రయత్నిస్తుంది. ద్వైతం అద్వైతమౌతుందన్న మాట. అనేక రూపమైన సృష్టి పరమానంద స్థితిలో పరమే శ్వరునితో ఐక్యం చెందుతుంది. ఆ ఆనందమే బ్రహ్మ. ఆ కారణంగానే భూతాదులన్నీ ఉద్భ వించి, వసించి లయిస్తున్నాయి అని తైత్తిరీయోపనిషత్తు (ఆనందం బ్రహ్మేతివ్యజానాత్ ఆ నందాయేఖల్విమాని భూతాని జాయంతి యేనజాతాని జీవంతి -భృగువల్లి) ఆనందాన్వే షులై తపిస్తూ పరతత్వాన్ని చేరే జగత్తంతటికీ ప్రాతినిధ్యం వహించేవారు మునులు, యో గులు, భక్తులు, సాధకులు. ఈ జగత్ప్రతినిధులకు ప్రాతినిధ్యంవహించేవారు అన్నమాచా ర్యుల శృంగార నాయికలు. వారిలో ముఖ్య ప్రతినిధి అలమేల్మంగ. ఆమె గుణస్వరూప స్వ భావాలే అన్నమాచార్యుల మధుర భక్తి తత్వ స్వరూపస్వభావం ప్రకృత సంకీర్తనలో అన్న మాచార్యుల భక్తితత్వం అతిప్రౌఢమై, అలమేల్మంగయై పరమేశ్వరాన్వేషియైన చరాచర జగత్తంతటికి ప్రాతినిధ్యం వహించింది.

శ్రీ వేంకటేశ్వరునితో యితర నాయికలందరూ (మునులు, యతులు, గోపికలు, అన్నమాటలివి. నిన్ను ముట్టి నిన్ను విడచి ఉండలేనితనం ఆమెలో మాత్రమే ఉదయిం చినదా? నిన్ను విడజాలక స్త్రీ లంతా (జగత్తంతా) నీ వెంట తిరగటం లేదా? (మూలాధార చక్రధ్వని.)

నీ ముఖపద్మం జూడగలిగితే ఎంతటివారైనా సమ్మోహితులుకారా? వారి కోర్కెలు నీ ముఖదర్శనంవల్ల తీరుతాయని భావించరా? (మణిపుర చక్రం అని ధ్వని). నీవు

చిన్న చిరునవ్వు నవ్వితే ఆ దీప్తికి వారి మేన పులకలు మోపులుగా పొడమవా? (చిరు నవ్వు దీప్తి స్వాధిష్టానచక్రమని సూచన).

నీతో చనువుతో సరస క్రియలు చేస్తే వారి ఎదలు కరగిపోవా? (అనాహత చక్రం) నీతో యేమాత్రపు సంభాషణ నెరపినా నీ కౌగిలిలోకి తమంత తాము బంధింప బడరా (విశుద్ధ చక్రం)

ఉధృతమైన ప్రేమతో నీ మేనిస్పర్శ గలిగితే దిగ్భ్రాంతి చెంది చేష్టలు దక్కరా? (ఆజ్ఞా చక్రం జితమనోవస్థ). శ్రీవేంకటేశ్వరా; భక్త జగత్తతినిధియైన అలమేల్మంగ నిన్ను కూడితే, నీవామెను కలసితే అనుపమానమైన ఆనందం జగత్తుకే కలుగదా? (త్యాగరాజస్వామి పంచరత్న కీర్తనలో జగదానందకారక జయజానకీ ప్రాణనాయక అన్న సంబోధన భావ మిదే. జానకీ ప్రాణనాయకు (అలమేల్మంగను గలిసినాడుగనుక) డైనాడు గనుక, ఆ జానకి జగద్రూపగనక ఆయన జగదానంద కారకుడైనాడు. అలమేల్మంగయే జానకి. సీతాపతియే శ్రీనివాసుడు. అన్నమాచార్యులే త్యాగరాజస్వామి. ఈ కీర్తనలోని క్రియావా చక పదాలు వెంట వెంట తిరుగుట, మోము చూచితే వలచుట, పులకలు మొలచుట, మనసులు కరుగుట ఇత్యాదులు అన్నీ భక్తుడైన యోగికీ, ప్రేమాస్పదయైన శృంగార భామకూ సమానం.

'ఇదిగాక సౌభాగ్యమిదిగాకతపము' అన్న సంకీర్తనవలె ఇందుకూడా యోగతంత్ర విషయాలైన షట్చక్రాలు సూచింపబడ్డవి షట్చక్రాల ఉనికి యోగి శరీరానికి. నాయిక దేహానికీ సమానం. పరబ్రహ్మానంద పదాన్ని, షట్చక్రాలని తనకుండలినిచే అధిగమించి పొందుదామన్న యోగి జ్ఞాతప్రయత్నమూ, శ్రీవేంకటేశ్వరుని వరునిగా పొందుదామని శృంగార రసపరాకాష్టకై నాయికలు చేసే ముగ్ధయత్నమూ సమతౌల్యాలు. సహస్రారకమ ల స్థితికి వచ్చేటప్పటికి, శ్రీవేంకటేశ్వరునితో రతిగూడిన అలమేల్మంగ రూపు నాయికకూ యోగికీ సిద్ధించింది. వారిరువురకూ అభేదమేర్పడింది. ఆ యోగియే అన్నమాచార్యులు. ఆ నాయిక అలమేల్మంగ. అలమేల్మంగయే అన్నమాచార్యులు. అన్నమాచార్యులే అలమేల్మం గ అయ్యారు. ఆ స్థితిలో వారు - ఏకాకృతినొందిన యోగుల నాయికల ప్రతినిధియై, ఆయారూపుల తనలో ఐక్యం చేసుకున్న అలమేల్మంగ రూపు పొందిన అన్నమాచార్యులు స్వామిలో లీనమయ్యారు. స్వామికి సంతోషమైనది జగత్తుకు ఆనందం కలిగి బ్రహ్మానుభ వమైనది అద్వైతంలో ఆరంభమైన ద్వైతం అద్వైతంలో అంతర్లీనమైనదని, ద్వైతాద్వైతాలు పరస్పరాశ్రయాలు అని అద్వైతాన్ని ఆవిష్కరించారు అన్నమాచార్యులు.

పూర్వీకల్యాణి ఆది ( ఖండగతి)

అటువంటి వైభవము - లమర జేసినదైవ
మిటువంటి యోగంబు - లిన్నియును జేసె

జలజాక్షి లావణ్య - జలధి నుప్పొంగించ
నలివేణి ముఖచంద్రు - డభ్యుదయ మాయె
కలికి వలరాయడను - కాలకూటంబుతో
తలకొన్న అధరామృ - తంబు జన్మించె

వనిత సౌభాగ్యంబు - వనధిలోపలదోచె
గొనకొన్న గుబుతైన - కుచపర్వతములు
తనివోని కోరికల - తగుతురంగములతో
ననువైన విరహబడ - బానలము గలిగె

భామయవ్వనమనెడి - పాలజలనిధిలోన
వామాక్షియైన య - వ్వన లక్ష్మిగలిగె
యీ మంచి తిరువేంక - టేశ్వరుండిందులో
ప్రేమమున సుఖియించి - పెంపొందగలిగె

ప్రబంధ కవులెందరో శృంగార వర్ణనలు చేశారు. తమతమ నాయికల శృంగార సౌందర్యాలను ఆకాశానికెత్తి వర్ణించారు. అందుకు అల్లసానిపెద్దన వరూధిని, భట్టుమూర్తి గిరికా ఉదాహరణలు. ప్రబంధ కవులు అనేక పద్యాలలో చేసిన అంగాంగ వర్ణనలన్నీ ఒక కీర్తనలోనే పక్కకునెట్టి, వైకుంఠమెక్కి, ఒక అపూర్వసౌందర్యగంగాలహరిని ఆవిష్కరించిన మహాకవి అన్నమాచార్యులు. ఈ సంకీర్తన అందుకు తార్కాణం.

ఆ దైవం అలాంటి వైభవములు అమరునట్లుగా సృష్టించాడు ఆ దైవమే యిటువంటి యోగాలు ఇన్నీ కూడా తానే ఒకరించాడు. క్షీరసాగరం మథించగా (ఆ దైవం కూర్మమై మథింపజేయగా)అందులో లక్ష్మి ఆవిర్భవించి, ఆమెయే అలమేల్మంగ అయినది. తామరలవంటి కన్నులుగల ఆమె లావణ్య సముద్రాన్ని ఉప్పొంగించడానికి చంద్రుడు (మె ముఖరూపుడై) తన చంద్రజన్మకన్న గొప్ప జన్మ అయిన అలమేల్మంగా ముఖ చంద్రుడైనాడు. స్త్రీ రూపం ధరించిన మన్మధుడనే కాలకూట విషంతోబాటు అలమేల్మంగ అధరామృతం కూడా ఇమ్మడిగా ఉద్భవించింది. ( ఐహిక సుఖాలతో శరీరం శిథిలమౌతుంది గనుక మన్మధుడు విషతుల్యుడని భావన. ఐహిక విషయవిషాల చేదెరిగిన అన్నమయ్య ఆ తల్లి అమృతమయమైన ముద్దుల రుచికూడా యెరుగును.)

అలమేల్మంగ సౌభాగ్యం అపారమైనది, అనంతమైనది. మహాజలధివంటి ఆమె సౌభాగ్యం (మంగళసూత్రం) లోపల (వెనుక) శాత చూచుక శిఖర సంయుతమైన ఆమె స్తన పర్వతాలు దోబూచులాడినవి (అలమేల్మంగా స్తనంధయుడు అన్నమాచార్యులు కాని పక్షంలో ఇంత అందం ఇంత మాధుర్యం అన్నమయ్య పదాలలో వచ్చే అవకాశం లేదు). మైనాకాది పర్వత పంక్తులు ఇంద్రుడికి వెరచి సాగరంలో దాగిన విషయం పురాణ గ్రథితం. తనివి తీరని కోరికలు అనే ఉచ్ఛైశ్రవాలు - జాతి అశ్వాలతోబాటు అలమేల్మంగా సౌందర్యమహా సాగరంలో విరహ బడబానలం (సముద్రంలో ఉండే అగ్ని) కలిగినది. బడబ అంటే అదు గుఱ్ఱం. బడబకు కల్గే విరహతాపం బడబానలము అని చమత్కరిస్తున్నారు.

అలమేల్మంగ యౌవనం అనే క్షీరవారాశిలో అలమేల్మంగా స్వరూపం అయిన ఆమె యవ్వన లక్ష్మి కలిగినది. పోల్చడానికి, పోల్చబడటానికీ ఉపమలు లేని కారణంగా అలమేల్మంగ తనరూపమూ, తన సౌందర్య రూపంకూడా తానే ధరించింది. అనుపమ అయిన ఆమెనూ, అనుపమానమైన ఆమె సౌందర్యాన్నీ ఉపమించాలంటే ఆ అందాల అలమేల్మంగ రెండు రూపాలు ధరించవలసినదే తప్ప వేరే మార్గం లేదుట. ఇన్ని యేర్పాట్లు ఇలా జరిగాయి గనుకే మా తిరువేంకటేశ్వరుడు ఇందులో, ఈ సౌందర్య లావణ్య క్షీరసాగరంలో ప్రేమలలో శయనించి సుఖించవీలైంది. ఇది అంతా ఆ క్షీరజలధి శయనుడైన దైవమే ఒనరించాడు. ఆ దైవమే ఆ క్షీరాబ్ధిలో శయనించి సుఖించాడు. భోజ్యమూ, భోక్తాకూడా ఆ స్వామియైనాడని అన్నమాచార్యుల అనన్వయాలంకార చర్చ.

ముఖారి - ఆది

బ్రహ్మకడిగిన - పాదము
బ్రహ్మము తానేనీ - పాదము

చెలగి వసుధ కొలి - చిననీపాదము
బలి తల మోపిన - పాదము
తలకకగగనము - తన్నిన పాదము
బలరిపు గాచిన - పాదము

కామిని పాపము - కడిగిన పాదము
పాముతల నిడిన - పాదము
ప్రేమపు శ్రీసతి - పిసికెడి పాదము
పామిడి తురగపు - పాదము

పరమ యోగులకు - పరి పరి విధముల
వరమొసగెడి నీ - పాదము
తిరువేంకటగిరి - తిరమని జూపిన
పరమపదము నీ - పాదము

అది వామనావతార విజృంభణ వేళ. మూడడుగుల భూదానాన్ని మూడు అడుగులుగా భూమినీ, సమస్తాంతరాళాన్నీ ఆక్రమించుకొంటూ పెరుగుతున్న విష్ణు పాదం సత్యలోకాన్ని చేరి, మించి, దాటిపోయే సమయంలో బ్రహ్మ విష్ణుపాదానికి అభిషేకమొనరించాడు. బ్రహ్మగడిగిన నీ ఆ పాదమే పర బ్రహ్మము, అని స్వామి పాద సంకీర్తనం చేశారు అన్నమాచార్యులు. తిరుమల వెళ్లే బాటలో మొదటి మెట్టును అడిపిడి అంటారు. అక్కడ స్వామి పాదాలు ఉన్నవి.

భూమినంతా తానై కొలచిన నీ పాదము (అదే పరబ్రహ్మము) భూమి ప్రమాణం నీ పాదమని భావం. బలి తలపై మోపిన ఆ పాదమే పరబ్రహ్మము. సువిశాల గగనవైశాల్యాన్నీ, ఔన్నత్యాన్నీ లెక్కగొనక తన్నినది (ఆక్రమించినది) ఈ పాదము బలరిపుడైన యింద్రుని సంరక్షింప నవతరించిన శ్రీ వామను పాదమే ఇది.

కామినియైన అహల్య (కాముకయైనది కామిని) కామపు దోషాన్ని తన స్పర్శమాత్రంచే తొలగించిన శ్రీరామ శ్రీపాదమే ఇది. మడుగులోని పొగరుబోతు పాములరాజు కాళీయుని తలపై నృత్యమాడిన శ్రీకృష్ణుని ముద్దు పాదమే ఇది. ప్రేమ ముప్పిరిగొనగా శ్రీ మహాలక్ష్మి ఒత్తే శ్రీ మహావిష్ణు పాదమే ఇది.గరుత్మంతునిపై గుఱ్ఱమెక్కినట్టు అధిరో

హించే పాదమిది. (పాము ఇడి పామిడి ఇడి శబ్దం అభావ సూచక వాచకం. పాముల ను లేకుండా చేసేది గరుత్మంతుడు.ఉదాహరణ - ముక్కిడి.  ఈ పామిడి శబ్దం అన్నమ య్యగారి శబ్దాధికార సూచన)పరమమునులకు, యోగులకు ఎన్నో విధాల, ఎన్నెన్నో వరాలిచ్చే నీ శ్రీపాదమే తిరువేంకటగిరిని శాశ్వతానంద లబ్ధి కలదని చూపినది. ఆ శాశ్వ తానంద పరమపదమే నీ శ్రీపాదము - అదే పరబ్రహ్మము అని చాటారు అన్నమాచార్యు లు. ఈ సంకీర్తనలో 'పాదము' పైన అంత్యాను ప్రాస గమనించదగిన శబ్దాలంకారం. పో తనగారు వామనావతార ఘట్టంలో ఒక పద్యంలో ఇదే శబ్దానుప్రాస వాడారు.

బలి దైతేయ కరాక్షతోత పవిత్రాంభః కణ శ్రేణికిన్
జలజాతాక్షుడు సాచె మౌని సుమనస్సంప్రార్థిత శ్రీదమున్
కలితానమ్ర రమాలలాట పదవీ కస్తూరికా శాదమున్
నలినా మోదము రత్న నూపురిత నానా వేదమున్ పాదమున్ అనీ

గాన మూర్తి - ఆది

చేకొంటి నిహమే - చేరిన వరమని
గైకొని నీవిందు - గలవే గాన

జగమున గలిగిన - సకల భోగములు
తగిన నీప్రసా - దము లేయివి
అగపడు నేబది - యక్షర పంక్తులు
నిగమ గోచరపు - నీ మంత్రములే

పొదిగొని సంసార - పుత్ర దారలిల
వదలని నీదాస - వర్గములే
చెదరక యే పొద్దు - జేయునాపనులు
కదిసి నియ్యాజ్ఞా - కైంకర్యములే

నలుగడ మించిన - నాజన్మాదులు
పలుమరులిటు నీ - పంపులివి
యెలమిని శ్రీవేంక - టేశ్వర నీవిక
వలసినప్పుడీ - వరములు నాకు

శ్రీవేంకటేశ్వర చరణకమల సమర్పిత హృత్కమలుడైన అన్నమాచార్యులు తన సర్వస్వమూ తననూ, తనవారినీ, తన భోగభావాలన్నిటినీ శ్రీస్వామికి కైంకర్యం చేసి 32 వేల సంకీర్తనలను సరస రసామ్నాయంగా సంతరించి, స్వామికి సమర్పించి ఆయనకే శరణుజొచ్చి సాకల్యమైన శరణాగతి చేసిన వైఖరి ఈ సంకీర్తనంలో కన్పడుతున్నది.

నీవు ఇహంలోకూడా ఉన్నావుగదా అని ఇదే పరమూ, పరమార్ధ సాధనమూ అని స్వీకరించాను. ఈ జగత్తులో నాకు గలిగిన సకల భోగములూ నీ వరప్రసాదాలే. నాకు గోచరించే ఈ 56 అక్షర వర్ణక్రమాలూ వేదాలలో దర్శనమిచ్చే నీ మంత్రాలే నా సంసారిక జీవనంలో గల్గిన భార్యలు. సంతానం - అంతా నీ దాస దాసీజనమే. నేనపుడు ఏమి ఒనర్చినా ఆయా కర్మలన్నీ నీ ఆజ్ఞమేరకు ( నన్ను సృజించినది, పెంచినది, కరుణించిగాచినది నీవేగనుక) నీకు కైంకర్యమైనవే (యద్యత్కర్మకరోమితత్తదఖిలం శంభోతవారాధనం అన్న శంకరుల మాట పునరుద్ఘాటితమైంది) నేనెత్తిన ఈ జన్మ నీ సంకల్పమే (నాచే సంకీర్తనలు ఒనరించు కొందామనీ, నా పదకవితా, గానమూ విందామనీ నీవే యివన్నీ

ఏర్పరచావు. నాది అంటూ ఏముంది?)కర్త-కర్మ- క్రియా అన్నీ నీవే నేను చేసినదేమిటి ? నాకేమీ అక్కరలేదు. నీవేనేనైప్పుడు నాకేమి యిక - నాకు అవసరమైనప్పుడు శ్రీవేంకటేశ్వరా అవసరమైన వరములిద్దుగాని అన్న అన్నమాచార్యుల ప్రౌఢమైన శరణాగతిని చూస్తే కవిబ్రహ్మ తిక్కనగారు 15 పర్వాల మహాభారతమూ పూర్తిచేసి

పరమపదాప్తి హేతువగు భారత సంహిత శౌనకాదిభూ
సురువరు లింపునన్ గరగు చొప్పున జెప్పిన, వారుమోదసం
భరిత తబొంది యక్కధకు బ్రాతిగనర్చితుజేసిరెమ్మెయిన్
హరిహరనాథ సర్వభువనార్చిత నన్దయ జూడుమెప్పుడున్

అన్న పద్యం స్ఫురిస్తుంది. నిత్యమూ నన్ను దయజూడు మన్నారు కవి బ్రహ్మ దయతో ఆదరిస్తూనే ఉన్నావు అన్నారు పదకవితాబ్రహ్మ వారు ఇద్దరూ కూడా వారికేమి వరాలు కావాలో చెప్పలేదు ఎందువల్ల ? కవిబ్రహ్మ సోమయాజులూ, పదకవితాబ్రహ్మ అన్నమాచార్యులూ ఉభయులూ సిద్ధ పురుషులు, పరిపూర్ణులు. నిష్కామధన్యులు అని ఘంటాపథంగా చాటి చెప్పవచ్చు.



మోహన - రూపకం

దాచుకో నీ పాదాలకు - దగ నేజేసిన పూజలివి
పూచి నీకీలితి రూపు - పుష్పములివియయ్యా

ఒక్క సంకీర్తనే చాలు - వొద్దికై మమ్ము రక్షింపంగ
తక్కినవి భాండారాన - దాచివుండ నీ
వెక్క సమగు నీ నామము - వెలసులభము ఫలమధికము
దిక్కై నన్నేలితి వి - తీరని నాధనమయ్యా

నా నాలికపైనుండి - నానా సంకీర్తనలు
పూని నాచే నిన్ను - బొగడించితివి
వేనామాల వెన్నుడా - వినుతించనెంతవాడ
కానిమ్మని నాకీ పుణ్యము - గట్టితివింతేనయ్యా

ఈ మాట గర్వము కాదు - నీ మహిమేకొనియాడితిగాని
చేముంచి నా స్వాతంత్ర్యము చెప్పినవాడగాను
నే మాన బాడేవాడను - నేరము లెంచకుమీ
శ్రీమాధవ నేనీదాసుడ - శ్రీవేంకటేశ్వరుడవయ్యా

'శ్రీరామ రామరామేతి రమేరామే మనోరమే
సహస్రనామతస్తుల్యం రామనామవరాననే
శ్రీరామనామవరానన ఓం నమ ఇతి' అని పరమేశ్వరుడు

పార్వతీదేవికి చెప్పినట్లు విష్ణుసహస్రనామస్తోత్రంలో ఉత్తరపీఠికలో పేర్కొనబడింది. శ్రీవిష్ణుని వేయినామాలకు మించుమలె ఒక్క శ్రీరామ నామం చాలునట. కలిలో ఇతర పూజావిధులు అనవసరం. సంకీర్తనమొక్కటే చాలు. 'వేనామాల వెన్నుడా' అని సంబోధన. వేయి పేరులున్న నీకు నేను 32వేల సంకీర్తనలు నివేదించాను. అది నా ప్రజ్ఞేమీకాదు. నా రసనాసనంపై నీవుండి వీటిని పలికింప జేశావు. నేనెంతవాడినయ్యా నిన్ను పొగడగలందుకు. పోనీలే గదా అని ఈ పుణ్యం నాకు కట్టి పుణ్యం కట్టుకున్నావు. కానీ నీవే భోక్తవు. నీవే భోజ్యానివి.

ఈ సంకీర్తనలు నీకై పూచిన, నీవు పూయించుకొన్న నానా జాతుల, నానారీతుల జాతి పువ్వులు. సుస్వరవర్ణ మంత్రపుష్పాలు. ఇవి నా సంపద ఇవి నా సర్వస్వం. నీ శ్రీపదాలకు నేను జేసిన పదపూజలు. వీటిని జాగ్రత్తగా పదిలపరచు. ఒక్క సంకీర్తన చాలు నా జన్మ తరించడానికి. తక్కినవి అన్నీ నీ శ్రీభాండారంలో దాచుకో. రసజగత్కల్యాణానికి ఇవి మూలధనం.

"ఈ మాట నేను గర్వించి పలకటం లేదు. నీ మహిమే ఉగ్గడించానుకానీ, నా అంతట స్వతంత్రంగా నేను ఉద్వచించినదికాదు. నీ సంకీర్తనాగానం చేసే వాడివి. నా పూర్వపాపాదులు ఇప్పుడెందుకు. నీ దాసుడిని నేను. అయ్యా నీవు శ్రీవేంకటేశుడివి. సర్వదోష నివారక నామధేయుడవు: గ్రహించు" అని. ఆంధ్రవేదాభివక్త, పదకవితాపితామహులు అన్నమాచార్యులు తన సంకీర్తనా సామ్రాజ్యం సర్వస్వం శ్రీవేంకటేశ్వర శ్రీపదార్చనగా కైంకర్య మొనరించి, ధన్యుడై, తన కవితను విన్నవారినీ, తన పదములు పాడగన్నవారినీ ధన్యత నొందిస్తున్నారు.

శుభపంతు వరాళి - ఆది

ఏ కులజుడైన నేమి - యెవ్వడైన నేమి
ఆకడ నాతడె - హరినెరిగిన వాడు

పరగిన సత్య సం - పన్నుడైన వాడే
పరనింద సేయ త - త్పరుడు గానివాడు
అరుదైన భూతద - యానిధి యగువాడె
పరులు తానేయని - భావించు వాడు

నిర్మలుడై ఆత్మ - నియతి గలుగువాడె
ధర్మ తత్పర బుద్ధి - తగిలిన వాడు
కర్మమార్గములు - గడవని వాడె
మర్మమై హరిభక్తి - మరువని వాడు

జగతిపై హితవుగా - జరియించు వాడు
పగలేక మతిలోన - బతికిన వాడు
తెగి సకలము నాత్మ - దెలిసిన వాడే
దగిలి శ్రీ వేంకటేశు - దాసుడైన వాడు

తన సంకీర్తనలలో ఉపనిషత్తులనూ, ఋగ్మంత్రాలనూ ఇమిడించి 'ఆంధ్రవేదం' అన్న మాటను తన సాహిత్యానికి పర్యాయపదంగా ప్రతిష్టించిన పదకవితాపితామహుడు అన్నమాచార్యులు. ఈ సంకీర్తనలో భగవద్గీత రెండవ అధ్యాయంలో శ్రీకృష్ణపరమాత్ముడు ఉద్వచించిన స్థితప్రజ్ఞుని లక్షణం నిర్వచితమైనది. భగవద్గీత పంచమవేదమైన భారతాంతర్గతం. వేదాలన్నింటినీ తనలో ఇముడ్చుకొన్న ఆంధ్రవేదం అన్నమాచార్యులది.

జన్మవల్ల ఎవరికీ ఉన్నత కలగదు. కర్మపరిపాకం వల్ల మాత్రమే ఔదాత్యం కలుగుతుంది. ఏకులంలో జన్మించినా జీవనోపాధికై ఏ వృత్తి అవలంభించినా చివరకు పరమేశ్వరత్వాన్ని జ్ఞానమార్గంలో తెలిసికొని ఆ తత్వసారాన్ని ఆకళింపు జేసుకోగలవాడు, హరి భక్తి అనే ఆలంబనగలవాడు, అతడే స్థితప్రజ్ఞుడు. అతని లక్షణాలివి.

1. సత్యభాషణ 2. పరనిందా పరాన్ముఖత్వం 3. అపారభూతదయ 4. 'ఆత్మవత్సర్వ భూతాని' తనవలె జగత్సర్వాన్ని దర్శించే లక్షణం 5. శమదమాది ఆత్మ సంయమనం

6. ధర్మతత్పరత 7. వైదిక నిత్యకర్మానుష్ఠానం 8. హరిచరణకమలా విస్మరణ 9. రాగద్వేష రాహిత్యం 10. జగద్ధితప్రవృత్తి 11. అంతర్ముఖదృష్టిచేత కలిగే జ్ఞానసిద్ధి ఈ లక్షణాలన్నీ కలిగినవాడే స్థితప్రజ్ఞుడు. శ్రీవేంకటేశ్వరచరణ దాసుడుకానివాడు స్థితప్రజ్ఞుడు కాలేడు. ఈ సంకీర్తనలో చెప్పబడ్డ స్థితప్రజ్ఞుడు అన్నమాచార్యులేనని కొంచెం లోతుగా ఈ విష యాన్ని చర్చించినవారికి అవగతమౌతుంది.

ముఖారి ఝంప

ఎక్కువ తక్కువ లేవో - యెఱుగ మిద్దరిలోన
ఒక్కటై నీవురముపై - వున్నదిదె చెలియ

ఆకడ జలధి ద్రచ్చి - అమృత మిచ్చితివీవు
ఆకెకైతే మోవిజిందీ - నమృతము
సైకపు పసిడి చీర - సరిగట్టితివి నీవు
మేకొని యీమెకైతే - మేనెల్ల బసిడే

నిగిడి కౌస్తుభపుమా - ణికము గట్టితివీవు
మగువకైతే నోరెల్లా - మాణికములే
బెగడి యాకసమెల్లా - పెద్దసేసి కొలచితివి
బిగిసే యీచెలికైతే - బిడికెడు నడుమే

పలుమారు జలధిలో - బవళించితివినీవు
కలికి గుణములోనే - ఘనజలధి
యెలమి శ్రీ వేంకటేశ - యిప్పుడు గూడితిగాని
జలజాక్షి యైతే నిన్ను - సన్నలనే గలసె

మనమొక ప్రాణమిత్రుడింటికి వెళ్తాం. అతని భార్య అతను ఉండగా ఉభయులతో సంభాషిస్తూ ఆమెను పొగడుతాము. మన మిత్రుని కొంచెం ఎగతాళి చేస్తాము. 'శ్రీమహాలక్ష్మివి నీవు వరించబట్టి మనవాడు నారాయణమూర్తి అయ్యాడు. లేకపోతే దామోదరుడు గానే మిగిలేవాడు.' అని మిత్రుడి పూర్వాశ్రమ పరాక్రమం గురించి చెప్పి నీవల్ల యింతవాడయ్యాడు ఇప్పుడు అంటాం ఆమెతో. అది మార్యాద. అది స్నేహమాధుర్యపు జున్నులో పొసగించిన మిరియపు పోపు. ఈ సంకీర్తనలో ఆ ధర్మమే వెలయించారు అన్నమాచార్యులు.

మీ యిద్దరిలో ఎక్కువ తక్కువలు ఎలాగ నిర్ణయించడం ? ఇద్దరూ ఒక్కటయ్యారు. ఆమె నీ గుండెపైనే ఉన్నదికదా. తారతమ్యాలింక దేనికి ? అంటూనే చక్కని రసపరీక్ష చేస్తున్నారు అన్నమాచార్యులు.

అప్పుడెప్పుడో (యుగారంభానికి ఆ చివరన) నువ్వు (కూర్మమై) జలనిధిని మథిం పజేసి అమృతం తెప్పించావట. ఎంత కష్టపడ్డావు. ఈ అలమేల్మంగకైతే పెదవుల చివర చిందుతున్నది అమృతం. శరధి చిలికి అమృతం తెచ్చావా నీవు? ఈమె సద్యోధరామృత వర్షిణి. బంగారు పోగుల జరీ అంచు బట్ట కట్టు కొన్నావా? గొప్పపనిచేశావులే! మా బం గారుతల్లి అలమేల్మంగకు ఒళ్ళంతా బంగారమే. నీవు కనకాంబరుడివే. ఆమె కనకాంగి.

కౌస్తుభమణి జగద్దర్శనంగా కట్టినట్టున్నావు. ఈవిడకైతే నోటినిండుగా మాణిక్యాలు న్నాయి. ఆమె పలువరసమణుల వరుస. వామనుడవై పాదంతో ఆకాశమంతా కొలిచేసి పెద్దగొప్పఅనుకుంటున్నావేమో ఆకాశమంతటినీ పిడికెడు నడుములో బిగించుకొన్న దియీ చెలి. నీపాదము ఆకాశ ప్రామాణ్యమైతే ఆకాశానికి ప్రామాణ్యం ఈమె నెన్నడుము.

ఎన్నో పర్యాయాలు నీవు సముద్రంలో శయనించావుట. గొప్పచాల్లే. ఈమె గుణము లో మహాసముద్రము. శ్రీవేంకటేశ్వరా నీవీమెను యిప్పుడు కలసినావు గాని ఈ అలమే ల్మంగ నిన్ను ఇంతకు ముందెన్నడో సంజ్ఞాపురస్సరంగా కలసినది. అయినా మీరిద్దరూ ఒక్కటే. మీతారతమ్యాలు నాకేమితెలుసు అని తాను లౌక్యంగా తప్పుకుంటూ శ్రీవేంకటే శ్వర ప్రియచతుర సరసోక్తులు ఒలికించారు సంకీర్తనా చార్యులు.

కళ్యాణి - ఆది

ఏమని పొగడుదు - మే యిక నిన్ను ను
ఆమని సొబగుల - అలమేల్మంగ

తెలిగన్నుల నీ - తేటలే కదవే
వెలయగ విభునికి - వెన్నెలలు
పులకల మొలకల - పొదులివి గద వే
పలుమరు పూవుల - పానుపులు

తియ్యని నీ మోవి - తేనెలే గదవె
వియ్యపు రమణుని - విందులివి
ముయ్యక మూసిన - మొలక నవ్వు గదె
నెయ్యపు కప్రపు - నెరి బాగాలు

కైవస మగు నీ - కౌగిలే కదవే
శ్రీవేంకటేశ్వరు - సిరి నగరు
తావుకొన్న మీ - తమకములే కదె
గావించిన మీ - కళ్యాణములు

సంతత వసంత శోభల నిత్యయౌవన అలమేల్మంగ. ఆమె ఆమని సొబగులు వర్ణిం పతరమా! అంటూ ఆమెను సంబోధిస్తూ అలమేల్మంగ అందాలకి అద్దం పట్టుతున్నారు అన్నమాచార్యులు.

నీ కన్నుల తేట తెల్లని కాంతులు కదమ్మా విభునికి వెలసిన వెన్నెలలు. నీ మేన ఏర్పడే పులకాంకురపు అక్షయపు తావులే శ్రీవరునకు పూలశయ్యలు. (అలమేల్మంగ సుమ కోమలాంగి).

నీ అధరామృతపు తేనెలేగదా ఆ అమృతమదనునకు విందారగింపులు. నీ సిగ్గు నిగ్గుల నెలవి నవ్వులేకదా కప్పురపుమైదూళివానికి కర్పూర తాంబూలముల వక్క పలుకులు.

మీరుభయులూ పరస్పరాశ్రయులు. నీవాయనకు కైవసం. ఆయన నీకు కైవసం. శ్రీవిష్ణు పరిష్వంగ నిత్యవాసినివి నీవు. లక్ష్మీ నివాస హృత్కమలుడాస్వామి. ఆ తిరువేంకటేశ్వరు సిరినగరు ఏది ? నీ కౌగిలేనమ్మా ఆయనకు వైకుంఠం.

నెత్తావులు వెదజల్లే మీ నెమ్మి మీరిరువురకూ నిత్యకళ్యాణమేర్పరచినది. నీవు నవోఢ

ప్రకృతి కాంతవు. ఆ స్వామి పురుషోత్తముడు. మీ యిరువురి కలయికా, ఉద్వాహమూ, జగన్మంగళదాయకము, జగన్మంగళ కారణమూనమ్మా అంటూ అలమేల్మంగా సౌందర్య దర్పణ సంకీర్తనం సాయించారు అన్నమాచార్యులు.

చారుకేశి - రూపకం

ఏమొకో చిగురు టధరమున - యెడనెడ కస్తురినిండెను
భామిని విభునకు వ్రాసిన - పత్రిక కాదు గదా

కలికి చకోరాక్షికి కడ - కన్నులు కెంపై తోచిన
చెలువ మిప్పుడిదేమో - చింతింపరె చెలులు
ఉడుగని వేడుకతో విభు - డొత్తిన నఖశశిరేఖలు
వెడలగ వేసవి కాలపు - వెన్నెల కాదుగదా

ముద్దియ జెక్కుల కెలకుల - ముత్యపు జల్లుల జేర్పుల
ఒద్దిక లాగు లివేమో - ఊహించరె చెలులు
గద్దరి తిరువేంకటపతి - కామిని వదనాంబుజమున
అద్దిన సురతపు జెమటల - అందము కాదుగదా

తెనాలి రామకృష్ణుడు చాలా సరసపు కవి. అతని పాండురంగ మహాత్మ్యంలో అగస్త్యుడిని స్తుతించడం ఇలా ఉంటుంది.

సీ॥ చులుకాకృతులు లేవె జలరాశి నిశ్శేష
శోషణ క్రీడకు జొరవు గాక

జాఠరాగ్నులు లేవె జటితాపి వాతాపి
తను దాహమును దీర్ప దగవుగాక

హుంకారములు లేవె ఉపపురందరహతో
త్పాటనమునకు పాల్పడవుగాక :

అన్నమయ్యను దృష్టిలో ఉంచుకొని అగస్త్యునికి అలంకారాలొనరించాడు రామకృష్ణుడు అనుకుంటే ఆశ్చర్యమేమీకాదు. ఎందుకంటే ఉపమలు ఎన్ని లేవు సాహిత్యంలో? అన్నమయ్య ఉపమలతో ఉపమించరావుగాని, ఉత్ప్రేక్ష లెన్ని లేవు అన్నమయ్య ఉత్ప్రేక్షలను ఉత్ప్రే క్షింపలేవుగాని, పదకవిత లెన్నిలేవు. అన్నమయ్య పదకవితాపద పదపీఠికను స్పర్శించలేవుగాని 'నో ఋషిః కురుతే కావ్యం. ఋషులందరూ కవులైతే అగస్త్యమహర్షి అన్నమాచార్యుడు కావాలి. అన్నమాచార్యుల అనన్య కల్పనా వైచిత్రి అట్టిది. సాహిత్యంలోనే అపూర్వమైన ఉ త్ప్రేక్షను శ్రీమచ్ఛంకరులు తమ సౌందర్యలహరిలో వెలయించారు.

ఆ ఉత్ప్రేక్ష సౌందర్యలహరిలో 86వ శ్లోకంలో ఉన్నది.

మృషా కృత్వా గోత్ర స్ఖలన మధ వైలక్ష్య నమితం
లలాటే భర్తారం చరణ కమలే తాడయతితే
చిరాదన్తశ్శల్యం దహన కృత మున్మూల తపతా
తులాకోటిక్వాణైః కిలికిలిత మీశానరిపుణా.

ఒక నాయిక వద్ద వేరొక ప్రియురాలి పేరుతో నాయికను పిల్వడం గోత్ర స్ఖలనం. కావాలని పార్వతిని ఉడికించాలని ఈశ్వరుడు వేరొకతె పేరు పలకగా ఆమె కోపించి, లజ్జిత ముఖుడైన హరుని నుదుట తన మృదు చరణ పద్మంతో తన్నినది. అప్పుడు ఆమె చరణాలంకార మంజీరపు కలరవం చిరకాలంగా శివుని నుదుట అగ్నిపై నున్న తన పగ భవాని ఒనర్చిన శివలలాట తాడనం వల్ల చల్లారగా మన్మధుడు కిలకిల నవ్వినట్లుగా ఉందట. ఎంత ఉత్ప్రేక్ష!

శంకరులు కనకధారాస్తవంలని మొదటి పది శ్లోకాలూ. సౌందర్యలహరిలో 9 శ్లోకాలూ అమ్మవారి శుభదృష్టిపైనగావించారు. ఈ సంకీర్తనమూ, శంకర శ్లోకాలూ సమదర్శనం చేస్తే శ్రీమదాది శంకరులే అన్నమాచార్యులై ఉంటారని అనుమానం కలిగి, పెనుభూతమై దృఢ విశ్వాసం కాక మానదు. ఆది శంకరులే అన్నమాచార్యులన్న ప్రతిష్ఠా చర్చ తర్వాత చేద్దాం. ఈ సంకీర్తనలో అలమేల్మంగ పడకటింటి శృంగారపు గుట్టు చెలులు తమ ఉ త్ప్రేక్షలలో జగద్వ్యాప్తం చేసి రచ్చకెక్కించిన వైనం రమ్యంగా చిత్రీకరించ బడింది. చెలులున్నారు - ఈ అలమేల్మంగ ఎఱ్ఱని అధరాలపై అక్కడక్కడ కస్తూరి అంటినది.ఎఱ్ఱని పత్రంపైన ఈమె విభునికి వ్రాసిన నల్లనిఅక్షరాల ప్రేమలేఖ కాదుగదా యిది?

ఈ చకోరాక్షికి కంటి కొనలు ఎఱ్ఱగా ఉన్న కారణమేమి? ప్రాణేశ్వరుని మేన వ్రాలి, ఆ మేను చెలువులు నలచి, నలచి, దేహాంతరాళంలోనికి చొచ్చుకొని నాటుకొన్న ఆమె చూపులు, ఆ చూపులను ఆకస్మాత్తుగా నిలువునా పెరికివేస్తే ఆ చూపుల కొనలను అంటిన నెత్తురు కాదా ఇది ? చెలులారా ఊహించండి. ఇది అన్నమాచార్యుల అసామాన్యోత్ప్రేక్ష

ఈ అలమేల్మంగకు చన్నుల కాంతులు పైపైకి, పయ్యెదదాటి ప్రాకుతునవి తద్రహస్యమేమో కనిపెట్టండి, తనివి తీరని తమకంతో స్వామి ఆమె కుచకుంభపాళిపై చేసిన నఖక్షతపు నెలవంకలు వెలువరిస్తున్న వేసవికాలపు వెన్నెలేగాదా యిది.

ఈ ముద్దుల చెక్కిళ్ళ అంచులలో ముత్యపుజల్లు వడినట్లు ఉన్నది. ఈ సౌందర్య

రహస్య విచారణ చేద్దాం. చెలులారా ; శ్రీ వేంకటపతి ఈమెని అలమిపట్టి రతుల నలయించి, అద్దిన రతిశ్రమజపు చెమటల అందమేగదా యిది అని చెలులు నాయిక ను ఆటపట్టించారు. ఈ ఆటపట్టింపులో అనన్యమూ, అద్వితీయమూ, అపురాపరసంబవ మూ అయిన ఉత్ప్రేక్షను ఆవిష్కరించారు అన్నమాచార్యులు, ఈ 'కంటికెంజాయ చూపు ల' గూర్చి వేరొకచోట ఆయనే 'కాని కంటి కుంకుమలు' అంటారు. ఆ ఉత్ప్రేక్ష రూపం ఈ కోవకి చెందినదే కానీ

నలువున ప్రాణేశ్వరుపై-నాటిన ఆ కొన చూపులు
నిలువున పెరుకగ నంటిన -నెత్తురు కాదుగదా

అన్నంత జాజ్వల్యమానంగా తోచదు.

ఈ సంకీర్తన విని యిందులోని అందానికి అచ్చెరువు ముచ్చెరువై నాటి రాయలు సాళ్వ నరసింగరాయలు  ఇటువంటి పదమే నాపైన చెప్పమన్నాడు. అన్నమాచార్యులు 'హరి హరి' యింత నీచపు మాట నాతో ఎలా అనగలిగావు? అని దిగ్గున లేచిపోబోగా రాయలు బతిమాలి మళ్లీ అదే అడిగాడు. అన్నమాచార్యులు ధాటిగా తిరస్కరించారు.

కీరవాణి త్రిపుట

ఎంత మాయల వాడు - ఎంచి చూడగ వీడు
యింతియీతని రూపము - ఎవ్వరెరుగుదురు

తెలుపు జలములలోన - తెప్పవలె దేలీనే
తలకి పాతాళమున - దగియుండేనే
కెలసి తనకన్నులను - కెంపువలె జేసీనే
నెలత భీకరముగా - నేడు నవ్వీనే

ఒరపుగా భూదాన - మొకరిని దానడిగీనే
తరుణి భూమొక్కరికి - ధారవోసీనే
మరలి పద్మజుని మను - మనినైన జంపీనే
పరచు దనమున వృథా - పాలు మాలీనే

పలుమారు తనసిగ్గు - బయటబడ జేసేనే
కలికితనముననను తామ - గడవబాసీనే
వెలది వేంకటగిరి - విభుడు నాకౌగిట
తొలగక జెమటల - దొప్ప దోచీనే ॥

ఒకే భావాన్ని పలురకాలుగా వ్యక్తీకరించటంలో ఆధ్యాత్మిక శృంగార సంకీర్తనలుగా నంతరించటంలో అన్నమాచార్యులు కడు దిట్ట. శ్రీవేంకటేశ్వరుని మాయకాని తనాన్ని చెలికత్తెతో అలమేల్మంగ వివరించే సమయంలో దశావతారముల మాయపనుల పరామర్శ జరిగింది. పాపం ఇంతటి మాయలాడు కూడా ఆమె కౌగిట ఇరుక్కుపోయి, చెమటల ప్రళయాంబుధిలో వటపత్రశాయివలె దొప్ప దోగినాడు. దశావతారాల శృంగార కీర్తనమిది. అష్టవిధనాయికలలోని స్వాధీనపతికకు ఈ శృంగార పదం లక్షణం.

తెలుపు జలములలోన - మీనావతారం
పాతాళమున దాగి - కూర్మావతారం.
కెలసి తన కన్నులను కెంపుగా - హిరణ్యాక్షుడని సూచనాపరంగా వరాహావతారం.
భీకరముగా నేడు నవ్వీనే -నృసింహుని అట్టహాసపు కహకహల సూచన
భూదానమొకరిని దానడిగీనే - మూడడగులనేల బలిని యాచించిన వామనుడని సూచన
భూమొక్కరికి ధారవోసీనే - భూవలయాన్ని బ్రాహ్మణులకు దానమిచ్చిన పరశు

రాముడు

మరలి పద్మజుని మనుమనినైన జంపీనే బ్రహ్మమనుమడు రావణుని చంపిన శ్రీరా
ముడు

పరచుదనమున వృధా పాలు మాలీనే - బలరాముడని ధ్వని

పలుమారు తనసిగ్గు బయట బడజేసేనే - శ్రీకృష్ణావతారం

కలికి తనమున దాను గడవబాసీనే - కల్క్యవతారం

హిందోళ - ఆది

హరిరసమ వి - హారీ సతు
నరసోయం మమ - శ్రమసంహారీ

దయానివృత - తను దారీ సం
శయాతిశయ - సంచారీ
కయావ్యజిత వి - కారీ
క్రియావిముఖ - కృపాణధారీ

సదా మిధ్యా - జ్ఞానీ సతు
మదాలి మతాభి - మానీ
తదాశ్రిత సం - ధానీ సతు
తదాతదా చిం - తాశయనాని

పరామృత సం - పాదీ
స్థిరానందా - స్వేదీ
వరాలాపవి - వాదిశ్రీ
తిరువేంకటగిరి - దివ్యవినోదీ

అన్నమాచార్యులు అందంగా చెక్కిన దశావతారశిల్పాలు అపూర్వ సాహితీ కళానల్పాలు. సంస్కృతంలో సంకీర్తనాచార్యులు సంతరించిన దశావతార సంకీర్తనమిది.

అతడు హరి. సరసుడు. (రసమే ఆహరి, రసమే బ్రహ్మ) నా శ్రమలను పోగొట్టేవాడు. గరుత్మంతునెక్కి విహరించేవాడు.

1. ఆ హరి దయాంబరతనుధారి. దయ అనే పాలుసుల చేత ఆవరింపబడిన శరీరం కలవాడు. (మీనావతారమని ధ్వని)

2. అతిశయించిన సంశయాలకు అందరాని సంచారము ఆ హరిది. అమృతోద్భవం సందేహాస్పదమైనప్పుడు కూర్మమై అమృత లబ్ధికి కారకుడై సంశయాతీతంగా వర్తించిన వాడు. (కూర్మావతారం)

3. వికారాకారమైన వరాహమైనప్పుడు ఎంత ప్రయత్నించినా ఆ వికారాన్ని జయించలేక, వదిలించుకొనలేకపోయినవాడు అని చలోక్తి. (వరాహావతారం)

4. కత్తులకు బదులుగా గోళ్ళు అమరినందున పనిలేని కత్తులను ధరించినవాడు. (నర సింహావతారం)

5. దొంగవటువుగా అవతరించినవాడు. (వామనావతారం)

6. క్షత్రియులను సంహరించి, భ్రమరకీటన్యాయంగా ఆస్థానాలలో బ్రాహ్మణులను భూభర్త లుగా నొనర్చిన పరశురామావతారం.

7. శరణాగత రక్షణ ప్రతిజ్ఞా ధురీణుడైన శ్రీరాముని అవతారం.

8. అప్పుడప్పుడు (మద్యపు మత్తులో లేనప్పుడు) చింతాగ్రస్తుడయ్యే బలరాముడని ధ్వని.

9. పరమామృతమైన పర విషయ విద్యాబోధ జేసిన గీతా ప్రవక్త శ్రీకృష్ణావతారుడు.

10.శాశ్వతానంద ప్రతిష్ఠాపనకై శ్రమించిన కల్కి... శ్రుతగీత గానములచే విశేషంగా కీర్తింపబడ్డ ఆ హరి తిరువేంకటగిరిపై దివ్యమైన వినోదార్థం నెలకొనియున్నవాడు.

భైరవి - ఆది

ఎంతపుణ్యమో - యిటు మాకుగలిగె
చెంతనే నీకృప - సిదిద్ధచబోలు

శ్రీపతి మీకధ - చెవులను వింటిమి
పాపములణగెను - భయముడిగె
తీపుగ తులసీ - తీర్థము గొంటిమి
శాపము దీరెను - సఫలంబాయె

గోవింద మిముగను - గొంటిమిప్పుడే
పావనమైతిమి - బ్రతికితిమి
తావుల మీపా - దములకు మ్రొక్కితిమి
వేవేలు గలిగిన - వేడుకలాయె

శ్రీవేంకటేశ్వర - సేవించితి మిము
ధావతి దీరెను - తనిసితిమి
వావిరి ముమ్మారు - వలగొని వచ్చితి
నీవారమైతిమి - నిలిచితి మిపుడు

అన్నమాచార్యుల మనోభావ పరీపాకం, ఆయనకు శ్రీవేంకటేశ్వరుని యెడ గల శ్రద్ధాది భక్తుల వర్ధిష్ణుతావైశద్యం, సరసంగా శరణాగతి చేసిన సరవీ, శ్రీస్వామితో ఆయనకున్న చనవూ ఒండొంటితో ఒరపుజెందినవీ సంకీర్తనలో.

నాకెంత పుణ్యం కలిగిందిస్వామీ; నీదయ నాకిక అత్యంత శ్రీఘ్రంగా సిద్ధిస్తుందేమో.

శ్రీపతీ; నీగుణకథా శ్రవణం చేసిన నా చెవులేమి పుణ్యం చేసుకొన్నవో. నీ గుణగాన శ్రవణంచే నా పాపాలు పటాపంచలై పంచబంగాళమై పారిపోయాయి, భయంతీరింది. 'యశదం శృణుయాన్నిత్యం యశ్చాపి పరికీర్తయేత్ --

నభయం క్వచిదా ప్నోతి అని విష్ణుసహస్ర  నామస్తోత్రోత్తర పీఠిక. మధురాతి మధురమైన తులసీతీర్థాన్ని పావనమూ శుభమైన శ్రీవిష్ణు పాదోదకాన్ని పుచ్చుకొన్నందున మనస్తాప శాపంవిముక్తి యైంది. ఈ జన్మ సఫలమైనది.

గోవిందా; నీ దర్శన మహాభాగ్యం సిద్ధించిన క్షణమందే పవిత్రీకృతుల మయ్యాము. బ్రతికాము. నీదర్శనార్థమే మా మనుగడల పరమార్థం, 'జీవేమ శరదశ్శతం నందామ శరదశ్శతం మోదాయ శరదశ్శతం ప్రబ్రవామ శరదశ్శతగ్ం' ఆ పరమార్థసాధనకై శతవ ర్షాలు జీవింతుము గాత; అని యజుర్వేద మంత్రం. సుంగంధ చర్చాన్వితమైన నీ అడుగు దమ్ములకు నమస్కరించాము. సంతోషమై పులకాంకురమైంది. అనవధికమైన ఆహ్లాదం మాకు కలిగినది.

శ్రీవేంకటేశ్వరా; నిన్ను మాశక్తికొలది సేవించాము. మాకోరికలన్నీ తీరి శాంతించి నవి. తృప్తి చెందాము. నీపై త్రికరణశుద్ధమైన వలపుతో వచ్చి, నీవారమయ్యాము. బ్రహ్మా నంద పరమపట్టం నిశ్చలమై మాకు ప్రాప్తించినది. ప్రభూ; ఇదంతా నీవల్లనే అనే అన్నమా చార్యులలోని భక్తుడు, సక్తచిత్తుడూ అయిన యోగీశ్వరుని జ్ఞానవైభవం చిదానందాను భవసారం చెన్నారిన సంకీర్తనా రత్నమిది.

సావేరి - ఆది

ఎవ్వరెవ్వరి వాడో - యీ జీవుడు
ఎవ్వరికి నేమౌనో - యీ జీవుడు

ఎందరికి గొడుకుగా - డీజీవుడు వెనక
కెందరికి దోబుట్ట - డీ జీవుడు
ఎందరిని భ్రమయించ - డీ జీవుడు, దుఃఖ
మెందరికి గావింప - డీజీవుడు

ఎక్కడెక్కడ దిరుగ - డీజీవుడు, వెనక
కెక్కడో తన జన్మ - మీజీవుడు
ఎక్కడి చుట్టము తనకు - నీ జీవుడు, ఎప్పు
డెక్కడికి నేగునో - యీ జీవుడు

ఎన్నడును జేటులే - నీజీవుడు, వెనక
కెన్ని తనువులు మోవ - డీ జీవుడు
ఎన్నగల తిరువేంక - టేశు మాయలదగిలి
యెన్ని పదవుల బొంద - డీజీవుడు

అన్నమాచార్యుల తత్వచింతనాతత్వానికి తార్కాణం ఈ సంకీర్తన. ఈ జీవుడు ఎవరివాడు ? ఎవరికి ఏమౌతాడు ? ప్రాణం ఉన్నంతవరకూ ఎందరికో ఎన్నో అయ్యే జీవుడు మరణించగానే ఇక ఎవరికి ఏమీ కాడు.

ఎన్నో ముందటి జన్మలలో ఎందరికో కొడుకయ్యాడు. ఇంకెందరికో తోడబుట్టినవాడు. ఎందరినో తన బాంధవ్యంచేత భ్రమింపజేశాడు ఈ జీవుడు. విగత జీవుడై ఈ జీవుడు తనవారైనవా రందరికీ దుఃఖం కలిగించాడు.

ఈ జీవుడు ఆధారహీనుడై, ఆత్మాకారుడై అనేక లోకాలలో ఉనికి వెతుక్కుంటూ తిరిగినవాడు. తన జన్మ ఎక్కడో ఎఱుగనివాడు. తనకు తెలియకే ఎన్నో జన్మలెత్తినవాడు. తానున్న దేహానికికూడా చుట్టముకాడు ఈ జీవుడు. ఆ శరీరం శైథిల్యంచెంది నశించగానే ఈ జీవుడి జగద్యానం మళ్ళీ ఆరంభం.

ఈ జీవుడు నాశనం లేనివాడు. నశించేది శరీరమేకాని ఆత్మకాదని భగవద్గీతా వాక్యం.

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః
నచైనంక్లేదయంత్యాపో, నశోషయతి మారుతః

ఈ జీవుడు ఆత్మాకారుడు. ఆత్మను శస్త్రం ఛేదించలేదు. అగ్ని దహించలేదు. నీరు తడి గావించలేదు. గాలి ఎండించలేదు. ఇలాగ ఎన్నో జన్మలు ఎత్తుతూ మరణించుచూ చర్వితచర్వణుడౌ తాడు. ఈ జీవుని అవస్థా విశేషమంతా ఈ తిరువేంకటేశ్వరుని మా య. ఆ స్వామి సకంల్పంచేత ఇదంతా ఇలా జరుగుతున్నది. ఆ శ్రీస్వామి కృప ఉంటే చాలు, ఈ జీవుడు ఎన్నో పదవులు - నిర్జరత్వం, అమరత్వం, బ్రహ్మసాయుజ్యం - అన్నీ పొందగలుగుతాడు. జీవుని పారమ్య చారమ్యాలు శ్రీరమ్యుని దయాధీనాలు అని రమ్య మైన తత్వసంకీర్తన సాగించారు సంకీర్తనాచార్యులు.

మలయమారుతం - ఝంప

ఇదిగాక సౌభాగ్య - మిదిగాక తపము మరి
యిదిగాక వైభవం - బికనొకటి గలదా

అతివ జన్మము సఫల - మై పరమ యోగివలె
నితర మోహాపేక్ష - లిన్నియును విడచె
సతికోరికలు మహా - శాంతమై యిదె చూడ
సతత విజ్ఞాన వా - సనవోలె నుండె

తరుణి హృదయము కృ - తార్థత బొంది విభుమీది
పరవశానంద సం - పదకు నిరవాయె
సరసిజాసన మనో - జయమంది యింతలో
సరిలేక మనసు ని - శ్చల భావమాయె

శ్రీ వేంకటేశ్వరుని - జింతించి పరతత్వ
భావంబు నిజముగా - బట్టె చెలియాత్మ
దేవోత్తముని కృపా - ధీనురాలై యిపుడు
లావణ్యవతికి ను - ల్లంబు తిరమాయె

అన్నమాచార్యులు అద్భుత సౌందర్యలహరులుగా వెలయించిన సంకీర్తనలు ఎన్నో పరమానందసిద్ధి పొందిన పరమయోగిలో శృంగార నాయికనూ, ఆ నాయికలో యోగినీ పరస్పరం ఆపాదించి, వారుభయులకూ అభేదమేర్పరచి, శ్రీయోగ విద్యాతంత్రపరంగా, శృంగార వేదాంతాలని పరాకాష్టకు చేర్చిన ఈ ప్రక్రియ ఆంధ్ర సాహిత్యంలోనే కాదు మరే భాషా సాహిత్యంలోనూ లేదనడం స్వభావోక్తియే.

నాయిక అలమేల్మంగ శ్రీ వేంకటపతితో రతికేళిని చొక్కి వివశయై ఉన్నది. ఆమె జన్మ సఫలమై పరమయోగివలె, ఇతర మోహాపేక్షలన్నీ త్యజించినది. శ్రీవిద్యాపరంగా యిక్కడ త్రైలోక్య మోహన చక్రం. ప్రధమావరణం శృంగారరసం, మూలాధారచక్ర ప్రకృతీ సూచితం. ఆమెకోరికలు అన్నీ తీరి శాంతించినవి. (సర్వాశా పరిపూరక చక్రం సూచితం). ఆ శాంతస్థితి సతతమైన విజ్ఞాన వాసనవలె ఉన్నదట. 'ఈశ్వరానుగ్రహాత్ పుంసామద్వైత వాసనా ' జ్ఞానాదేవతు కైవల్యం అన్నవి పప్రూణ వాక్యాలు. చిచ్ఛక్తి అజ్ఞాన తిమిరాన్ని

తొలగించే దీపం గనుక ఇక్కడ స్వాధిష్ఠాన చక్రం సూచితం.

తరుణి హృదయము కృతార్థత పొందినది. విభునిమీది పరవశానంద సంపదకు ఆమె యెద భాండారమైనది. లక్ష్మీ హృదయంలో విష్ణునియెడ పరవశానంద సంపద ఉండడం ధర్మం. ఆమె ప్రకృతి. ఆయన పురుషోత్తముడు.లక్ష్మీ హృదయవాసి శ్రీనివాసుడు. శ్రీవిష్ణు హృత్కమలవాసిని విశ్వమాత. ఇక్కడ 'హృదయం'లో అనాహత చక్రం సూచితం. పరవశానంద సంపద అన్నపుడు విశుద్ధ చక్ర సూచన.

సరసిజానన మనో జయమందినది. ఆమె జిత మనోవస్థ ఉపమించరాని దైనంతలో కేంద్రీకృత శ్రీవేంకటేశ్వరైక భావనమై మనసు నిశ్చలమైనది. సరసిజానన మనోజయమందినది అనడంలో గూడార్థం ఉన్నది. మనస్తత్వం గలది ఆజ్ఞా చక్రాన్ని దాటితే సహస్ర దళ కమలం యోగులకు కన్పట్టుతుంది. ఆ సహస్రదళ పద్మంలో లక్ష్మీనారాయణులు విహరిస్తూ ఉంటారు. తత్కమల దర్శనం సిద్ధించిన వారికి సహస్రదళ కమలో పరివాసియైన చంద్రుడు (మామూలు చంద్రునికన్న అన్యుడు) నిత్య అనే కళ గలిగి సాధకులపై బిందువు బిందువుగా అమృతాన్ని చిలికిస్తాడట. తత్సహస్రార పద్మ దర్శనాన్ని సూచించడానికి 'సరసిజానన' అన్నారు అన్నమాచార్యులు. (త్యాగరాజస్వామి ఎందరో మహానుభావులు కీర్తనలో 'చందురు వర్ణుని అందచందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమనుభవించువా' రన్నప్పుడు ఇదే అర్థం. శ్రీరాముడు చందురు వర్ణుడు కాడుగదా మరి) ఆ సుధాబిందు నిష్యంద ప్రాప్తియే బ్రహ్మానంద సిద్ధియని సమయాచార తత్వరజనులూ పాతంజలీత్యాది యోగివరేణ్యులూ ఉద్వచించారు.

ఆమె నిర్మోహ, నిష్కామ నిష్కలంక నిరంజన నిర్వికల్ప నిరంతరర స్థితిలో - శ్రీవేంకటేశ్వరుని నిశ్చలైక భావంతో చింతిం చినందున

పరతత్వభావమును సొంతం చేసుకున్నది చెలి యాత్మ. (ఇందుకు ప్రమాణం హంస మంత్రం. 'హంనిశ్శివస్సోహం, సోహం, హంసశ్శివః' అని. తానే ఆ స్వామిలో ఒదిగి ఆయన కృపాధీనురాలైనది. ఆయన కృపయే తానైనదని ధ్వని. అప్పుడు కడు చంచలయైన లక్ష్మీ లావణ్యవతికి చాంచల్యం పోయి స్థిరమైన శ్రీ వేంకటేశ్వర దయాకారయై ఆమె తన సర్వస్వాన్నీ స్వామికి అర్పణం చేసిన త్యాగగుణం వల్ల అమృత తత్వాన్ని పొందినది. 'త్యాగే నైకేన అమృతత్వ మానశుః' అని శ్రుతి వాక్యం (త్యాగం వల్ల మాత్రమే అమృతత్వం కలుగగలదు). ఈ సంకీర్తనలోని శ్రీవిద్యా విషయానికి ఆధారం శ్రీమచ్ఛంకరుల సౌందర్య లహరిలోని 9వ శ్లోకం.

మహీం మూలాధారే కమపి మణి పూరే హుతవహం

స్థితం స్వాధిష్ఠానే హృది మరుత మాకాశము పరి
మనోపి భ్రూ మధ్యే సకలనుపి భిత్వాకుల పధం
సహస్రారే రమ్యే సహరహసి పత్యా విహరసే

శ్లోకతాత్పర్యమిది - ఓ శ్రీదేవీ మూలాధార చక్రంలో భూమి తత్వాన్ని, మణిపూర చక్రం ఉదకాన్ని, స్వాధిష్ఠాన చక్రంలో అగ్నితత్వాన్ని, అనాహత చక్రంలో వాయు తత్వాన్ని, ఆజ్ఞా చక్రంలో మనస్తత్వాన్ని, ఈ కులపధ సకలమునూ అధిగమించి, (ఛేదించి) నీవు సహస్రదళపద్మంలో పతితోగూడ నిత్యవిహారము చేస్తుంటావు. మరి ఇంతకన్న సౌభాగ్యం, ఇంతకంటే తపము, ఇంతకన్న వైభవం మరెక్కడైనా కలవా? లేవు. భాగ్యంలో తపంలో వైభవంలో యిదే మలిమాట.

శంకరాచార్యులే అన్నమాచార్యులన్న భావం, నమ్మిక ఈ సంకీర్తన అమృతమును మథించేవారికి కలుగుతుంది.

ఈ సంకీర్తనకు ఈ వ్యాఖ్య చాలదు. వలసినవారు దర్శించవలసిన గ్రంధాలు.

1. శ్రీమచ్ఛంకరుల సౌందర్యలహరి (లొల్ల లక్ష్మీధర దేశికుల లక్ష్మీధర వ్యాఖ్యతో). 33 నుండి 7 శ్లోకాలు ప్రత్యేకంగా.
2. ముత్తుస్వామి దీక్షితుల నవావరణ కీర్తనలు.
3. వేదాంత దేశికుల దయా శతకము.

ఈ కీర్తన అలమేల్మంగా శృంగారలక్ష్మీహృదయ మన్త్రం ఋషి మంత్రద్రష్ట అన్నమాచార్యులు. ఖండగతి పదకవిత ఛందం శ్రీవేంకటేశ్వరుడు అధిష్టానదేవత. మధుర భక్తి బీజం. సరస వక్రోక్తి కీలకం. ఆధ్యాత్మిక శృంగార విజ్ఞాన పరిపాకం శక్తి. అలమేల్మంగా స హిత శ్రీవేంకటేశ్వర ప్రసాద రూప రససామ్రాజ్య ప్రాప్త్య  ర్థం జపము వినియోగం. గానాభినయ తాళద్రుత కరణాలు అంగన్యాస కరన్యాసాలు. అన్నమాచార్య పదగానప్రియ హరి పదకమలకాంతి ధ్యానం, ధాతుమాతు పునరావృత్తియే పునశ్చరణ.

మధ్యమావతి ఆది

గుఱుతెఱగిన దొంగ - కూగూగు వీడె
గుటిలోన దాగీని - కూగూగు

నెలతల దోచీని - నీళ్లాడగానె
కొలని దరిని దొంగ - కూగూగు
బలువైన ఉట్ల పా - లారగించీని
కొలది మీరిన దొంగ - కూగూగు

తావుకొన్న దొంగ - తవిలిపట్టుండిదె
గోవులలో దొంగ - కూగూగు
శ్రీ వేంకటగిరి - చెలువుడో యేమో
కోవిదుడు దొంగ - కూగూగు

అన్నమాచార్యుల పదకవితా సామ్రాజ్యంలో లేని ప్రక్రియ లేదు. దంపుళ్ల పాటలు, జాజరలు, బావామరదళ్ల పాటలు, ఉయ్యాల పాటలు, లాలిపాటలు, తుమ్మెద పదాలు, కూగూగులు, గొబ్బిళ్ళు ఎన్నెన్నో నభూతభవిష్యంగా వెలయించిన మహాప్రయోక్త ఆయన. చిన్నపిల్లలను మెడమీద ఎక్కించుకొని పాడే పాట కూగూగు. పెదతిరుమలయ్యనో, చిన తిరుమలయ్యనో చిరుత ప్రాయంలో కూగూగు ఎక్కించుకొని, తిరుమల కొండ మెట్లె క్కుతూ ఈ సంకీర్తన అన్నమాచార్యులు పాడి ఉండవచ్చునని స్వానుభవం వల్ల నాక్కలి గిన అనుమానం. అన్యథా సాక్షాత్ శ్రీవేంకటేశుడే పసిబాలుని రూపంలో సాక్షాత్కరిస్తే ఆయనను భుజమెక్కించుకొని ఈ సంకీర్తన గానం చేసి ఉంటారు అన్నమాచార్యులు.

కూగూగు యెక్కిన ఈ కుంకదొంగ గుఱుతు ఎరిగినవాడట (శంఖ చక్ర సంజ్ఞల ధ్వని) పరమ యోగులకు లక్ష్యమై వారికి సైతం లక్ష్యసాధనలో చేజిక్కక అందందే దా గుడుమూతలాడే దొంగ ఈ కూగూగు యెక్కినవాడే.

గొల్లభామలు జలకాలాడుతుండగా వారి బట్టలు ఎత్తుకవెళ్లిన దొంగ కూగూగు. వ్రేపల్లె ఎత్తైన ఉట్లలో పాలన్నీ ఆరగించే పట్టవంశంకాని దొంగకూగూగు వీడే సుమా (పట్టవశం కానిది పరమమునులకు సైతం అని పల్లవితో అన్వయం).

ముద్దుల పాపడని చంక నెత్తుకొని గొల్లెతలు చల్లపెరుగులమ్మబోగా వారి చనుక ట్లు తడివినతుంట సుమా ఈ దొంగ కూగూగు. ఒక్క యిల్లు కూడా విడవక ఇందరు గొల్లయిల్లాంండ్ర పాలిండ్లు (పాలు భద్రపరచే గదులు) కొల్లగొట్టిన దొంగ కూగూగు వీడే.

ఈ దొంగ యిప్పుడు తిరుమలపై తావుకొన్నవాడు. (స్థిర) నివాసం ఏర్పరచు కున్నాడు. (నివేశన స్థలం అద్దెకు పుచ్చుకొన్నవాడు వరాహస్వాముల వద్ద) గోవులలో దా గిన (బ్రహ్మను సైతం మాయజేసి మారాకు హత్తించిన) ఈ దొంగని తరిమి పట్టుకోండి. (భక్తులు, మునులూ సాధకులూ అందరూ) శ్రీ వేంకటగిరి వరుడుగదా ఇతడు కడు నేర్పరి.(-చిక్కకుండా తప్పించుకొనేవాడు.)బ్రహ్మాదులకు సైతం అలవికానివాడు ఈ దొంగ అంటూ అన్నమాచార్యులు ఈ కూగూగు పాటలో పరమేశ్వరుడైన హరి అనుపగతత్వాన్ని, సర్వాపగమత్వాన్ని ఉపగమించి అధిగమించారు.

ఖామాస్ ఆది

ఇందరికి నభయంబు - లిచ్చు చేయి
కందువగు మంచి బం - గారు చేయి

వెలలేని వేదములు - వెదకి తెచ్చిన చేయి
చిలుకు గుబ్బలి క్రింద - జేర్చు చేయి
కలికియగు భూకాంత - గౌగిలించిన చేయి
వలనైన కొనగోళ్ల - వాడి చేయి

తనివోక బలిచేత - దానమడిగినచేయి
ఒనరంగ భూదాన - మొసగు చేయి
మొనసి జలనిధియమ్ము - మొనకు దెచ్చిన చేయి
యెనయ నాగేలు ధరి - యించు చేయి

పుర సతుల మానముల - పొల్లజేసిన చేయి
తురగంబు బరపెడి - దొడ్డ చేయి
తిరువేంకటాచలా - ధీశుడై మోక్షంబు
తెరువు ప్రాణులకెల్ల - దెలిపెడి చేయి

స్వామి అభయహస్త సంకీర్తనమిది. శ్రీ మహావిష్ణువు జగద్రక్షణా వర్థిష్ణువు. పిపీలికాది బ్రహ్మపర్యంతం ఎల్లరకూ అభయమిచ్చే సంకేతం స్వామి దక్షిణకరం. అభయ వరదానమిచ్చే ఆ చేయి గుఱుతైన మంచి సంపదలకు నిలయమై శరణాగతులకు అభయంతో పాటు అభీష్ట వరాలిస్తున్నది.

లోక రక్షణకై మున్నెన్నో బృహత్కార్యాలు ఒనర్చినది ఆయన చేయి. యుగాదిలో అమూల్యమైన వేదసంపద సోమకాసురునిచేతస్కరింపబడగా మీనావతారమైన విష్ణు కరము వేదాలను వెదకి తెచ్చి యిచ్చినది. దేవదానవులు సాగరమధనంలో హతాశులు కాగా కరుణించి కూర్మమై, మందరగిరి సముద్రంలో మునిగిపోనీక తేల్చిన చేయి,(లక్ష్మీ, కామధేనువూ, కల్పతరువూ, అమృతమూ ఆవిర్భవించడానికి ఆధారహేతువైనది కూర్మావతార విష్ణుకరం). అదే హిరణ్యాక్షుని వలన బాధలు భరించలేక సముద్రంలో క్రుంగనున్న భూచక్రాన్ని పైకెత్తి ఉద్ధరించిన వరాహావతార విష్ణుహస్తముప్రహ్లాద రక్షణార్థం స్తంభంలో అవతరించిన శ్రీమన్నృసింహుని పాడవైన కొనగోళ్లతో అతిశయించి, హిరణ్యకశిపుని

గుండెలు చీల్చి చెండాడిన (సుదర్శన చక్రధారను సొంతం చేసుకున్న గోళ్ళుగల) పదు నుగల చేయి అది. త్రివిక్రముడుగా బలి చక్రవర్తిని మూడడుగుల నేలను దానమడిగి (చరాచర జగమంతా ఆక్రమించి) అలరిన చేయి అది భూమినంతా బ్రాహ్మణులకు దానమిచ్చిన పరశురాము హస్తమిది. శరాగ్రంతో శరధిని చక్కజేసిన శ్రీరామ దివ్య హస్త మిది. హలము ధరించిన బలరాముని కేలిది. గొల్లెతల సౌందర్య తారుణ్య లక్ష్మిని కొల్లలా డినకృష్ణావతార శృంగార రసామృతాకర కరమది. పాప భీకరమై, కలికలుష విధ్వంసకర మైన కల్కిరూప విష్ణుని విజయాకర కరమది.

నేడు తిరువేంకటేశ్వరుడైన శ్రీవిష్ణుడు, ప్రాణులందరికీ మోక్షసాధనకు మార్గం ఇదే అని తెలుపుతూ తనపాదాల దిశ సూచిస్తున్న సంజ్ఞా పురస్సరమైన జగన్మంగళకరమైన తిరుకరమిది అంటూ స్వామి అభయహస్త భంగిమను దశావతార వైభవంగా, హృద యంగమంగా వర్ణించారు ఆచార్యులు.

శుభాళి - ఆది

ఇందిరారమణు దెచ్చి - యియ్యరో మాకిటువలె
పొంది యీతని బూజింప - బొద్దాయనిపుడు

దారుణి మైరావణు - దండించి రాముదెచ్చి
నేరుపున మించిన అంజ - నీతనయా
ఘోరనాగ పాశముల - గొట్టివేసి యీతని
కారుణ్య మందినట్టి - ఖగరాజ గరుడా

నానాదేవతలకు - నరసింహుగంభములో
పానిపట్టి చూపినట్టి - ప్రహ్లాదుడా
మానవుడై కృష్ణ - మహిమల విశ్వరూపు
పూనిబండి నుంచుకొన్న - పోటుబంట యర్జునా;

శ్రీవల్లభునకు న - శేష కైంకర్యముల
శ్రీవేంకటాద్రి పైన - శేషమూరితీ
కైవసమున యట్టి - కార్త వీర్యార్జునుడా యీ
దేవుని నీవేళయిట్టె - తెచ్చి మాకునియ్యరే

అన్నమాచార్యుల దేవతార్చనా విగ్రహాలు, విద్యానగరాన్ని విజయనగర గజపతులు ఆక్రమించినప్పుడో, యెప్పుడో ముష్కరులచే దొంగిలించబడ్డవి. అన్నమాచార్యుల ఆక్రోశం ఈ సంకీర్తనగా స్వరూపసిద్ధి చెందినది. పేరు పేరునా హరిభక్తులను పిలిచి తన దేవతార్చనా విగ్రహాలు వెతికితెచ్చే బాధ్యత అనుశాసనికంగా అభ్యుద్గతం చేసిన సంకీర్తన మిది.

మా శ్రీవల్లభుని తెచ్చి ఇవ్వండి. ఆయనకు పూజలు చేసేవేళ అయినది -

పాతాళవాసియైన మైరావణుని సంహరించి శ్రీరాముణ్ణి వెతికితెచ్చిన హనుమంతా; ఇంద్రజిత్తు మాయలతో పన్నిన నాగపాశబంధాలచే అవశులై ఉన్న రామలక్ష్మణులకై ఆ నాగబంధాలను చీల్చి చెండాడిన గరుత్మంతా; దేవతలందరికీ నరసింహుని స్తంభంలో ఆవిర్భవింపజేసి చూపి ప్రతిజ్ఞాపాలనమొనర్చినప్రహ్లాదుడా; (ఎందెందు వెదకి చూచిన నందందేకలడు చక్రి అన్నదే ప్రహ్లాదుని ప్రజ్ఞా ప్రతిజ్ఞ) మానవాకృతియైన శ్రీకృష్ణుని, విశ్వ రూపుని రథసారథిగా రావించుకొన్న మేటీ! కిరీటీ ! మా శ్రీ స్వామిని వెతికితెచ్చి మా కివ్వండి.

శ్రీవల్లభునికి అశేష సేవావిశేష రచన చేసిన శేషఫణీంద్రా; నీవే స్వామికై శ్రీవేంక టాద్రివైనావు. సహస్రకరాల కార్తవీర్యార్జునా; మీరందరూ ఈదేవుని వెతికి తెచ్చి యివ్వండి మాకు అని అభ్యర్థనా శాసనమొనర్చారు అన్నమాచార్యులు. ఆయనకు ఆ విగ్రహాలు దొరికే ఉంటాయి.

ఆనందభైరవి - రూపకం
యింతి వుపచార పూజ - యిందే గలిగెనీకు
వంతుల జేకొని నీవు - వరమియ్యవయ్యా

అంగన నిన్ను జూచుటే - ఆవాహనము ఆమెకు
అంగవించి నీవు మతి - హత్తినదే ఆసనము
సంగతి నీపై చింతే - సదా ధ్యానము సుమ్మీ
అంగపు జొక్కు జెమట - లర్ఘ్యపాద్యాదులు

సరుస గన్నీళ్లే ఆ - చమనము జలకము
ఆరవిరిప య్యెదయు - అంగ వస్త్రము
నిరతి మైకమ్మదావి - నీకు నిచ్చిన గంధాలు
పరగిన పులకలే - పలుపూజలు

దొమ్మివూర్పు విరహాగ్ని - ధూపము దీపమునాయె
సొమ్ములే మైమెఱుగులు - సొలి నీగేవే దండాలు
నమ్మిక శ్రీ వేంకటేశ - నైవేద్యమాయె మోవి
కమ్మర గాగిటి నవ్వే - కప్పురపు విడేలు

నిన్నే రూపముగా భజింతు మదిలో, నీ రూపు మోకాలో స్త్రీ చన్నోకుంచమొ, మేక పెంటికయొ అంటాడు ధూర్జటి మహాకవి శ్రీకాళహస్తీశ్వర శతకంలో. ఏ రూపు గానైనా భగవదారాధన చేయగలరు మహాపురుషులు. కానీ సంభోగ శృంగారంలో షోడశోపచారపూజ నెరవేర్చినఘనత అన్నమయ్యకే చెల్లింది.

ఆమె నిన్ను వీక్షించినదే ఆవాహనం నీకు. ఆమె మనసులో ఉత్పన్నమై మది హత్తు కొన్న నీపై కోరిక నీకు ఆసనం. నీతో శృంగార భావనమే ఆమె నీకిచ్చే ధ్యానపూజ. మన్మధుని అరణి వల్ల జనించే చొక్కపు చెమటలే, నీకు ఆర్ఘ్యము పాద్యము. పునరర్ఘ్యమునూ. (నీవు చెంతరానందున) సరోషపు ఆమె కన్నీళ్లే నీకు ఆచమనమూ, జలకమును, సగం జారిన ఆమె పయ్యెద నీకు వస్త్ర సమర్పణ. నిత్యమైన ఆమెమేని కమ్మ ని సుగంధపరిమళం నీకర్పించిన చందన గంధం. మిక్కుటమై ఆమె మేన పొడమే పులకాంకురములే నీకు బహువిధసుమ పూజలు.

విరహ తాపంలో ఆమె వెడలించే ఊర్పుల వేడి అగ్ని నీకు ధూపము, దీపము.

ఆమెశరీర సువర్ణకాంతులే నీకు హిరణ్యాభరణాలు. అవశయై నీ మేన వ్రాలుటే దండాలు. ఆమె అధరామృతం నీకు పంచామృత నైవేద్యం.  తన సర్వస్వమూ నీ కర్పించి, బిగి కౌగిట ఆమె నవ్వే నవ్వులే నీకు కర్పూర తాంబూలాలు. ఈ యింతి అలమేల్మంగ షోడ శోపచార పూజలు ఈ విధంగా నీ కొనర్చినది. క్రమక్రమంగా ఈ పూజలన్నీ స్వీకరించు. ఆమె కోరిన జగత్కల్యాణపు వరమియ్యవయ్యా శ్రీవేంకటేశ్వరా అంటూ స్వామికి ఉద్బోధి స్తున్నారు అన్నమాచార్యులు. షోడశ కళానిధికి అన్న సంకీర్తనమూ, ఈ సంకీర్తనమూ తులనాత్మకంగా చూస్తే అన్నమాచార్యులు భావుకత ఎంత ఉత్కృష్టమైనదో తెలుస్తుంది.



వలజి - రూపకం

ఇన్ని రాసుల యునికి - యింతి చెలువపురాశి
కన్నెనీరాశి కూటమి - కలిగినరాశి

కలికి బొమవిల్లుగల - కాంతకును  ధనూరాశి
వెలయు మీనాక్షికిని - మీనరాశి
కులుకు కుచకుంభముల - కొమ్మకు కుంభరాశి
చెలగు హరిమధ్యకును - సింహరాశి

చిన్ని మకరాంకపు వయ్యెద - చేడెకు మకరరాశి
కన్నె ప్రాయపు సతికి - కన్నెరాశి
వన్నెమైబైడి దులదూగు - వనితకుసు తులారాశి
తిన్నని వాడి గోళ్లస - తికి వృశ్చికరాశి

ఆముకొను మొరపుల - మెరయు నతివకు వృషభరాశి
జామిలి గుట్టు మాటల - సతికి కర్కటకరాశి
కోమలపు చిగురు మోవి - కోమలికి మేషరాశి
ప్రేమ వేంకటపతి గలిసే - ప్రియ మిధునపురాశి

అన్నమాచార్యుల అసమాన కవితావైభవం, అనన్యకల్పనా వైదగ్ధ్యమూ ఆపాతమధుర మైన ఊహాచిత్రీకరణమూ శాస్త్ర విషయ పరిజ్ఞాన పరిపాకమూ ఈ సంకీర్తనలో ముమ్మరించి మెరుగులీనుతున్నాయి.

జ్యోతిశ్చక్రంలో ద్వాదశరాసులున్నవి. అవి మేష వృషభ మిధున కర్కట సింహ కన్యా తులా వృశ్చిక ధనుర్మకర కుంభ మీనాలు. అలమేల్మంగ జగత్స్వరూపిణి గనుక ఈ (జ్యోతి శ్చక్రమంతా) ద్వాదశరాసులన్నీ ఆమెలోనే ఉన్న విగనుకా ఆమె చెలువములన్నింటి  రాశీ అయినది. శ్రీ స్వామికీ, ఆమెకూ జాతకాలు సరిపోయాయి. స్వామి రాశి కూటమిలో ఆమె రాశి మైత్రి పాటిస్తున్నదట. జన్మకాలంలో చంద్రుడేరాశిలో ఉంటే అది జన్మరాశి అవుతుంది. చంద్రుడేరాశిలో వున్నా రాసులన్నీ అలమేల్మంగలోనే ఉన్నాయి గనుక స్వామి వారి రాశిలో రాశిమైత్రి తప్పనిసరిగా కలుగుతున్నదంటున్నారు సిద్ధాంతి  అన్నమయ్య గారు.

1. విల్లువంటి కనుబొమలుగల కాంత ఆమె గనుక ధనూరాశి ఆమెలో కలిగింది.

2. అలమేల్మంగ కన్నులు మీనములవలె ఉన్నాయిగనుక మీనరాశి ఏర్పడిందామెలో.

3. ఆ లావణ్యవతికి కదలుతూ కులుకుతూన్న కుచముల కుంభములున్నవి గనుక కుంభరాశి ఆమెలో దర్శనమిస్తున్నది.

4. ఆమె కృశించిన సన్ననినడుము సింహంనడుములాగ ఉన్నందున సింహరాశి ఆమె యందు ద్యోతితమౌతున్నది.

5. అలమేల్మంగమ్మ పయ్యెద - గాలికి అల్లల్లాడుతూ - మన్మధుని జెండా - మొసలి చిన్నెలున్న మరుని పతాకంవలె ఉన్నందున మకరరాశి సంతరించబడ్డది.

6. నిత్యయౌవన, కాలరహిత ఆ అలమేల్మంగ కనుక కన్యారాశి ఆమెను ఆశ్రయించింది.

7. మేలిమి బంగారంతో సరి తూగే మేనిరంగుల ఆమెలో తులారాశి నిస్తులమైనది.

8. సన్నని పొడవైన వాడిగోళ్లు గలది గనుక ఆమెలో వృశ్చికరాశి వెల్లివిరిసింది.

9. గాఢమై, అతిశయించిన రిషభాది స్వరాలు మధురంగా ఆమె గొంతులో ధ్వనిస్తు న్నందున ఆమెలో వృషభరాశి ఒనరింది.  సరిగమపదనిలలో 'రి' రిషభం వృషభధ్వని సంకేతం అని సంగీతశాస్త్రం : శుద్ధ, చతుశ్రుతి షట్శ్రుతి భేదాలు మూడు రిషభంలో.

10.కర్కటకం, ఎండ్రకాయ, బొరియల్లో నివసిస్తుంది గుట్టుగా, అలమేల్మంగ మృదు మధుర మంద్ర స్వనంతో ప్రణయ రహస్యపు పలుకులొలికిస్తుంది స్వామితో. అందువల్ల ఆమె కర్కటక రాశికి కాణాచైనది.

11. మేషం - మేక - ఆకులూ చిగుళ్ళూ మేస్తూ ఉంటుంది. మేకకు ముఖాన చిగుళ్ళుంటాయట. అలమేల్మంగకు అధరాలే చిగురులైనవి కనుక ఆమెలో మేషరాశి మిడిసిపడుతున్నది.

12.

శ్రీ వేంకటపతీ ! నీవు ప్రేమతో ఆమెను కలసి కల్యాణమాడితే మిథునరాశి ఏర్పడక ఏమౌతుంది అంటూ అలమేల్మంగా శ్రీవేంకటేశ్వర కల్యాణానికి మంగళతూర్యాలు మ్రోగిస్తున్నారు అన్నమాచార్య దైవజ్ఞులు.

## ఉదయరవి చంద్రిక -రూపకం

జయలక్ష్మి వరలలక్ష్మి - సంగ్రామ వీరలక్ష్మి
ప్రియురాలవై హరికి - బెరసితివమ్మా

పాలజలనిధిలోన - పసనైన మీగడ
మేలిమి తామరలోని - మించు వాసన
నీలవర్ణు నురముపై - నిండిన నిధానమవై
యేలేవులోకములు మ - మ్మేలవమ్మా

చందురుతోడబుట్టిన - సంపదల మెఱుగవో
కందువ బ్రహ్మలగాచే - కల్పవల్లి
అందిన గోవిందునికి - అండనెతోడునీడవై
ఉందానవు మాయింటనే - ఉండవమ్మా

పదియారు వన్నెలతో - బంగారు ప్రతిమా
చెదరని వేదముల - చిగురుబోడి
యెదుట శ్రీవేంకటేశు - నిల్లాలవైనీవు
నిదులనిలచే తల్లి - నీవారమమ్మా

అన్నమాచార్యుల ఆంధ్రవేదంలో అలవోకగా అమరి అలరిన శ్రీసూక్త పురస్సర లక్ష్మీస్తవ సంకీర్తనమిది.

జయలక్ష్మివి, వరలలక్ష్మివి, విజయలక్ష్మివి నీవు శ్రీ మహావిష్ణునకు ప్రియభామవై ఒప్పినదానవు.

క్షీరసాగరంలోని సారమంతా మూర్తీభవించినదానవు నీవు. చతుర్దశాది సహస్రదళ కమలాలలోనూ తత్సుగంధ వైభవము నీవేనమ్మా అని ఇక్కడ ఆయన పొదిగిన శ్రీసూక్త మంత్రం ఇది.

గంధ ద్వారాం దురాధర్షాం నిత్యపుష్టాంకరీషిణీం - నీలమేఘశ్యాముని వక్షస్థలంపై కొలువై, నీవు జగమంతా పరిపాలిస్తున్న లక్ష్మి - మమ్ము దయజూడవమ్మా అని పైన చెప్పిన మంత్రంలోని ఉత్తరార్థం ఇక్కడ అలంకరించారు.

ఈశ్వరీగ్ం సర్వ భూతానాం తా మిహోపహ్వయేశ్రియం

చంద్రుడు, ఐరావతం కౌస్తుభం మొదలైన ఎన్నో ఐశ్వర్య రూపాలు ఆవిర్భవించాయి. పాలకడలిలో - వాటన్నింటిలో శ్రేష్ఠమైన సంపల్లతవు నీవు - చన్ద్రాం హిరణ్మయీం లక్ష్మీం అన్న మంత్రం అలంకరింపబడింది - బ్రహ్మను కాపాడే కల్పవృక్షానివి నీవు. విష్ణుహృన్నివాస వై, నిత్య విష్ణు విలసితవై ఉన్న నీవు మా యింటనేఉండవమ్మా అని.

అర్ద్రాం పుష్కరిణీం పుష్టిం పింగళాం పద్మమాలినీం

చంద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మమావహ

ఇత్యాది మంత్రార్థాలనూ - నిత్యంసాపద్మహస్తామమవసతుగృహే సర్వ మాంగళ్య యుక్తా అన్న మంత్ర శ్లోక భావాన్నీ నింపించారు.

పదియారు వన్నెలతో బంగారు ప్రతిమా! అన్న సంబోధనలో శ్రీసూక్తంలోని ప్రథమ మంత్రం 'ఓం హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణ రజతస్రజాం

చన్ద్రాం హిరణ్మయీం లక్ష్మీం జాతవేదో మమావహ, ఇమిడింది.

చివరి చరణంలో పద్మప్రియే పద్మిని పద్మహస్తే పద్మాలయే పద్మదళాయతాక్షీ

విశ్వప్రియే విష్ణు మనోనుకూలే, తత్పాద పద్మంమయి సన్నిధత్స్వ అన్న మంత్ర శ్లోకం నెలకొల్పబడ్డది. శ్రీసూక్తానికి, ఈ కీర్తనకూ ఉన్న తేడా అల్లా శ్రీసూక్తం సంస్కృతంలో, ద్వితీయా విభక్తిలో ఉంది. ఈ కీర్తన తెలుగులో సంబోధనా ప్రథమా విభక్తిలో అలరింది.

కన్నడగౌళ - ఝంప

కామయాగముజేసె - గలికితన
ప్రేమమే దేవతా - ప్రీతిగాను

పాలు పలర సురతతాం - బూలరస పానంబు
నలినాక్షి సోమ పా - నంబు గాను
కల కలంబుల మంచి - గళరవమ్ముల మ్రోత
తలకొన్న వేద మం - త్రములు గాను

పడతి తన విరహ తా - పమున బుట్టినయగ్ని
అడరి దరికొన్న హో - మాగ్నిగాను
ఒడబడిక సమరతుల - నుదయించిన జెమట
దడియుటేయది యవ భృ - ధంబు గాను

తనరకుచముల రుచులు - దంతాక్షత క్రీడ
ననుపైన పశు బంధ - నంబు గాను
యెనసి శ్రీ తిరువేంక - టేశ్వరుని పొందు
ఘనమైన దివ్య భో - గంబుగాను

కాముని జన్నము చేసినది ఆ కలికి అలమేల్మంగ ఆ మన్మధ యజ్ఞములో దేవతాప్రీతి రూపమైనది ఆమె ప్రేమ. నాయికా కృతమైన వైదిక ప్రక్రియగా సంభోగ శృంగారాన్ని నెలకొల్పారు అన్నమాచార్యులవారు. వేదంలో సహితము రతిక్రియ ఇలాగే హోమ ప్రక్రియగా వర్ణింప బడ్డది. సాహిత్యంలో స్మరయాగ సంప్రదాయాన్ని వెలయించినది అన్నమాచార్యులే. ఈ సంకీర్తనలో నాయిక తన శృంగారపు, సౌందర్యపు సామగ్రిని యజ్ఞోపయుక్త వస్తువులు చేసి వైదికక్రమం పాటించడము విశేషం.

కలికి చేసిన కామయాగంలో ఒడికమైన సురతపు తాంబూల రసపానమే సోమరసపానమై, తద్యజ్ఞ కర్మ నిర్వహింపబడినది. ఆమె శృంగార సంరంభ కలరవాలూ, రతికూజితధ్వనులూ, పూత్కారాలూ - అన్నీ స్మరయజ్ఞ విధికి వేద మంత్రాలై ఒనరినవి.

తన విరహతాపంవల జనించిన కామాగ్ని రగులుకొని రాజుకొన్న హోమాగ్నిగా వ్రేల్చినది ఆమె. పరస్పరం అంగీకృతమైన సమరతుల శ్రమచే జనించిన చెమటలో తడిసి,

తన కాముని యజ్ఞాని కామె అవభృద స్నానం ఆచరించినది అవభృదం యజ్ఞాంతంలో చేసే పుణ్యావాహన పవిత్రీకరణ స్నానం.

ఆమె తన స్తనముల మెఱుగులు పలుగాట్ల గుర్తుల విరియించు ప్రక్రియ యజ్ఞ కర్మ అయిన పశుబంధనం లాగున నిర్వర్తించినది.శ్రీవేంకటేశ్వరుని తోడిపొందు దివ్య భోగమైన యజ్ఞ ఫలప్రాప్తి అయినది ఆమెకు. ఆకంతు క్రతువులో పశు బంధనం ఉన్నదే గాని పశుబలి ఎక్కడాలేదు ఈ కీర్తనలో.స్త్రీలొనరించే యాగాలలో పశు బలిదానాలు నిషిద్ధం. వైదిక ధర్మప్రకారం స్త్రీలకు  బలిఇచ్చే అధికారం లేదు. (ఒక్క వామాచారంలో తప్ప కౌల వామాచారుల శ్రుతిబాహ్యులని వైదికుల, సమయాచారుల మతం) ఈ వైదిక ధర్మౌచిత్యాన్నే పాటించారు అన్నమాచార్యులు.

నాటకురంజి - రూపకం

కానరటే పెంచరటే - కటకటా బిడ్డలను
నేనూ మీవలెనే కంటి - నెయ్యమైన బిడ్డని

బాయట పారేసిన - పాలు వెన్నలను
చేయి పెట్టకుందురా - చిన్నబిడ్డలు
మీయిండ్ల జతనాలు - మీరు చేసినకొనక
పాయక దూరేరేల - ప్రతిలేని బిడ్డని

మూసిన కాగులనే యీ - ముంగిట పెరుగులూ
ఆసపడకుందురా - ఆడే బిడ్డలు
ఓసరించి మోసపోక - ఉండలేక మీరు
చేసేరింతేసి దూరు - చెప్పరాని బిడ్డని

చొక్కమైన కొప్పెరల - జున్నులూ చన్నులూ
చిక్కిన విడుతురా - చిన్నబిడ్డలు

నాటకురంజి - రూపకం

కానరటే పెంచరటే - కటకటా బిడ్డలను
నేనూ మీవలెనే కంటి - నెయ్యమైన బిడ్డని

బాయట పారేసిన - పాలు వెన్నలను
చేయి పెట్టకుందురా - చిన్నబిడ్డలు
మీయిండ్ల జతనాలు - మీరు చేసినకొనక
పాయక దూరేరేల - ప్రతిలేని బిడ్డని

మూసిన కాగులనే యీ - ముంగిట పెరుగులూ
ఆసపడకుందురా - ఆడే బిడ్డలు
ఓసరించి మోసపోక - ఉండలేక మీరు
చేసేరింతేసి దూరు - చెప్పరాని బిడ్డని

చొక్కమైన కొప్పెరల - జున్నులూ చన్నులూ
చిక్కిన విడుతురా - చిన్నబిడ్డలు
మిక్కిలి పూజలు చేసి - మెప్పించ తగదా
యెక్కువైన తిరువేంక - టేశుడైన బిడ్డని

మాతృవాత్సల్యం మహనీయమైంది. తమ పిల్లల అల్లరి చేష్టలను తల్లులు సమర్థిస్తూ ఉంటారు. తమ ముద్దు బిడ్డలపై నేరాలు ఎవరు చెప్పినా విని భరించలేరు. ఆ శిశువ్యామోహ వివశయైన తల్లి సమర్థింపు. ఆ సమర్థింపులో సహజత్వం సర్వత్రా చక్కిలిగింతలుపెట్టే సంకీర్తనమిది. గోపికలన్నారు యశోదతో-

ఓయమ్మ నీ కుమారుడు
మా యిండ్లను పాలు పెరుగు మననీడమ్మా
పోయెద మెచ్చటికైనను
మాయన్నల సురభులాన మంజులవాణీ !

యశోద అంటున్నది శ్రీకృష్ణుని దుండగాల గూర్చి విన్నవించవచ్చిన గోపస్త్రీలతో - అమ్మలారా ఈ చిన్ని శిశువుపై యిన్ని నేరాలు చెప్తున్నారు. మీరు బిడ్డలను కనలేదా - పెంచలేదా? ఏమి చోద్యం; చిన్నపిల్లలు అల్లరి చెయ్యరా ? నేనూ మీ వలనే కన్నాను ఈ ముద్దుల ముత్యాన్ని.

పాలు వెన్నలు బయట పడేస్తే చిన్నపిల్లలు చేతులు పెట్టకుండా ఉంటారా ? మీ యింట్లో ఏర్పాట్లు మీరు సరిగా చేసుకోనడంమాని అద్వితీయుడైన మా కృష్ణుని దుయ్యబడతారెందుకు ?

మూసిన ముంతల్లో పెరుగు ముంగిట - ముందర సాక్షాత్కరిస్తే ఆటలాడే పిల్లలకు ఆశ ఉండదా ? మీకు ఇలా అల్లరి చేయించుకోవడం అభిమతం. కావాలని కృష్ణుని అల్లరికి మీరే యేర్పాట్లు చేసి, అల్లరి - అల్లరి - అని అల్లరి చేస్తున్నారు అనిర్వచనీయుడైన నా చిన్నికృష్ణుని.

(చవులూరించే) గిన్నెలలో జున్నులూ, మాతృమూర్తుల చిక్కనై చక్కనైన రవికెలలో చన్నులూ చేజిక్కితే విడిచిపెట్టగలరా చిన్న పాపలు ? శ్రీవేంకటేశ్వరుడు తానే అయిన బిడ్డని మిక్కుటమైన పూజలు చేసి చొక్కింపజేయాలిగాని, నేరాలు చెప్పడమా ఆచరణీయం ? అంటున్న యశోదమ్మచేత మాతృత్వమోహ వాత్సల్యాల నుండి జగన్నేతృత్వ జిజ్ఞాసగల తత్వవేత్త భావానికి తనపలుకులచే హనుమత్సముద్ర లంఘనం చమత్కారంగా చేయించారు సంకీర్తనాచార్యులు.

ఆనందభైరవి - ఆది

కంటి శుక్రవారము - గడియలేడింట
అంటి అలమేల్మంగ - అండనుండే స్వామిని

సొమ్ములన్నీ కడబెట్టి - సొంపతో గోణముగట్టి
కమ్మని కదంబము - కప్పు పన్నీరు
చెమ్మతోన వేష్టువలు - రొమ్ముతల మొల జుట్టి
తుమ్మెద మై చాయతోన - నెమ్మదినుండే స్వామిని

పచ్చకప్పరమె నూరి - పసిడి గిన్నెల నించి
తెచ్చి శిరసాదిగ - దిగనలది
అచ్చెరపడిచూడ - అందరికన్నులకింపై
నిచ్చమల్లె పూవువలె - నిటుతానుండే స్వామిని

తట్టుపునుగు కూర్చి - చట్టలు జేరిచి నిప్పు
పట్టి కరగించి వెండి - పళ్యాల నించి
దట్టముగ మేనునిండ - పట్టించి దిద్ది
బిట్టు వేడుక మురియుచుండే - బిత్తరి స్వామిని ॥కంటి॥

శుక్రవారాభిషేకం స్వామికి విశేషమైన సేవ. అన్నమాచార్యుల కాలంలో ఈ సేవ ఇలా జరిగేది. ఆపాదమస్తకం స్వామికి పునుగు తైలపుటభ్యంజనం చేసి, కుంకుమ పూవు మొదలైనవాటి మెత్తని పొడులతో నలుగుబెట్టి, పన్నీటితో శుద్ధోదకంతో స్నానమాడించి, తుడిచి, సర్వాంగములు చెమ్మలుఆరగా గర్పూరధూళి చల్లి మేదించి, దానిపైన పల్చపల్చగా పునుగు సుగంధతైలం రాచి, ముత్యాల తిరునామము, మంగతాళి మొదలైన దివ్యాభరణాలు, పట్టువస్త్రాలు, పుష్పహారాలూ అలంకరించేవారు.

తిరుమజ్జనవేళ అన్నమాచార్యులు స్వామిచెంత నలుగుపాటలు, అభిషేక కీర్తనలు పాడటమూ, అభిషేకానంతరం ఒక అభిషేకపు పన్నీటి చెంబూ, తాంబూల చందనాది సత్కారాలు స్వీకరించడం రివాజు. తిరుమజ్జనోత్సవం శాశ్వతంగా ఇలా జరుగుటకై అన్నమాచార్యులూ, తత్సుతులూ, స్వామికి కొన్ని అగ్రహారాలు కైంకర్యం చేశారు.

ఈనాడు తిరుమజ్జనోత్సవం ఇలా జరుగుతున్నది. పునుగు తైలంలో అభ్యంజనము, క్షీరఘటాభిషేకము, కుంకుమపువ్వు, కస్తూరి, కర్పూరం కలిపి నూరి బంగారు గిన్నెలలో పల్చగా జేసిన ద్రవ్యంతో నలుగు, స్వల్పంగా జలాభిషేకమూ జరుగుతాయి. అనుకు నలుగుతో కలసిన ఆ తీర్థం స్వామి పాద తీర్థంగా సేకరించిన తర్వాత విరివిగా జలంతో అభిషేకం జరుగుతుంది. తలతడి ఆరేటట్లు పాడిబట్ట పిడిచుట్టు కట్టి (పిడప కట్టి) దివ్య మంగళ విగ్రహమంతా పాడి బట్టతో తుడిచి ముఖముపై నీటిపూతగానూ తక్కిన సర్వాంగములపైనా దూమెరుగుగా పునుగుతైలము పూసి, ముఖమున కర్పూర చూర్ణం తో తిరునామము సాతుతారు. (ఆ కర్పూర చూర్ణమే తిరునామం మళ్లీ వారం తీసివేసిన ప్పడు శ్రీహరి మహాప్రసాదంగా సేకరించబడి, పంచబడుతుంది. ఆ నామానికి మధ్య కస్తూరీ తిలకం దిద్దుతారు.

తిరుమజ్జనోత్సవాన్ని అన్నమాచార్యులు తత్పుత్రులూ అతి మనోహరంగా అభివర్ణించా రు. అభిషేక దర్శనం చేసిన సమయంలో అన్నమాచార్యులు ఆవిష్కరించిన ఆనందపు టందాల అతిశయపు కీర్తనమిది. శుక్రవారాభిషేక దర్శన భాగ్యం ఈ సంకీర్తనా గానం వల్ల తప్పక లభిస్తుంది.

ఈ వ్యాఖ్యకు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి 'అన్నమాచార్య చరిత్ర' పీఠికా, తాళ్ళపాక తిరువేంగళనాథుని పరమయోగి విలాసమూ, అన్నమాచార్యుని యితర అభిషేక కీర్తన లూ ఆధారాలు. వారికి కృతజ్ఞాతాపూర్వక నమస్సులు.

ఆహిరి - ఆది

కరేణ కిం మాం - గృహీతుంతే
హరే ఫణిశ - య్యా సంభోగ

జలేతవ సం - చరణ మిహాధః
స్థలే భవనం - తవ సతతం
బలేరూప - ప్రకటనమతులా
చలేస్థానం - చలచలరమణా

పదే భువన - ప్రామాణ్యం తవ
హ్రదే ప్రచురవి - హరణమదం
ముదే మునీనాం - మోహనం తనుం
మదే తవనర్మచ - మాం విసృజ

స్మరేవిజయ - స్తవ విమలతురగ
ఖురే రతి సం - కులరచనా
పురే తవ వి - స్ఫురణం వేంకట
గిరేః పతేతే - ఖేలా ఘటిత

ఇది మరొక దశావతార సంకీర్తన. నాయిక శ్రీహరితో అంటున్నది - ఓ శేషతల్ప శయన సుఖీ ! హరీ! నీవు నా పాణిగ్రహణం ఆచరించడం దేనికి ? నా చెయ్యి పట్టుకోవడం ఎందుకు ?

నీవు నీట్లో తిరుగాడుతావు. (మత్స్యానివి) నీటి క్రిందే ఇల్లుకట్టుకొని ఉంటా వెప్పడూ (కూర్మానివి గదా) బలవత్తరమైన రూప ప్రకటన నీది. మొరటు వాడివీ వరాహానివీ గదా ( నీ బలంముందు నేను నలిగిపోతానేమో). పెద్ద స్తంభంలో దాక్కుంటావు. (నృహరివి) పోవయ్యా మగడా నా చేయెందుకు పట్టుకుంటున్నావు ?

నీ పాదం ప్రపంచమంతా కొలవగల పెద్ద కొలబద్ద. (వామనావతారం) సరస్సులో విహరించే పరశురాముడవు. మునులకు మోదంకల్గించే మోహనతనుదారివి శ్రీరాముడవు నీవు. నీ రహస్యమంతా నీ మద్య ప్రీతిలో ఉన్నది. (బలరాముడని ధ్వని).

మన్మథ సామ్రాజ్య చక్రవర్తివి, శ్రీకృష్ణుడవు. నీ గొప్ప అశ్వపు గిట్టలలో శ్రీకృష్ణావతార పు శృంగార ప్రావీణ్యం నెలకొల్పిన కల్కివి. తిరుమలపై నీ పైడి దేవాలయంలో వెలుగొందు తున్నావు. శ్రీవేంకటపతీ ! ఇవి అన్నీ నీ లీలావిలాసాలు - నా చెయ్యెందుకు పట్టుకుంటు న్నావు ?అంటూ ఆ శృంగార నాయిక - అలమేల్మంగ - స్వామిని చెయిబట్టనీక ఆ స్వామి ఎదపైన స్థిరనివాసమేర్పరచుకొన్నది.

యదుకుల కాంభోజి - ఆది

కొలని దోపరికి - గొబ్బిళ్ళో యదు
కుల స్వామికిని - గొబ్బిళ్ళో

కొండగొడుగుగా - గోవులగాచిన
కొండొక శిశువుకు - గొబ్బిళ్ళో
దుండ గంపు దై - త్యులకెల్లను తల
గుండు గండనికి - గొబ్బిళ్ళో

పాపవిధుల శిశు - పాలునితిట్టుల
కోపగానికిని - గొబ్బిళ్ళో
ఏపున కంసుని - ఇడుమల బెట్టిన
గోపబాలునకు - గొబ్బిళ్ళో

దండివైరులను - దరిమిన దనుజుల
గుండె దిగులునకు - గొబ్బిళ్ళో
వెండి పైడియగు - వేంకటగిరిపై
కొండలయ్యకును - గొబ్బిళ్ళో

అన్నిప్రక్రియలూ అన్నమాచార్యులు తమ పదాలకెక్కించి, వాటిని వైకుంఠ మెక్కించారు. దంపుళ్ళ పాటలు, జాజరలు, జోలలు, ఉయ్యాల పాటలు - ఒకటేమిటి అన్ని ఆయన పదాల నలంకరించాయి. ఇది గొబ్బిళ్ళ పాట.

ప్రతి పనీ పరమేశ్వరార్పణగా, నాచరించే హరిభక్తి సంప్రదాయం ఈ కీర్తనలో యింపారుతున్నది. సంక్రాంతి పండుగ ముందరి రోజుల్లో కన్నె పడుచులు గోమయంతో గొ బ్బెళ్ళు చేసి తీర్చిన రంగవల్లులలో ఉంచి గోమయగోళాలలను అలంకరించి, వాటిచుట్టు నృత్యశైలిగా చక్రవలయంలో తిరిగే ఆట గొబ్బెళ్ళ ఆట. పాడే పాట గొబ్బిళ్ళపాట. యదుకుల స్వామికి కైంకర్యమైన పాట. భక్తులకు వెండి బంగారాలైన శ్రీవేంకటాద్రిపైన కొలువైయున్న కొండలయ్యకు సమర్పితంగా ఈ గొబ్బిళ్ళ పాట మధురమనోజ్ఞంగా అన్నమయ్యనోట నలరినది.



బృందావని - ఝంప

క్షీరాబ్ధి కన్యకకు - శ్రీమహాలక్ష్మికిని
నీరజాలయకును - నీరాజనం

జలజాక్షి మోమునకు - జక్కవకుచంబులకు
నెలకొన్న కప్పురపు - నీరాజనం
అలివేణి తురుమునకు - హస్తకమలమ్ములకు
నిలుపు మాణిక్యముల - నీరాజనం

చరణకిసలయములకు - సకియరంభోరులకు
నిరతమగు ముత్యాల - నీరాజనం
అరిదిజఘనంబునకు - నతివ నతనాభికిని
నిరతి నానావర్ణ - నీరాజనం

పగటు శ్రీవేంకటేశు - పట్టపురాణియై
నెగడు సతికళలకును - నీరాజనం
జగతి నలమేల్మంగ - చక్కదనములకెల్ల
నిగుడు నిజశోభనపు - నీరాజనం

శ్రీమహాలక్ష్మి 'ఈం' కారవాచ్య 'తాం పద్మినీం
ఈం శరణమహంప్రపద్యే' అని శ్రీసూక్త మంత్రం. ఈ 'నీరా
జనం' అన్న పదంలో 'ఈ' కారమూ పూర్ణానుస్వారమూ
పొదగబడ్డాయి. 'శ్రీం' లక్ష్మీబీజాక్షరం.

ఏ కారణంవల్లనో షోడశోపచారాల సంకీర్తనలో చేర్చక, కర్పూర నీరాజనాన్ని అలమేల్మంగకు ప్రత్యేకించారు అన్నమాచార్యులు. దేవతాస్తోత్రం కేశాది పాదాంతంగా చేయడం సంప్రదాయం. ఆ సంప్రదాయానికి ఉదాహరణ మనకు శ్రీలలితా సహస్రనామ స్తోత్రంలో గోచరిస్తున్నది. ఈ సంకీర్తనలో అన్నమయ్య సుప్రతిష్టితం చేసింది ఆ సంప్రదాయాన్నే ఈ కీర్తన మంగళహారతి ఇచ్చే దృశ్యం మనకు కట్టెదుట నిలిపే పదచిత్రం.

శ్రీమహాలక్ష్మికి, క్షీరసాగర కన్యకు, నీరజాలయకు ఈ నీరాజనం. అచింత్య లక్షణాకారమైన ఆ జలజాయతలోచన ముఖపద్మానికి, చక్రవాకయుగళసదృశమైన ఆమె వక్షోజ ద్వయానికి తుమ్మెదలదండవంటి ఆ కొప్పు ఒనపరితనానికి, వరదాభయ  ప్రదాలైన ఆ కమలాకరకమలాజితకమలాలకు, కమలాపతిప్రియమణులు, కెంపుల నిలువెత్తు నీరాజనం ('సమర్పయామి' అని అన్వయించుకోవలె)

ఆమె చరణపల్లవాల లేకెంజాలకు ఆమెరంభాసదృశోరువులకు నిత్యమైన ముత్యాల నీరాజనం, అరుదైన ఆమె కటరమ్యతకు, నతగంభీరనాభికి వివిధవర్ణాల నీరాజనం.

శ్రీవేంకటేశ్వరునికి పట్టపురాణియై అలరారే సిరికళలకు ఇది నీరాజనం. అలమేల్మంగ చక్కని అందాలన్నింటికీ అనంత జగదంత దిగంత శృంగార నిజ శోభన నీరాజనం.

ఈ సంకీర్తనాన్ని స్వరపరచి, మెఱుగులు దిద్దినవారు పూజ్యపాదులు, శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు. బహుళ ప్రచారంలోకి వచ్చిన అన్నమాచార్యుల సంకీర్తనలలో ఆణిముత్యంవంటి ఈ సంకీర్తన ప్రతి యింటా హారతి యిచ్చేవేళ పాడితే

అనిర్వచనీయానందైశ్వర్యాలు లభించటంలో సందేహం లేదు.

సురటి - ఆది

మంగళము గోవిందునకు జయ - మంగళము గరుడధ్వజునకును
మంగళము సర్వాత్మకునకు ధ - ర్మ స్వరూపునకూ జయ జయ

ఆదికి నాదైనదేవున - కచ్యుతున కంభోజ నాభున
కాదికూర్మంబైన జగ - దాధార మూర్తికిని
వేదరక్షకునకును సంతత - వేదమార్గ విహారునకు బలి
భేదికిని సామాదిగాన - ప్రియవిహారునకు

హరికి పరమేశ్వరునకు శ్రీ - ధరునకును కాలంతకునకును
పరమ పురుషోత్తమునకు - బహుబంధ దూరునకును
సురముని స్తోత్రునకు దేవా - సురగణ శ్రేష్టునకు గరుణా
కరునకును  కాత్యాయనీనుత - కలిత నామునకు

పంకజాసన వరదునకు భవ - పంక విచ్ఛేదునకు భవునకు
శంకరున కవ్యక్తునకు - నాశ్చర్య రూపునకు
వేంకటాచల వల్లభునకు - విశ్వమూర్తికి నీశ్వరునకును
పంకజాకుచకుంభ కుంకుమ - పంచలోలునకు జయజయ

మంగళము విష్ణుదేవుడు
మంగళ మైమ్మెదలంప మధురిపుడుద్య
న్మంగళ మంభోజాక్షుడు
మంగళమఖిలము, విహంగమధ్వజుడరయన్

అని తిక్కనగారి మంగళం భీష్మస్తవరాజ ఘట్టంలో, మంగళార్థం అన్నమాచార్యులు చాలా సంకీర్తనలు సంకలించారు. షష్టంతంగా చెప్పిన తిరు మంగళ సంకీర్తనమిది.

గోవిందునకు, సర్వాత్మకునికి, గరుఢధ్వజునికి ధర్మ స్వరూపునికి జయమంగళం - జయజయమంగళం.

ఆద్యాది దేవునికి, అచ్యుతునికి, అబ్జనాభునికి, అబ్జనాభునికి, అది కూర్మమై జగత్తం తటికీ ఆధారమైన స్వరూపం గలవానికి, వేద రక్షణ మొనర్చిన మీనావతారునికి నిరంత ర వేదోక్త వధగామికి, బలి గర్వమణచిన వామనునికి, సామగాన సంగీత ప్రియునికీ మంగళం - జయమంగళం, హరికి, పరమేశ్వరునికి, శ్రీధరునికి, మృత్యునాశనమొనర్చే అక్షరునికి, పరమ పురుషుడైన పురుషోత్తమునికి, అనేక బంధాలకూ అతీతునికి, దేవర్షులచే స్తుతింపబడువానికి, దేవదానవులందరిలోకి శ్రేష్ఠుడైనవానికి, కరుణకు నిల యమైనవానికి, లలితా స్తోత్ర పాత్రునికి మంగళం - జయమంగళం.

బ్రహ్మాదులకు వరదానమొసగే, జనన మరణ దుఃఖపు పంకం తొలగించే భవ కార కునికి, భవునికి, శంకరునికి, అవ్యక్తునికి, ఆశ్చర్యంగొలిపే మూర్తి వైభవం గలిగిన శ్రీవేంక టాచల వల్లభుడైన విశ్వమూర్తికి, జగదీశ్వరునికి - శ్రీరమాకుచ కుంభాలపైనున్న కుంకుమ పంకంపై అంకిన ఇంకని పొంకపుటాసక్తిగల శ్రీస్వామికి మంగళం - జయజయమంగళం అని మంగళ సంకీర్తన మొనరించారు సంకీర్తనాచార్యులు.

శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిదయేర్థినాం
శ్రీ వేంకటనివాసాయ శ్రీనివాసాయ మంగళం

నాట - ఆది

మర్ద మర్ద - మమబంధాని
దుర్ధాంతమహో - దురితాని

చక్రాయుధ రవి - శత తేజోంచిత
సక్రోధసహ - స్రప్రముఖా
విక్రమక్రమా - విస్ఫులింగ కణ
నక్రహరణ హరి - నవ్యకరాంకా

కలితసుదర్శన - కఠినవిదారణ
కులిశకోటిభవ - ఘోషణా
ప్రళయానగ సం - భ్రమవిభ్రమకర
రళితదైత్యగళ - రక్త వికీరణా

హితకర శ్రీ వేంక - టేశ ప్రయుక్త
సతతపరాక్రమ - జయంకర
చతురోహంతే - శరణం గతోస్మి
యితరాన్ విభజ్య - యిహ మాంరక్ష

హరి సుదర్శనచక్రంపైన చెప్పబడ్డ సంకీర్తనమిది. నూరు సూర్యులతేజంగల చక్రాయుధమా జ్వాలామాలికలతోకూడిన వేయి శ్రేష్టమైన ముఖములుగల చక్రమా ! విక్రమించే క్రమపు సంరంభంలో నిప్పులు వెదజల్లుతూ (గజరాజుని పీడించుతున్న) మొసలిని సంహరించిన చక్రమా ! శ్రీ విష్ణుని నిత్యనూతనమైన కరమందు అమరిన చక్రమా. నా బంధములను నశింపజేయు శమింపరాని నా పాపాలన్నింటినీ నాశనమొనర్చు, సుదర్శనమనే నామం అలరిన చక్రమా! కఠినమైన పర్వతాలను తుత్తు నియలు చేసే కోటి వజ్రాయుధాల తీవ్ర ఘోషతో వెలయుచక్రమా! ప్రళయాగ్ని సంభ్రమమా ఇది అవే విభ్రాంతినొనర్చుతూ తెగనరికిన రాక్షసుల కుత్తుకల నుండి రక్తధారలను వెదజల్లు సుదర్శనమా లొంగిరాని నా అఘములనూ, బంధాలనూ నశింపజేయి. సంహరించు జగద్ధితమొనర్చే శ్రీ వేంకటేశ్వరుచేత ప్రయోగింపబడి నిత్యమైన పరాక్రమం కలిగి, సర్వతోజయముగల చక్రమా! నేను చతురుడనై నీ శరణుజొచ్చాను. నేను హరిభక్తుడను నన్ను రక్షించు. హరి భక్తేతరులను హరించు - సంహరించు. అని సంకీర్తన తాత్పర్యం.

ఈ సంకీర్తనలో సుదర్శనచక్ర మంత్రం నెలకొల్పినారు సంకీర్తనాచార్యులు. సుదర్శన కవచంలో సుదర్శనచక్ర మూలమంత్రమూ, లక్ష్మీప్రాప్తి ప్రయోగమంత్రమూ, శత్రునాశన ప్రయోగమంత్రమూ, మోహనమంత్రమూ, ఆకర్షణ మంత్రమూ - అయిదు విధాల మంత్రములు చెప్పబడ్డవి. వైష్ణవంలో విష్ణువు ఆయుధాలైన కౌమోదకి గదకూ, శార్ఙ్గ ధనువుకూ , నందక ఖడ్గానికి, పాంచజన్య శంఖానికీ, సుదర్శనచక్రానికీ - వేర్వేరు ప్రత్యేకపూజోపాసనలూ మంత్ర తంత్ర క్రియలూ ఉన్నవి. నిత్యనాధసిద్ధకృతమైన రసరత్నాకరంలోని మంత్రఖండంలో చక్ర, ఖడ్గ మంత్రాలు ప్రత్యేకంగా చెప్పబడ్డాయి. అహిర్బుధ్న్య సంహితలో పార్వతీదేవికీ పరమేశ్వరుడు సుదర్శన సహస్రనామ స్తోత్రం చెప్పినట్లు ఉన్నది. కూరనారాయణుడనే కవి మయూర సూర్యశతకంతో పోటీగా సుదర్శన శతకం రచించాడు. అపామార్జన మూల మంత్రంలో పేర్కొనబడ్డ సుదర్శనచక్రమంత్రం ఇది. ఓం నమో భగవతే శ్రీ సుదర్శనాయ మహా చక్రరాజాయ మాం రక్షరక్ష మమశత్రూన్నాశయనాశయ దరదర దారయ దారయచ్ఛింది ఛింది భింది భింది జ్వల జ్వల జ్వాలయ జ్వాలయ సహస్రకిరణాన్ ప్రజ్వల ప్రజ్వలశిఖా ఉత్తేషయోత్తేషయ దహనాత్మక చటచట చాటయ చాటయ గర్జయ గర్జయ త్రాసయ త్రాసయ చూర్ణయ చూర్ణయ వరప్రయుక్తానాం మంత్రాణా మష్టోత్తరశతం స్ఫోటయ - స్ఫోటయ పరశక్తీః పేషయ పేషయ పర మంత్రాన్ సంహర సంహర మాంరక్ష సహస్రారహుంఫట్స్వాహా ! ఈ మంత్రాన్నే సరళీకరించి ఈ సంకీర్తనలో ప్రతిష్ఠించారు అన్నమాచార్యులు. తెలుగులో 108 రగడ వృత్తాలతో సుదర్శన రగడ చెప్పిన అన్నమయ్య గారి సంస్కృత వాక్పటిమయిది.

వకుళాభరణం - రూపకం

మేదిని జీవులగావ - మేలుకోవయ్యా
నీదయే మాకెల్ల రక్ష - నిద్ర మేలుకోవయ్యా

తగు గోపికల కన్ను - దామరలు వికసించె
మిగుల సూర్యనేత్రుడ - మేలుకోవయ్యా
తెగువ రాక్షసులనే - తిమిరము విరియగా
నెగడిన పరంజ్యోతి - నిద్ర మేలుకోవయ్యా

ఘనదురితపు నల్ల - గలువలు వికసించె
మినుకు శశివర్ణుడ - మేలుకోవయ్యా
పనివడి వేదాలనే - పక్షులెల్లా బలుకగ
జనక యాశ్రిత పారి - జాత మేలుకోవయ్యా

వరలక్ష్మీ కుచచక్ర - వాకము లొండొంటిరాయ
మెరయు దోషరహిత - మేలుకోవయ్యా
పొరసి నీవు నిత్య - భోగములు భోగించ
నిరతి శ్రీవేంకటేశ - నేడు మేలుకోవయ్యా

జీవులందరికీ రక్షకుడు శ్రీ మహావిష్ణువు ఆయనే శ్రీవేంకటేశ్వరుడు. ఆస్వామికి ని్ర దమేల్కొలుపు సంకీర్తనలో ఆధ్యాత్మ శృంగారాల కలగలుపు.

మేలుకోవయ్యా; నీ దయ మాత్రమే మాకు రక్ష -

'వనమాలీగదీశాంర్గీ శంఖీ చక్రీ చ నందకీ

శ్రీమన్నారాయణో విష్ణుః వాసుదేవోభిరక్షతు' అని విష్ణు సహస్రనామ స్తోత్రంలో సం పుటి. జీవులందరినీ రక్షించవలె మేలుకో.

గోపికల నయన పద్మాలు మిక్కిలి వికసించాయి. సూర్యనేత్రుడవు నీవు మేలుకోవ య్యా! రాక్షసులనే చీకటిచే పలాయనం చిత్తగింపజేసే పరంజ్యోతికి నీవు మేలు కోవయ్యా!

పనిగొన్న వేదాలనే పక్షులు పలుకగా, ఘనమూ, దురితమూ అనే వేదగాన తాళవేగ విశేషములు నల్లకలువలై (అలమేల్మంగ కన్నుగలువలై వికసించినవి అని ఊహ్యం. మరొక అర్థం చెప్ప వీలుకాదు.) వికసించినవి - ఘనం - జట - పనస - ఇవి వేద పాఠ్యప్రయోగ విశేషాలు. అతివిలంబితం - విలంబితం, మధ్యమం - దురితం, అతి దురితం - ఇవి గానకళలో తాళానికి సంబంధించిన గతిభేదవిశేషాలు. మినుకు శశివర్ణుడు - అన్నప్పుడు సహస్రారకమలంపైనున్న అమృతబిందునిష్యందియైన చంద్రుడ ని సూచన - జగజ్జనకా ! యాశ్రితులపాలి కల్పవృక్షమా; మేలుకోవయ్యా.

శ్రీ వరలక్ష్మి కుచములు చక్రవాకములై ఒండొంటితో రాచుకొంటున్నవి. పరస్పరం మీరుభయులూ సములుగనుక అసమతాది దోషాలేవీ లేవు. (సాముద్రిక శాస్త్రప్రకారం) నేనొనరించే నిత్య భోగ నిత్యపూజలు నిరతిశయ విధిగా స్వీకరించ సమయమైనది. మే లుకోవయ్యా అని నిత్యజాగృతుడైన నిత్యునికి అనునిత్యజాగృతి నిత్యసంకీర్తనను ఘనజట పనసల - దురితకాలపు దువాళులతో వెలయించారు అన్నమాచార్యులు.

కురంజి - ఆది

ముద్దుగారే యశోద - ముంగిటి ముత్యము వీడు
దిద్దరాని మహిమల - దేవకీ సుతుడు

అంత నింత గొల్లెతల - యరచేతి మాణిక్యము
పంతమాడే కంసుని - పాలి వజ్రము
కాంతుల మూడు లోకాల - గరుడ పచ్చపూస
చెంతల మాలోనున్న - చిన్నికృష్ణుడు

రతికేళి రుక్మిణికి - రంగు మోవి పగడము
మితి గోవర్ధనపు గో - మేథికము
సతమై శంఖ చక్రాల - సందుల వైడూర్యము
గతియై మమ్ము గాచే - కమలాక్షుడు

కాళియుని తలలపైన - గప్పిన పుష్యరాగము
ఏలేటి శ్రీ వేంకటాద్రి - యింద్రనీలము
పాల జలనిధిలోన - బాయని దివ్యరత్నము
బాలునివలె దిరిగె - పద్మనాభుడు.

ఇది తన పలుకు నవరత్నాలతో అన్నమాచార్యులు కూర్చిన నవరత్న సంకీర్తనం. నవరత్నత్వాన్ని శ్రీ వేంకటేశ్వరునకు ఆపాదించడం విశేషం. యశోద ముంగిటి ముత్యం, గొల్లెతల అరచేతి మాణిక్యం, కంసుని పాలిటి వజ్రం, ముల్లోకాలకు కాంతులిచ్చే పచ్చపూస - మరకతం, రతి సమయంలో రుక్మిణికి శోణితాధర విద్రుమం - పగడం, గోవర్ధనమెత్తిన గోమేథికం, శంఖ చక్రాల సందున మెరసే వైడూర్యం, కాళియుని తలలపైన గప్పిన పుష్యరాగం, శ్రీవేంకటాద్రిపై యింద్రనీలం క్షీర జలధిలో నిత్య నివాసియైన పద్మనాభ దివ్య రత్నం అట శ్రీ వేంకటాచలపతి. ఇందులో కొన్ని జ్యోతిష రహస్యాలున్నవి. గ్రహదోష నివారణార్థం ఆయా గ్రహ రత్నాలను ఉంగరంలో , ఆభరణంలో ధరించడం లోకసామాన్యం. నవగ్రహ శాంత్యర్థం నవరత్నధారణ ప్రసిద్ధం. ముత్యంనుండి మొదలై ఈ నవరత్నాలూ ఏ క్రమంలో ఉండాలి అన్నది ఈ సంకీర్తనంలో చెప్పారు అన్నమాచార్యులు. ఏ గ్రహానికైనా ఆ గ్రహపు రాయిని ధరించేటప్పుడు ఆ రాయి లగ్న, పంచమ, భాగ్యాధిపతులైన గ్రహాలకు మాత్రం - ఆ క్రమంలో ధరించవలె. 'లగ్న లగ్నేశ సంబంధౌ, తద్బలాని ప్రబలాని' అని

సూత్రం. కానీ ఏ జాతకుడికైనా శని లగ్న - పంచమ - భాగ్య స్థానాధపతి అయినప్పటికీ

ఇంద్రనీలం ధరించరాదు. ఇంద్రనీలాన్ని ధరించగల సమర్థుడు ఒక్క శ్రీ వేంకటేశ్వరుడేన ని 'శ్రీవేంకటాద్రి యింద్రనీలము' అని స్పష్టం చేశారు అన్నమాచార్యులు. ఇందుకు సాహిత్యంలో ఆధారం శంకరాచార్యుల కనకధారలోని 'బాహ్వన్తరే మురజితః శ్రిత కౌస్తుభేయా హారావళీవ హరినీలమయి విభాతి' అన్నచోట గోచరిస్తుంది. జాతి వైఢూర్యం దాని 'ధార' వల్ల తెలియబడుతుంది. శంఖ చక్రాల మధ్య నున్న వైఢూర్య 'ధార' శ్రీవారి తిరునామం. అసలు విషయం - నవగ్రహ శాంతికై నవరత్నాల ఉంగరం ధరించనక్కరలేదు. రోజూ ఒకసారి ఈ నవరత్న సంకీర్తన గానం చేస్తే చాలు.

నవగ్రహాలు

| | | |
|---|---|---|
| చంద్రుడు | బుధుడు | శని |
| రవి | బృహస్పతి | రాహువు |
| కుజుడు | శుక్రుడు | కేతువు |

నవరత్నాలు

ముత్యం

మాణిక్యం

పగడం విద్రుమం

పచ్చ - మరకతం

పుష్యరాగం

వజ్రం

ఇంద్రనీలం

గోమేథికం

వైడూర్యం

రీతిగౌళ - ఆది

నాలం వాతవ - నయవచనం
చేలం త్యజతే - చేటీ భవామి

చల చల మమ సం - సద్ఘటనే కిం?
కులిశ హృదయ బహు - గుణ విభవ
పులకిత తను సం - భృత వేదనయా
మలినం వహామి - మదం త్యజామి

భజ భజ తేప్రియ - భామాం సతతం
సుజనస్త్వం నిజ - సుఖ నిలయ
భుజరేఖారతి - భోగి భవసికిం
విజయీభవ మ - ద్విధిం వదామి

నయనయ మామను - నయన విధంతే
ప్రియకాంతాయం - ప్రేమభవం
భయహర వేంకట - పతే త్వం మ
త్ప్రియోభవసి శో - భితా భవామి

ఈ సంకీర్తనలో నాయిక ఈర్ష్యాకషాయిత - కలహాంతరిత శ్రీవేంకటపతిపై ఆమెకు ప్రగాఢమైన ప్రణయ ప్రేమ. శ్రీవారు మాత్రం రాత్రి అంతా అన్య నాయికాసక్తి రక్తి కట్టించి వచ్చారు. నాయికను మరపించి మభ్యపెట్టే మాటలు మొదలు పెట్టినపుడు ఆమె సగం కరిగిన కోపంతో, సగం తరగని తాపంతో అన్న ఎత్తిపొడుపు పల్కులివి.

నీ కల్లబొల్లి కబుర్లు చాలవా ? నీకు దాస్యం చేస్తానుగాని నా కొంగు విడువు.

వజ్రంవలె కఠిన హృదయంగలవాడా ? దగ్గరగా వస్తావెందుకు ? పోపో దూరంగా పో. నీ కై ఎంత త్యాగం చేశాను నేను ? నీ గుణ సంపదలచే పులకరించి, చెమరించిన నా ఈ తనువు మలినమౌతున్నది.

మంచివాడవే ! వెళ్ళవయ్యా! వెళ్ళు ! నీ ప్రియభామనే ఏలుకో పో! నీవనుభవించిన సుఖానికి ఉనికి పట్టులైన నీ భుజముల మీద గుర్తులు (శంఖచక్ర సంజ్ఞలు) నీవు రతి

భోగివయ్యావని చాటుతున్నాయిలే. నీకు రతి భోగిత్వంలో విజయోస్తు! నీకు విజయమగుగాక! యివన్నీ యికనెందుకులే నా రాతను నేను నిందించుకోవలె. (నిన్నని ఏమి ప్రయోజనం ?)

తొలగు, తొలగు నన్ను ఊరడిద్దామని చేసే నీ ప్రయత్నం నీవంటే (గుడ్డి) ప్రేమ ఉన్న కాంతలకు నచ్చు బాటౌతుందేమోకాని ఈ నీ పప్పులు నా దగ్గర ఉడకవు. నీవు (యికముందైనా నీ అన్యభామాసక్తి త్యజించి) నాకే (నా ఒకర్తెకే) ప్రియుడవైతే మన ప్రేమ తేజోవం తమౌతుంది అంటున్న  నాయిక మాటల్లో

హరిః ఓం సహనావవతు సహనౌభునక్తు సహవీర్యం కరవావహై
తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై ఓం శాంతిశ్శాంతి

శ్శాంతిః అన్న వేదోక్త శాంతి మంత్రాన్ని పూలమాలలోని దారంవలె, పాలలో కరగిన పంచదారలా పరిఢవిల్లజేశారు పదక వితాపితామహులు. కలహాంతరిత శృంగారనాయికా కలహశాంతి మంత్ర సంకీర్తనమా ఇది ?

రంజని - ఆది

నగుబాట్ల బడే - నా జిహ్వ
పగటున నిదివో - పావనమాయె

ఇల నందర నుతి - యించి పెంచువలె
నలినలియైనది - నా జిహ్వ
నలనోదరుశ్రీ - నామముదలచిన
ఫలమున కిదివో - పావనమాయె

భ్రమపడి మాయపు - పడతుల తమ్ముల
నమలి చవులుగొనె - నా జిహ్వ
అమర వంద్యుడగు - హరిని నుతింపగ
ప్రమదముచవిగొని - పావనమాయె

నెలతల పలుయో - నిద్రవనదులను
నలుగడ నీదిన - నాజిహ్వ
అలసి వేంకటన - గాధిప యనుచును
పలికిన యంతనె - పావనమాయె

నా నాలిక ఉన్నదే అది నవ్వుల పాలైంది. పంచభూతాలూ నన్నుచూసి నవ్వుతున్నాయి అపహసిస్తున్నాయి. సంకీర్తనంవల్ల యిప్పుడు నా జిహ్వ పావనమైనది.

ప్రపంచములో ఎందరినో నరులను నుతించటం వల్ల నా రసనం రసహీనమైనది. పంచభూతాత్మకమైన ప్రకృతి నా అవస్థనుగని పరిహసిస్తున్నది. కమల నాభుడి శ్రీనామాలను స్మరించినంత మాత్రనే తత్పుణ్యఫలవశాత్ నాజిహ్వ పావనమైనది. రసపుష్టమైనది.

సంసారమనే మాయలో భ్రమించి, మోహవశాత్ కాంతల యెంగిలి తాంబూల చర్వణం తమకంతో ఒనర్చి నా నాల్క అపవిత్రమైనది. దేవాభినుతుడైన హరి సంకీర్తనం చేసినందున, హరినామ సంకీర్తనల రుచి మరిగినందున యిప్పుడు నా నాల్క పవిత్రమైనది.

ఎన్నెన్నో జన్మలలో ఎందరెందరో స్త్రీల గర్భకుహ రా ల్లో నివసించి వారి దేహాలలోని ద్రవములు ఆహారంగా స్వీకరించి మలినమైనది నా జిహ్వ. ఈ పునః పునర్జన్మల శ్రమచే అలసి 'వేంకటాచలపతీ' అన్నంతనే నాజిహ్వ పావనమైనది అని అన్నమాచార్యులు రసన పవిత్రీకరణ మంత్రాన్ని ఉద్బోధించారు. హరినామ సంకీర్తనమే అపరిశుద్ధమైన మన నా ల్కలకు పారిశుద్ధ్య ప్రక్రియ. శ్రీవేంకటేశ్వర స్తోత్రవచన పచనమే మన జిహ్వలకు శుచీక రణం. పుణ్యాహవాచనం.

రేవతి - ఆది

నానాటి బ్రదుకు - నాటకము
కానక కన్నది - కైవల్యము

పుట్టుటయు నిజము - పోవుటయు నిజము
నట్ట నడిమి పని - నాటకము
ఎట్ట నెదుట గల - దీ ప్రపంచము
కట్ట కడపటిది - కైవల్యము

కుడిచేదన్నము - కోక చుట్టెడిది
నడుమంత్రపు పని - నాటకము
ఒడి గట్టుకొనిన - ఉభయకర్మంబుల
గడిదాటిన పుడె - కైవల్యము

తెగదు పాపము - తీరదు పుణ్యము
నగి నగి కాలము - నాటకము
ఎగువన శ్రీవేంక -టేశ్వరుడేలిక
గగనము మీదిది - కైవల్యము

జగత్తు అంతా మిధ్య అని వేదాలు ఉద్ఘాటిస్తున్నాయి. నరుల దినదినపు జీవన విధానమంతా మాయ అనే తెరవెనుక జరుగుతున్న నాటకమే. నైసర్గిక దృష్టితో చూడగ లిగింది ఈ నాటకం మాత్రమే. జ్ఞాన దృక్కులతో, అంతర్ముఖమైన దృష్టితో మాత్రమే కైవల్య మార్గం గోచరిస్తుంది.

మానవ దృష్టికి, పంచేంద్రియ జ్ఞానానికి గోచరించేది అధిభౌతికమైన సాపేక్షమైన సత్యం అందువల్ల జనన మరణాలు ( ఈ పరిధిలో) సత్యమే. జన్మాది మరణ పర్యంతం జ రుగుతున్నది మట్టుకు నాటకమే. మనకు ప్రత్యక్షంగా త్రయీమానమై గోచరిస్తున్నది భౌతి క సృష్టి. దీనికన్న అతీతమైనది తురీయమైనది కైవల్యము.

ప్రాణికిగల క్షుద్బాధాదులు, మానవులకుండే వస్త్రధారణాది వ్యామోహాలు - ఇవన్నీ జ నన మరణాల మధ్య జరుగుతున్న పనులు - ఇవన్నీ నాటకమే. మాతృ గర్భంలో ఉండగా

నే మూటగట్టుకొన్న ప్రారబ్ధ, సంచితములనే ఉభయ కర్మలవల్ల ఏర్పడే నిర్దిష్ట పరిధిని దాటగలిగితేనే కైవల్యము. లేనియెడ జీవునకు నాటకమే మిగులుతుంది.

ఇక మూడవ కర్మ - ఆగామి - ఉన్నది. దానివల్ల వచ్చే చిక్కులున్నవి. ప్రారబ్ధ సంచిత కర్మలు క్షయం కానీకుండా అడ్డువస్తున్నదది. శ్రీవేంకటేశ్వరుడనే ఆకాశమున్నది. ఆ తిరువేంకటాచలపతి జగదధీశ్వరుడు. ఆయనను చెందగలిగితే ఆ మీదట పొందగలిగినది కైవల్యమే. తన సర్వస్వమూ జీవులాస్వామికి అర్పిస్తే వారి వారి ప్రారబ్ధ సంచిత ఆగామి కర్మలు పూర్ణమై పరిపక్వమై ముక్తి లభిస్తుంది. లేకపోతే ఈ చర్విత చర్వణపు జనన మరణాల సంధిలో జీవుడు గింజుకుంటూనే ఉంటాడు యుగాంతందాకా అని అద్వైత వేదాంతపు జ్ఞాన వైరాగ్య మార్గాన్ని నిర్ధారించారు అన్నమాచార్యులు.

రామక్రియ - ఆది

నతుమమతావ - న్మానస్త్వదీయ
నితాంతహితసర - ణింనమామి

నవదతు భవాన్ జ - నార్ధన ఘనరతి
వివాదవచనం - వృధా వృధా
తవమ్మృదు వేదసు - ధామయవచనై
ర్వివిధావశ పద - వీం వహామి

న భజతుమాం కరు - ణానిధే భవ
ద్విభవ వినయశ్చ - వృధా వృధా
త్రిభువన సుఖకర - దివ్యరూపతే
ప్రభుతయా పరా - భవం భజామి

నచలతు వేంకట - నాధమాంవినా
విచరణమపితే - వృధా వృధా
సుచరిత్రస్త్వం - సుభగస్త్వం త్వాం
కుచయోః పులకాం - కురైర్ధరామి

ఈ సంకీర్తనలో నాయిక ప్రౌఢ. శ్రీవేంకటేశ్వరుని గతిశక్తి (Dynamic Kinetic Energy) తానే అని చెప్పుకున్న స్వాధీన భర్తృక స్వాతిశయ సానునయ సరసోక్తుల సంకీర్తనమిది. నాయిక అలమేల్మంగ స్వామివారికి సెలవిస్తున్నది.

నీ అనంతమైన ఉపకార బుద్ధికి నమస్కారం; నాకు నీపైన ఏమీకోపం లేదు.

ఓ జనార్దనా (జగదుపకారివి గదా ఒక్క ఉపకారం ఒనరించు.) మన పెను కలయికల కలహపు మాటలు ఉచ్చరించకు. ఆ మాటలు వ్యర్థం, వ్యర్థం. అయినా నీపలుకులు మృదు మధురములై నిగమామృత వర్షిణులై అనేక విధాల నన్ను వశం తప్పేటట్టు చేస్తున్నవి. ఇలాగ నన్ను అవశను చేయకు.

వినయాల నయ నటనతో నన్ను అలరిద్దామని భ్రమింప జేయ ప్రయత్నించకు. ముల్లోకాలకూ సుఖమిచ్చే దివ్యరూపంగల నీవు నాకు మాత్రం బాధయే కలుగజేస్తు

న్నావు. కరుణ నీ సొత్తుగదా పాపం. నీ ప్రభుత్వం - గొప్పతనం - చేత నేను పరాభవం పొందుతున్నాను. నువ్వు చాలా గొప్పవాడివే కానీ నామనసెరిగి మనలటం లేదు నీవు.

తిరువేంకటాచలపతీ! కదలకు. (స్థిరంగా నాచెంతనే ఉండు) నేనులేకుండా నీవెంత తిరిగినా వ్యర్థమే (నేను నీశక్తి స్వరూపను) సచ్చారిత్రుడవు జగన్మోహనుడవు, నిన్ను అవలీలగా నా కుచముల పులకలపై మోయగల దానను. (ఆనందంతో పులకరించే నా యెదపైన భరిస్తాను.) అలమేల్మంగకు తనపతిపై గల సర్వతంత్ర స్వాతంత్ర్య సామర్థ్యాలను సంస్థాపించటంలో శ్రీశంకరుల సౌందర్యలహరిలోని ప్రథమ శ్లోకానికి సమస్కంధంగా సాగింది ఈ సంకీర్తన

'శివశ్శక్త్యా యుక్తో యదిభవతి శక్తః ప్రభవితుం
నచేదేవం దేవః నఖలుకు శలస్పంది తుమపి'

పరమశివుడు శ్రీదేవిని కలసితే జగత్తంతా సృష్టించగలడు. ఆమె చెంత లేకపోతే జడత్వం వాటిల్లి అటూఇటూ కదలలేని అశక్తుడు ఆయన అని శంకరులు అమ్మవారి శక్తి స్వభావాన్ని సన్నుతించారు. శంకరులు మధ్యమ పురుషలో చెప్పిన విషయాన్ని అమ్మవారి మాటగా ఉత్తమ పురుషలో ఉద్ఘాటించారు అన్నమాచార్యులు.

నవరసకన్నడ - ఆది

నవరసములదీ - నళినాక్షి
జవగట్టి నీకు - జవిసేసీనే

శృంగార రసము - చెలియ ముఖమ్మున
సంగతి వీరర - సముగోళ్ల
రంగగు కరుణా - రసము పెదవులను
అంగపు కుచముల - అద్భుత రసము

చెలి హాస్యరసము - సెలవుల నిండి
పలుచని నడుమున - భయరసము
కలికి వాడి - కన్నుల భీభత్సరసము
అలవగు జంకెనల - నదె రౌద్రంబు

నతి రతి మరపుల - శాంతరసంబదె
అతి మోహము పది - యవ రసము
హితవుగ శ్రీ వేంక - టేశ గూడితిని
సతమై యీమెకు - సంతోషరసము

నవరసాల నిత్య నవరసామృతవర్షిణి సంకీర్తనమిది. రసబ్రహ్మాస్వరూప అలమేలు మంగ. నవరసములూ ఆమె శరీర సౌందర్యంలో అంగాలై అమరి ఉన్నవి

ఈ నవరస వర్ణనకు సౌందర్యలహరిలో శంకరులు చేశారు. సౌందర్యలహరిలో 51 వ శ్లోకం గమనించండి.

శివే శృంగారార్ద్రా తదితరజనే కుత్సనపరా
సరోషా గంగాయాం, గిరిశ చరితే (నయనే) విస్మయవతీ
హరాహిభ్యో భీతా సరసిరుహ సౌభాగ్య జననీ
నభీషుస్మేరాతే మయి జనని దృష్టిస్స కరుణా.

ఈ శ్లోకంలో భరత మత ప్రకారం నిర్వికారం అయినందున శాంతరసం చెప్పబడ లేదు. అమ్మా - నీ చూపు శివునియెడ శృంగారరసమై, అన్య పురుషులయెడ భీభత్సమై,

గంగపట్ల వీరరసమై, శివుని చరితలవల్ల ఆశ్చర్య రసయుతమై, హరుని మేన పాములవ ల్ల జనించిన భయరసమై, ఎఱ్ఱని తామరల రక్తిమచేత రౌద్రమై, నీ చెలిక త్తెలయెడ స్మితహాస్యరసమై,  నాపై కరుణారసమై అలరుతున్నది అని తాత్పర్యం.  శంకరాచార్యులే అన్నమాచార్యులన్న వాదానికి ఇది ఒక బలమైన సాక్ష్యాధారం.  అన్నమయ్య పల్కుతున్నారు - ఈ నళినాక్షి అలమేల్మంగ నవరసాకార - శంకరులు అమ్మవారి చూపుపై ఈ రసము లను రాశిపోయగా, అన్నమయ్య అలమేల్మంగ రూపునే నవరసాలరాశిని చేశారు - నవ రసాలు ఈమెలో మూర్తీభవించి వేంకటపతీ నీకు చవులూరిస్తున్నవయ్యా. ఈమె ముఖంలో శృంగారరసము, ఈమె వాడి గోళ్ళలో వీరం, అధరామృతంలో కరుణారసం, వర్ణన కలవిగాని అలమేల్మంగ చను గుబ్బలలో అద్భుతరసం, ఆమె సెలవి నవ్వులలో హా స్యం, సన్నని ఆమె నడుమున భయానకం (స్తన జఘన భారం వల్ల భయం అని ధ్వని) ఆమె అసహనపు కంటి చూపులలో భీభత్సరసం, ముడిచిన ఆమె భ్రుకుటిలో రౌద్రం , ర తి మరపుల శాంతం శ్రీవేంకటేశునిపై గల అత్యంత మోహమనే దశమ రసం కూడా ఈ మెలో సాకారములైనాయి శ్రీవేంకటేశాః ఆమెకు ప్రీతిగా నీవిప్పుడు కలసినవాడవు. ఆమె కు సంతోషము శాశ్వతంగా కలిగినది.  ఈ నవరసాకార నీ సరసాలలో రసాకారమైనది. ఆ రసమే నీవు. నీవే బ్రహ్మవు. రసమే బ్రహ్మ రసోవైసః అని రసోపాసన కావించారు సంకీ ర్తనాచార్యులు.

వీణాధరి ఆది

నవ్వువచ్చీ నిన్ను జూచి - నాకు నేడు యీ
రవ్వలు నీకేచెల్లు - రాజసపు దేవుడా

సతికుచముల మోవ - సాము జేసినటు వలె
సతముగా మోచేవు - శంఖ చక్రములు
మతకాన వేడుకొనే - మార్గమున నున్నట్లు
తతి నభయహస్తము - తప్పవు నీవిపుడు

కామిని నలమిపట్టే - గతి యలవాటుగా
యేమరపు కటిహస్త - మెంతైనా నీవు
నేమాననామెరాక - నిక్కిచూచే మతకాన
కోమలపు నీకునిల్వు - కొలువులే యిపుడు

అంకె వుపరి సురత - మలవాటు చెడకుండా
ఉంకువ శ్రీసతి - మోచే పురమున
అంకి శ్రీవేంకటాద్రి - నంది మమ్ముగాచేటి
పొంకపు మన్ననల చూపులు జల్లేవిదిగో ॥

అన్నమాచార్యులకు స్వామితో ఉన్న చనువు అపారమైనది. వారుభయులూ ప్రాణమిత్రులు. ఆ చనువుని, ఆ మైత్రిని పురస్కరించుకొని అన్నమాచార్యులు స్వామితో ఆడిన పరిహాసం ఆలకించిన శ్రీవేంకటేశ్వరుని దరహాసం ఈ సంకీర్తనలో నిక్షిప్తమైనది.

ఏమయ్యా ఎల్లప్పుడు ఈ శంఖచక్రములు మోస్తునే ఉంటావు. సతికుచముల ముద్రలు నీపై పడేటందుకు సాము చేస్తున్నట్లుగా (శంఖచక్రములు నీకు సహజ సిద్ధమైనవి. సతికుచముద్రలు సహజమైనవి కావు కదా. అందుకై సాము చేస్తున్నట్లు శంఖచక్రాల మోత) కుచముద్రల సిద్ధికై ఆమెను వేడుకుంటూ ఉన్నట్లు అభయహస్తం తప్పవుకదా.

నీకు నీ సతిని పొదివి పట్టుకొనడం అలవాటయి ఆమె లేనప్పుడు కూడా ఆమెను పొదివి పట్టే భంగనులోనే నీ కటిహస్తం మానడం లేదు నీవు. ఆమెరాక కోసం నిరీక్షిస్తూ నిక్కిచూడడం అలవాటై కోమలమైన నీకు పాపం నిల్వు కొలువులయ్యాయి. నిల్చునేఉంటావెప్పడూ.

నీవు నిలబడితే ఉండిపోతే ప్రియాప్రియక్రియాధీనుడైన నీకు ప్రియమైన పుంభావ రతి ఎలాగ? ఆ అలవాటు తప్పకుండా నీవు శ్రీదేవిని గుండెలపై (ఆన్వర్థ సంజ్ఞగా) మోస్తున్నావు. ఇదిగోనామాటనిజమని ఒప్పుకుంటున్నావు. శ్రీవేంకటాద్రిపైనుండి మమ్ము రక్షించేటి (నన్నూ నావాళ్లనీ నా ఈ సంకీర్తన చదివే వినే వాళ్లందరినీ రక్షించే) అందపు సెలవి నవ్వుల మన్ననల చూపులు జల్లుతున్నావు. ఈరవ్వరట్టులు రాజసపుదేవుడవు గదా నీకే చెల్లినవి. నాకు నిన్ను చూస్తే నవ్వు వస్తోంది.  అంటూ అన్నమాచార్యులు స్వామితో ప్రియసరసచతుర సంభాషణ మొనర్చారు.

హరి కాంభోజి - ఆది

నిత్యపూజలివివో - నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టి - పరమాత్మునికి

తనువే గుడియట - తలయే శిఖరమట
పెను హృదయమే - హరిపీఠమటా
కనుగొన చూపులె - ఘన దీపములట
తన లోపలి యం - తర్యామికిని

పలుకే మంత్రమట - పాదైన నాలికే
కలకలమను పిడి - ఘంటయట
నలువైన రుచులే - నై వేద్యములట
తలపులోపల నున్న - దైవమునకు

గమన చేష్టలే యం - గ రంగ గతియట
తమి గల జీవుడె - దాసుడట
అమరిన వూర్పులే - యాల వట్టములట
క్రమముతో శ్రీవేం - కట రాయనికిని

శంకరులు శివమానసిక పూజాస్తోత్రంలోని ఈ శ్లోకంలో

ఆత్మాత్వం గిరిజామతి, పరిచరాః ప్రాణాః శరీరం గృహం
పూజాతే విషయోప భోగ రచనా నిద్రా సమాధి స్థితి
సంచారః పదయోః ప్రదక్షిణ విధిః స్తోత్రాణి సర్వాగిరో
యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభోతవారాధనం

అన్నట్లు ఈ సంకీర్తనను సంతరించారు సంకీర్తనాచార్యులు. (ఆయనే శంకరులు గదా) నా ఆత్మ నీవు, నా మతి పార్వతి, నా పంచప్రాణాలు పరిచారకులు. నాకేయే విషయాలయందానక్తి కలిగినదో అవన్నీ నీకు పలుపూజలు. సమాధి స్థితిని చేరినది నేను నిద్రించినప్పుడు. నా పాదాలు భూమిని సంచరించినదంతా నీకు ప్రదక్షిణములే. నా పలికిన పలుకులన్నీ నీ స్తోత్రములే. నేనెప్పుడు యెక్కడ ఏయే కర్మలొనరిస్తే అవన్నీ నీకు నే

చేసే ఆరాధనలే అని శ్లోక తాత్పర్యం. శ్రీ శంకరులు ప్రధమా విభక్తిలో చెప్పిన శ్లోకం అన్న మాచార్యులు షష్టీకరించారు శ్రీవేంకటేశ్వరునకు అన్వయించి -

నాకు జగత్తంతా తిరువేంకటేశుడే సాక్షాత్కరిస్తున్నాడు. ఆయనకు నిత్యమైన పూజ లు చేయనేర్చాను నేను. నా దేహమే శ్రీవారి ఆలయం. నా శిరము ఆ గుడి శిఖరం. నా హృదయమే శ్రీహరికి పీఠం. నా అంతర్ముఖ బహిర్ముఖ దృష్టులు అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణునకు దీపములు. నా పలుకే మంత్రము (అన్ని మంత్రములు యిందే ఆవహించెనూ. వెన్నతో నాకు గలిగే - వేంకటేశు మంత్రము అన్నారు వేరొక కీర్తనలో) నా నాల్క కల కలరవాలు చేసే పిడిఘంట పెద్ద గుడి గంట నీకు నా రసనవు షడ్రస గ్రసనం, నా తలపు నవరసవిలసనం, నా భావమంతా నిండిన స్వామికి నైవేద్యములు.

నా నడకలే ఆ దేవునకు ప్రదక్షిణాలు సక్తుడైన నాలోని జీవుడే పంచప్రాణాత్మకమై న జీవుడే - ఆ హరికి దాసుడు. నా ఉచ్ఛ్వాస నిశ్శ్వాస క్రియలన్నీ ఆ పంచభూతాత్మకు డైన పరమాత్మునికి వింజామరలు అని తన జీవన జీవక్రియా సర్వస్వం శ్రీవేంకటేశ్వరు నకు నిత్యమానసిక పూజగా, త్రికరణ శుద్ధార్చనగా సమర్పించి శ్రీహరిని తనలో ఐక్యమొందించుకొని, అలరినాడు అన్నమాచార్యులు. శ్రీ శంకరుల శ్లోకానికి ఈ సంకీర్త నకూ ఉన్న సామ్య సామీచీన్యాలు గమనార్హములు.



తోడి - రూపకం

నీదాసుల భంగములు - నీవు జూతురా
యేదని చూచేవు నీకు - నెచ్చరించ వలెనా

పాల సముద్రము మీద - పవళించి నట్టి నీకు
బేలలై సురలు మొర - బెట్టిన యట్ల
వేళతో మామనవులు - విన్నవించితిమి నీకు
యేల నిద్దిరించేవు మ - మ్మిట్టే రక్షించరాదా

ద్వారకా నగరములో - తగనెత్త మాడేనీకు
బీరాన ద్రౌపది మొఱ - బెట్టిన యట్టు
చనవుతో మాకోరికె - సారె విన్నవించితిమి
విని శ్రీ వేంకటేశుడా - వేగ రక్షించరాదా?

అన్నమాచార్యులు మళ్లీ పాడారు.

నీ దాసుల పరాభవం చూడ నిచ్చగించావా నీవు. యింకా యేమి చూస్తున్నావు నీవు ? నిన్ను హెచ్చరించాలా నేను.

క్షీరసాగరశాయివైన నీకు రాక్షసుల బాధలు భరించలేక దీనులై దేవతలు మొరబెట్టుకున్న విధంగా, అవసరార్థం మా మనవులు విన్నవించాము నీకు. నిద్రపోతున్నావెందుకింకా, అవలీలగా మమ్ము రక్షించవచ్చుగదా.

భార్యలతో ద్వారకానగరంలో పరియాచకాలు ఆడుతున్న నీకు భీరువై ద్రౌపది మానరక్షణార్థం మొరబెట్టినట్లుగా రాజ సభలలో ఘోరమైన అవమానం పొంది, కుంది

ఖిన్నులమై విన్నవించాముగదా నీకు ? నీకు పరాకెలా వస్తోంది ? యిప్పుడే రక్షించవచ్చు గదా మమ్ము ?

> 'అలవైకుంఠ పురంబులో నగరిలో నామూల సౌధంబుదా
> పల మందార వనాంతరామృత సరః ప్రాంతేందు కాంతోపలో
> త్పల పర్యంక రమా వినోదియగు నాపన్న ప్రసన్ను' నకు
> విహ్వల నాగేంద్రము పాహి పాహి యని' మొరబెట్టినట్లు

నీకూ మాకూ ఉన్న చనువూ, మైత్రీ పురస్కరించుకొని మా కోరిక విన్నవించాము. ఇకనైనా అది విని శ్రీవేంకటేశ్వరా ; మమ్ము వేగమే రక్షించరాదా అన్న ఈ సంకీర్తనం సంకీర్తనాచార్యులు పాడగానే సంకెల బందులు బిగి సడలి, వదులై భూపతనం చెందాయి. రాయలు ఆచార్యులకు సాష్టాంగపడి 'అపరాధిని ఆచార్య అనుగ్రహింపు'మన్నాడు. హరిదాస ద్రోహం, హరిద్రోహంకన్నా మహా పాపమని రాయలకు హితవుచెప్పి, అన్నమాచార్యులు ఈ నరారణ్యంలో ఉండరాదని తిరుమలకు తరలిపోయారు.

హిందోళ - రూపకం

నీమహిమో నాలోన - నిండిన వలపు జాడో
యేమిసేతు నన్నెప్పుడు - నెడయకు వయ్యా

యెనసి నీతో నేను - యెంతవడి మాటాడినా
తనియదు నామనసు - తమియెట్టిదో
వినయముతో రెప్పలు - వేయక జూచినాను
నినుపులై మమతలు - నిచ్చకొత్తలు

చలపట్టి నీతోను - సారె సారె బెనగిన
నలయదు నామేను - ఆసయెట్టిదో
కొలువులో నీవద్ద - కూచుండి యెంత నవ్వినా
తలపులో కోరికలు - తరగని ధాన్యాలు
కడగి యందాకా నిన్ను - కౌగలించు కుండినాను
విడువవు చేతులు - వేడుకెట్టిదో
అడరి శ్రీవేంకటేశ - అలమేల్మంగను నేను
తొడరి యేలితివి ర - తులు తీపులు

ఈ సంకీర్తనంలో అన్నమాచార్యులు అలమేల్మంగ అమ్మ వారైనారు. తన మనస్త త్వాన్ని అలమేల్మంగ అమృతపు పలుకులలో కులికించారు. మాట అలమేల్మంగమ్మది. ఆ మాట వెనక తలపు వలపు తేనె తేట అన్నమయ్యది. ఈ సంకీర్తనమే అన్నమాచార్యుల మనస్తత్వం. ఇందులో ధాతుమాతువులు అన్నమాచార్యులూ అలమేల్మంగా.

అన్నమాచార్యులు అంటున్నారు అల్మమేల్మంగ పలుకు తున్నది. ఒకేమాట... స్వామీ; ఇ దేమో తెలియరావడం లేదు. కేవలం నీమహిమయో నీపై నాకు హెచ్చిన మోహమో ఇద మిత్థమని నిర్ణయింపలేని నిస్సహాయ స్థితిలోఉన్నాను. నన్నెప్పుడూ విడువకయ్యా.

నీతో యెంతసమయం నేను సంభాషించినా తనివి తీరదే. తీరని ఈ తనివి ఇది యేమో? ఎంతదాకా అనిమేషదృష్టితో నిన్ను వీక్షించినా నాకు నీపైగల మమతలు నిత్య నూతనంగా అతిశయిస్తున్నవే గాని తగ్గడం లేదు. ఇదేమి మమతో తెలియరాదు. (నన్ను విడవ వద్దు సుమా).

నీతో యెన్ని పర్యాయాలు రతిపట్లు పట్టినా (ఎన్ని సేవలు నీకు చేసినా) నాశరీరం అలపు జెందరు. ఇదియెక్కడి ఆశ? తీరదేమి? నీచెంత కొలువుదేరి, ఆనందంతో యెంత నవ్వినా, ఆనందపుటందాన్ని ఎంత ఆవిష్కరించినా నా మనసులో కోర్కెలు మాత్రం తీరడం లేదు. ఇదియేమిటి? ఈ తీరని కోరికలు అక్షయ రాశిలోని ధాన్యాలా?

ఎంతదాకా నిన్ను కౌగలించుకొని ఉన్నా తనివితీరని నా చేతులు నిన్ను విడచిపెట్ట లేక పోతున్నాయి. ఇదేమి వేడుక? తనివి తీరదు. మమతలు నిత్యనూతనాలు. అలపు రాదు, ఆశతీరదు. కోరికలు అక్షయాలు. నా మనోవాక్కాయ కర్మలు నిన్ను విడిచి ఇతర మపేక్షించవు. ఇదేమి చోద్యం? శ్రీవేంకటేశ్వరా నేను అలమేల్మంగను (నేను అన్నమాచార్యుడను). ఇంతదాకా నన్ను నిరతిశయ ప్రేమతో లాలించావు. పాలించావు. ముందెన్నడూ నన్ను విడువకు (కృతజ్ఞుడను.)

స్వామి వద్ద అలమేల్మంగగా అన్నమాచార్యులు గునిసిన గారపు గుసగుసలు ఈ సంకీర్తన రసపుపసలు.

ఖరహరప్రియ - ఆది

ఒకపరి కొకపరి కొయ్యారమై
మొకమున కళలెల్ల - మొలచినట్లుండె

జగదేకపతిమేన జ - ల్లిన కర్పూరధూళి
జిగిగొని నలు వంక - జిందగాను
మొగి చంద్రముఖి నుర - ముననిలిపెగనుక
పొగరు వెన్నెలదిగ - బోసినట్లుండె

పొరిమెరుగు జెక్కుల - బూసిన తట్టు పునుగు
కరగియిరుదెసల - కారగాను
కరిగమనవిభుడు - గనుక మోహమదము
తొరగి సామజసిరి - దొలకినట్లుండె


మెరయు శ్రీ వేంకటేశు - మేన సింగారముగాను
తరచైన సొమ్ములు - ధరియించగాను
మెరుగు బోడి అల - మేలు మంగయుదాను
మెరుపు మేఘముగూడి - మెరసినట్లుండె

శుక్రవారాభిషేక సమయంలో స్వామి దర్శనం ఎంతో మనోరంజకంగా చిత్రించారు ఈ సంకీర్తనలో అన్నమాచార్యులు. ఆ స్వామి దర్శనానందం ఎలా ఉన్నది? ఒకసారి చూసినదానికన్నా రెండవసారి ఆయన ముఖదర్శనం అధికతర సుందరంగా ఉండి స్వామి ముఖంలోనే కళలన్నీ పుట్టుక వచ్చినట్లున్నది.

ఆ జగదేకపతి దివ్యమంగళవిగ్రహంపైన జల్లిన కర్పూర ధూళి రాలి కొంత నలుగడలా చిందినది. ఆ విశేషం స్వామి తన వక్షస్థలంపైన ఆ చంద్రునివంటి ముఖంగల శ్రీభామను నిలుపుకొన్నందున, ఆమె ముఖచంద్రుడు దట్టమైన వెన్నెలలు దిగబోసినట్లు, వర్షించినట్లు ఉన్నది.

స్వామికి మెరుగు జెక్కులపై పూసిన తట్టుపునుగు (సుగంధతైలం) యిరువైపుల జెక్కుల నుండీ కరిగి జారుచున్నది. అది ఆ స్వామి గజగమనవైభవం గలవాడు కాబట్టి, మోహపు మదం అతిశయించి యిరుగడలా స్రవించే గజరాజు చెలువు ఒప్పినది.

శ్రీవేంకటేశ్వరుని మేను పునుగుతైలపు పూతలో జల్లిన కర్పూరగంధవొడితో నిగనిగలాడుచున్నది. ఆ సమయాన (స్వామికి) అలకరించిన సింగారపు సొమ్ములు, అలమేల్మంగ హారం ( మంగతాళి) ఇత్యాదులు ధరించగా వెలుగులు చిమ్ముతున్న ఆ దివ్యవిగ్రహముతాను. ప్రకాశకాంతివంతమైన కనకాంగి అలమేల్మంగతో కలిసి విద్యుల్లతా మేఘములు (మెరుపు మేఘము ఒకదానితోనొకటి మేళవించి మెరస్తున్నట్లునదట.)



కాంభోజి జంపె

నిన్ను బాసిన యట్ల - నెలతకు వియోగ దశలు
యెన్నడును దోప - విదియేమొ గానీ

నిను దలచి లలితాంగి - నీరూప మాత్మలో
గనినీవు సవి బయలు - కౌగిలించినది
తనర నాకాశ త-త్వము నీ మహత్వమని
వనిత యెవ్వరిచేత - వినెనొగానీ

నిను బొగడి నీరూపు - కనుదోయి కెదురైన
తనివి దీరక బయలు - తగజూడ దొడగె
మునుకొన్న సర్వతో - ముఖుడవనగ నిను
వెనక కే భావమున - వినెనొగానీ

తలపునను వాక్కునను - తలపదలపగ నీవు
కలసి యాకమలాక్షి -గౌగలించితివి
తెలిసితిమి వేంకటా - ధిపతి నీవిన్నింట
గలవనెడు మాట ని - క్కంబువో గానీ

ఆది భౌతికానుభవాలలో దానెక్కువగా భావించిన శృంగారాన్ని ఆధ్యాత్మిక హిమాద్రి శృంగాల కెక్కించిన మహాపురుషుడు అన్నమాచార్యులు. "ఆయన రచించిన శృంగార పదాలు ఒక విశాల విశ్వం వంటివి. వాటి అసాధారణ సౌందర్యం ప్రత్యేకంగా చర్చించ వలసింది. ఈ పదమొక్కటి గమనిస్తే తరువాత శృంగార కవులకన్న అతడెంత యెత్తులో ఉన్నాడో గ్రహింపగలము". (రాళ్లపల్లివారు)

అలమేల్మంగా వేంకటేశ్వరులకు విరహం నిత్యం. కొండపై స్వామివారు. కొండకింద అమ్మవారు. అయినా ఆమెయందు విరహపు ఛాయలు ఏమీ కనబడలేదట అన్నమయ్యకు. ఇదేమి విచిత్రం అని చూస్తే ఆయన రసదృష్టికి గోచరించిన రమణీయ సత్యం ఇది.

"నారాయణ పరోధ్యాతా ధ్యానం నారాయణః పరః
అంతర్బ హిశ్చ తత్సర్వం వ్యాప్యనారాయణ స్థిత్సపిః"

ఆమె స్వామిని తలచినంతనే ఆయనామెకు మనసులో సాక్షాత్కరించాడు. ఆయనే అన్న భావంతో ఆమె ఆకాశాన్ని ఎదకు హత్తుకున్నది. ఆకాశ తత్వం ఆయన మహత్వమే అనీ ఆ ఆకాశరూపుడి సంగతి ఆ ఆకాశరాజ పుత్రిక ఎవ్వరిచేత విన్నదో?

స్వామిని ఆమె పొగడినంత స్వామి రూపం ఆమెకు ప్రత్యక్షమైనది. అంతర్ముఖ దృష్టి చేత జరిగిన ఆ దివ్యమంగళ విగ్రహ సౌందర్యా స్వాదనలో తనివి తీరక ఆమె తన దృష్టిని బహిర్ముఖం చేసి బయలుకేసి అనిమేష దృష్టలు సారించినది. 'అంతర్ముఖ సమారాధ్యా బహిర్ముఖ సుదుర్లభా' అని లలితా సహస్రం. ఎటు చూసినా ఆమె చూపును స్వామి రూపు పలుకరిస్తున్నది. సర్వతోముఖుడని ఆయన గూర్చిన రహస్యం మునుపు ఏవిధంగా తెలుసుకొన్నదో యీ  అలమేలుమంగ.

నిను దలచి, నిను బొగడి మనోవాక్కర్మలొనరిస్తే నీవు ఆమెను కాయకంగా కౌగిలించావు. ఈ మీశృంగారానికి త్రికరణశుద్ధి ఏర్పడ్డది. శ్రీ వేంకటాధిపతీ! నీవు సర్వాంతర్యామి వన్నది నిజమే నన్నమాట. ఈమె చేష్టలు చూస్తేగాని మాకు తెలియలేదు సుమా. ఇప్పుడు తెలిసింది! అంటూ అన్నమాచార్యులు ఈ విరహిణి అవస్థని వైకుంఠపు ఎత్తులకు చేర్చారు.

ఆభేరి ఝంపె

పలుకు తేనెల తల్లి - పవళించెను
కలికితనమునవిభుని - కలసినదిగాన

నిగనిగని మోముపై - నెఱులు కెలకుల చెదర
పగలైనదాక చెలి - పవళించెను
తెగని పరిణతులతో - తెల్లవాఱిన దాక
జగదేకపతితోడ - జట్టిగొనె గాన

కొంగు జాఱిన మెఱుగు - గుబ్బలొలయగతరుణి
బంగారు మేడపై - పవళించెను
చెంగలువ కనుగొనల - సింగారముల దొణక
అంగజగురుని తోడ - నలసినదిగాన

మురిపెంపు నటనతో - ముత్యాల మలగుపై
పరవశంబున తరుణి - పవళించెను
తిరువేంకటా చలా - ధిపుని కౌగిట గూడి
అరవిరై నునుజెమట - నంటినదిగాన

ప్రపంచంలోని ఏ సంస్కృతిలోనూ లేని విశేషం మన సంస్కృతిలో ఉంది. శృంగారాన్ని ఆధ్యాత్మిక దృష్టితో చూడడం అన్నది ఇతర దేశాల వాఙ్మయ చరిత్రలలోనే లేదు. ఈ ప్రక్రియకు రసవన్నాందీ ప్రస్తావన చేసినది శ్రీమచ్ఛంకరాచార్యులవారు. వారి కనకధారా స్తవంలోని ఈ శ్లోకం అందుకు తార్కాణం.

అమీలితాక్ష మధిగమ్య ముదా ముకుందం
ఆనందకందమనిమేష మనంగ తంత్రం
అకేకర స్థిత కనీనిక పక్ష్మనేత్రం
భూత్యై భవేన్మమ భుజంగ శయాంగనాయా !

తనువు వివశమై, అనితర సురతుల ఆనందలహరిలో అలసి అలరినహరిని అనిమిషదృష్టులతో చూచేసరికి సిరికి కడుసిగ్గయింది. కనులు మూసికొన్నది. కాని తనివి తీరక కనులరమూసి కనుగొనల కనుపాపలమరగా హరిని తిలకించు ఆ సిరి కడగంటి చూపులు (నాపై ప్రసరించి) నాకు ఐశ్వర్యము కలుగజేయుగాక అని సంభోగవివశ శృంగారానికి అద్దంపట్టారు శంకరులు.

ఈ సంకీర్తన శంకరుల శ్లోకానికేమీ తీసిపోలేదు. విభునితో శృంగారంలో అలసిన అలమేల్మంగ పవళించిన సొబగులు తన పలుకు తేనెలలో చిందించి నాడు అన్నమయ్య స్వామి జగదేకపతి అతనితో కంతుపంతాలు ఎంత శ్రమదాయకం! అందుకే అలమేల్మంగ అలసి సొలసి పవళించినది.

తన సువర్ణ హర్మ్యంలో ఆమె వివశయై ఒడలెఱుగక, కొంగు జాఱి, అలసిన తన కుచరోచులు బయల్పడగా పవళించినది. నిజమేమరి. ఎఱ్ఱకలువలబోలిన తన కనుల కొనల శృంగారాలు తొణికిసలాడగా, మన్మధుని కన్నతండ్రితోడి కంతుకేళిలో అలసినదిక దా ఆమె !

నిద్రలోసైతం లాస్యముద్రల ఒయ్యారంతో, ముత్యాల పందిరిపై పరవశయై పవళించినది తిరువేంకటపతి కౌగిట నలిగి, అరవిరియై చెమట చిత్తడినంటి అలసినది కదామరి.

కర్ణాటక బేహాగ్ - ఝుంప

పసిడీ యక్షంతలివె -పట్టరో వేగమే రారో
దెసల బేరటాండ్లు - దేవుని పెండ్లికిని

శ్రీవేంకటేశ్వరునికి - శ్రీమహాలక్ష్మికిని
దైవికపు బెండ్లి ముహూ - ర్తము నేడు
కావించి భేరులు మ్రోసె - గరుడ ధ్వజంబెక్కె
దేవతలు రారో - దేవుని పెండ్లికిని

కందర్ప జనకునికి - గమలాదేవికి బెండ్లి
పందిరి లోపల  - దలబాలు నేడు
గందమూ విడె మిచ్చేరు - కలువడాలు గట్టిరి
అందుక మునులు రారో - హరి పెండ్లికిని

అదె శ్రీవేంకటపతి - కలమేలు మంగకును
మొదలి తిరునాళ్లకు - మొక్కేమునేడు
యెదుట నేగేరు వీరె - యిచ్చేరు వరములివె
కదలిరారో పరుష - ఘనుల పెండికిని

శ్రీవేంకటేశ్వరునికి కళ్యాణానికి ముహూర్తం నిశ్చయమ్మైంది. నేడే సుమూహూర్తం. (నేడే కళ్యాణ ముహూర్తం అన్న మాటలో నిత్య కళ్యాణం ఆ స్వామికి అన్న ధ్వని) వధూ వరులు అలమేల్మంగా శ్రీవేంకటేశ్వరులు. పెండ్లి పిలుపుల పురస్సరంగా పదకవితా పితామహుని శ్రీవేంకటేశ్వర కళ్యాణోత్సవాహ్వాన శుభలేఖార్థం ఈ సంకీర్తన. పెండ్లిపిలుపు - ఆహ్వానం దిక్పాలకుల పురంధ్రులకు దెసల పేరంటాండ్లకు - అష్టదిక్కులా ఉన్న ముత్తై దువలకు ముచ్చటైన పిలుపు.

కళ్యాణముహూర్త సూచనగా భేరులు మ్రోగాయి. మంగళతూర్య ఘోషలు సాగాయి. వేదమంత్రాలు చెలరేగాయి. గరుడ ధ్వజం - టెక్కెపు కంభం ధ్వజస్తంభం ఎక్కి రెపరెప లాడింది. దిక్పాలకులూ, సతులూ, దేవతలూ, దేవేరులూ అందరూ సువర్ణాక్షతలు జల్లవలె రారండి.

మన్మధుని కన్నతండ్రికీ, మా లావణ్యవతికీ ఉద్వాహం - పందిరిలోపల - శ్రీవేంకటే శ్వరుని కళ్యాణమందిరంలో - తలంబ్రాలుపోసే వేడుకవేళయిది. కలువడాలు కట్టడమైనది. ఆహూతులందరికీ చందన తాంబూల సత్కారం మదర్పిత చందన తాంబూలాది సత్కారాలు స్వీకరించమని సంకీర్తనాచార్యుల పిలుపు మునులందరికీ.

అదిగో అలమేల్మంగా శ్రీవేంకటేశ్వరులు, కళ్యాణానంతరం ఊరేగుచున్నారు. ఈ ప్రధమోత్సవానికై మ్రొక్కుతున్నాము మేమంతా. కళ్యాణపు వేడుకలలో అంతర్భాగంగా కోరి నవారికి కోరినవెల్లా కొసరి కొసరి - వరదానమిస్తున్నారు జగజ్జననీ జనకులు. చేతనా చేతనమైన జగత్సర్వమూ ఈ జగత్కల్యాణాన్ని దర్శించ కదలిరమ్మనీ, అలమేల్మంగా శ్రీవేం కటేశ్వరుల కృపనుపొంది, ధన్యులై, అభీష్టప్రాప్తి జెందమనీ పెండ్లిపెద్ద, జగత్కల్యాణ కార్యకర్త, సంకీర్తనాచార్యులు, పదకవితాపితామహుడు, ఆంధ్రవేదస్రష్ట అన్నమాచార్యులు ఉల్లేఖింపజేసిన శుభలేఖ వివరం. శ్రీవారి కల్యాణ దర్శనప్రాప్తి ఈ శుభలేఖ అందిన వారందరికీ సిద్ధించుగాక.

సింధుభైరవి - ఆది

పాపినైన నా - పాలగలిగి త్రోవ
జూపమన్నెందు - జూపరు

ధృతి మాలి జగమెల్ల - తిరిగివేసరితి
యితరాయములకేగి - వేసరితి
గతిమాలి పరులపై - గనలి వేసరితి
మతిమాలి కులవిద్య - మాని వేసరితి

విసిగి యాచారంబు - విడిచివేసరితి
పసచెడి ప్రియములు - పలికి వేసరితి
కొసరి ద్రవ్యంబుపై - గోరి వేసరితి
కసుగందిలోలోన - కాగి వేసరితి

కోవిదులగు వారి - గొలచి వేసరితి
దైవములందరి - దగిలి వేసరితి
శ్రీవేంకటేశుని - సేవమాని వట్టి
సేవలన్నియును నే - జేసి వేసరితి

అసంతృప్తుడైన జీవుని వేదన ఈ సంకీర్తనలో పెసువెల్లువయై పరవళ్ళు తొక్కుతున్నది. పూర్వాశ్రమ వృధా జీవన చర్యలను పశ్చాద్విమర్శాబుద్ధితో కావించే యోగి గతకాల స్మృతులూ, పూర్వజన్మ జ్ఞానంగల్గిదైవాంశ సంభూతుడై, త్రికాలవేదియైన పరమహంస పరివ్రాజకాచార్యుల పరమార్థాన్వేషణలోని అనిత్యవస్తు తిరస్కరణా, నిత్యవస్తు ధ్యాన పునశ్చరణా ఇందులో ధ్వనిస్తున్నాయి. అన్నమాచార్యుల మనోవేదన ఈ సంకీర్తన రూపమైనది. సంకీర్తనాచార్యుల ఆత్మశోధన సంకీర్తనగా అవతరించింది.

పాపవశాన జన్మించాను. నాకెవరూ దారి ఇది అని చూపలేదు. మార్గ దర్శకులై ఎవరూ ఇంత పుణ్యం కట్టుకోలేదు అని ఆచార్యుల ఉవాచ.

దారిగానని కారణాన ఆధైర్యం కలిగి జగమంతా దారిగానక తిరిగి తిరిగి ఆయాస పడ్డాను. జన్మసాఫల్యానికై ప్రయత్నించక అప్రస్తుతమైన విషయాల వెంటపడి శ్రమపడ్డాను. నా లక్ష్యమేమో, గతి యేదో యెరుగక, అన్యులపై ఆగ్రహించాను. ఆ ఆగ్రహంవల్ల అశాంతి జెందాను. ఆ అశాంతివల్ల మతిహీనుడ నై కులవిద్యను తాతల నాటినుండి వస్తున్న సంప్రదాయాన్ని విడిచిపెట్టి వెంగలినయ్యాను. (ఇక్కడ కులవిద్య స్మార్తబ్రాహ్మణ్యం, అన్నమాచార్యులు నందవరీక నియోగ బ్రాహ్మణుడు జన్మరీత్యా).

కులవిద్య మానిన తర్వాత మతం మారింది. అద్వైతి విశిష్టాద్వైతి అయినాకగూడ ఆ మార్పులవల్ల వచ్చిన చిత్తక్షోభ తగ్గలేదట ఆయనకు. అప్పటికింకా రాజాశ్రయం తప్పలేదేమో. పసచెడి- మనసు బిగువులేని కారణాన - ప్రియములు - రాజ రాజ్యాధికార ప్రియభాషణలు పల్కటంచేత, ఆచార్యులవారికి అత్యధికమైన ఆత్మాసహిష్ణుత కలిగింది. ధనాదులపై లోభమోహేచ్ఛలు కలిగినవి. తన వివేకభ్రష్ట వినిపాతవైఖరిని తిలకించితే ఆయన ఆత్మవస్తువు గాయపడి, కడునొచ్చుకొన్నది. తన జీవనగతి గమనవేగాలను ఆయన స్వకీయమైన తర్కంతో, విచికిత్సా విశేష బుద్ధితో తను తనకన్న వేరైనట్లు, అన్యదృష్టితో అవలోకించ గలిగారు. ఆత్మవిమర్శ చేయగలిగారు. భర్తృహరి చెప్పిన సుభాషిత త్రిశతిలోని

'శిరశ్శార్వం స్వర్గా త్పశుపతి శిరస్థః క్షితిధరం
మహీధ్రా దుత్తుంగా దవని మవనిశ్చాపి జలధిం
అధోగంగా సేయంపదము పగతాస్తోక మధవా
వివేక భ్రష్టానాం భవతి విని పాతః శతముఖః

అన్నశ్లోకాన్ని తనకు తానే అన్వయించుకోగల మహామనీషి ఆయన. (తాత్పర్యం : గంగ ఆకాశం నుండి శివుని శిరం మీదకూ, అందునుండి హిమవత్పర్వతాలకూ, అటనుండి భూమికీ, భూమినుండి సముద్రానికీ, అక్కడనుండి గాలికూడా చొరని పాతాళానికి ప్రవహిస్తూ పతనం చెందుతున్నది. అదే విధంగా వివేకం వినాశనమైనవారికి పతనం ఒక్కరీతిగా ఉండదు. నూరు విధాలుగా వాటిల్లుతుంది).

ఈ స్థితిలో ఆయన కోవిదులు, పండితులు అనుకోబడేవారిని ఆశ్రయించి, సేవించి అదికూడా వ్యర్థ యత్నమేనని గ్రహించి, నిరాశ చెందారు. ధూర్జటి అంటాడు ఈ పండితుల-కోవిదుల-అయ్యవార్ల- గురించి ఒక మాట.

అయవార్లై చరియింపవచ్చు, దనపాదాంభోజ తీర్థమ్ములన్
దయతో గొమ్మనవచ్చు, సేవకుని యర్థ ప్రాణదేహాదుల
న్నియునా సొమ్మనవచ్చుగాని సిరులన్నిందించి, నిన్నాత్మని
ష్ఠియతన్ గానగరాదు పండితులకున్ శ్రీకాళహస్తీశ్వరా

ఇటువంటి కుహనా కోవిదులవల్ల, దొంగ పండితులవల్ల వచ్చే ప్రమాదం ఏదో కూడా నిర్ణయించాడు ధూర్జటి మహాకవి.

చదువుల్నేర్చిన పండితాధములు స్వేచ్ఛా భాషణ క్రీడలన్
వదరన్ సంశయ భీకరాటవుల ద్రోవల్తప్పి వర్తింపగా
మదన క్రోధ కిరాతుడందుగని భీమ ప్రౌఢిచే దాకినన్

చెదరున్ చిత్తము చిత్తగింపగదవే శ్రీకాళహస్తీశ్వరా !

ఈ పండితులు చదువులు నేర్చారుగానీ పరమేశ్వరాను సంధాన విద్య నేర్వలేదు. వారి మాటలు విని అగమ్యగోచరాలైన సందేహాలు కలిగి, ఆ సంశయపు టడవులలో తిరుగుతుంటే, కామ క్రోధ లోభ మోహ మదమాత్సర్య స్వరూపుడైన బోయవాడు నిల్వరించరాని మెరుపుదాడి చేయగా నాచిత్తం చెదరి చంచలమౌతున్నది. చిత్తగించవలె నన్నాడు. అన్నమాచార్యులకు అదే అవస్థ దాపురించింది. శ్రీమాన్ శతగోపయతి మంత్ర రాజం ఆచార్యులవారికి ఉపదేశించిన తర్వాత పరిస్థితి చక్కబడి ఉండాలి.

ఇతరములన్నీ దైవమని కొలిచి, ఆయాసపడి అలసిపోయారు ఆచార్యులు శ్రీవేంకటాచల విభుని సేవలుకొని యితరకార్యము లన్నీ ఆయనకు సహింపరాని వయ్యాయి. తైత్తిరీయోపనిషత్తులోని భృగువల్లికి అన్యాపదేశంగా అలరుతున్నవి ఈ సంకీర్తనలోని ఉపక్రమణ పరాకాష్ఠలు. ఓం భృగుర్వైవారుణిః వరుణం పితర ముపసశార అధీహిభగవో బ్రహ్మేతి తగ్ంహోవాచ తపో బ్రహ్మేతి సతపోతప తాపసస్తప్త్వా! భృగుమహర్షికి వరుణి అనే పుత్రుడు ఉన్నాడు. అతడు తండ్రిని సమీపించి బ్రహ్మర్షీ నాకు బ్రహ్మమును తెలియజేయమన్నాడు. తండ్రి భృగుమహర్షి అన్నాడు “తపమాచరించు అందువల్లమాత్రమే బ్రహ్మజ్ఞానం సిద్ధిస్తుంది” అని.

వరుణి తపమొనర్చాడు. అన్నం బ్రహ్మమనుకొన్నాడు. అన్నంవల్లనే పాంచ భౌతికసృష్టి ఏర్పడుతుంది. తద్రాహిత్యంవల్ల సృష్టి సంహారక్రియ కల్గుతున్నదని భావించి, తండ్రికి విన్నవించాడు. ఆయన భృగుమహర్షి అన్నాడు. ‘తపోబ్రహ్మేతి’ అని, తిరిగి వారుణి తపమొనర్చాడు. ఈ సారి ప్రాణం బ్రహ్మమనుకున్నాడు. తండ్రి మళ్ళీ తపస్సు చేయమన్నాడు. ఈ పర్యాయం మనస్సు బ్రహ్మమని భావించాడు. తండ్రి మళ్ళీ తపమొనర్చుమన్నాడు. ఈమారు విజ్ఞానం బ్రహ్మమనుకొన్నాడు. తండ్రి అంగీకరించలేదు. తిరిగి తపమొనర్చాడు వరుణి.

ఈ తడవ ఆనందమే బ్రహ్మమని వారుణి తెలుసుకొన్నాడు. ‘ఆనందం బ్రహ్మేతివ్యజానాత్, ఆనందాయేన ఖల్విమాని భూతాని జాయంతి, యేన జాతాని జీవతి’ ఆనందంవల్లనే సృష్టి స్థితిసంహార క్రమక్రియలు ఏర్పడుతున్నవి. భృగు మహర్షి ఇదివిని మౌనంతో అంగీకారాన్ని తెలిపారు.‘ సైషాభార్గవీ వారుణీ‘ విద్యా ఇది భృగువల్లి.

ఈ సంకీర్తనలో అన్నమాచార్యులు పొందుపరచిన తార్కికుని వివేచనా, తాత్వికుని ఆలోచనా ప్రరోచనా అపూర్వమైనవి. తార్కికులు చేసే పూర్వపక్షీకరణం Doctrine of Reductio ad absurdum ‘దీనివల్ల వేసరినాను అందుచేత ఇది నిష్ప్రయోజనకారి’ అన్న భావపు మాటలకూర్పూ పరివ్రాజకాచార్యులు, పరమ హస్తులు పాటించే బ్రహ్మం ఇది కాదు. నిత్యం ఇదీ కాదు అన్న నేతిప్రకార తత్వదర్శన నిరూపణా విధానమూ - అనన్యసామాన్యం. ‘ఏది

ఆనందదాయకం ఈ దుఃఖ భావమైన జీవనంలో అన్న Scientific Enquiry
'శ్రీ వేంకటేశ్వర చరణ కమల సేవమాత్రమే' అన్న సంశోధిత సమాధానమూ అన్నమాచా ర్యుల చిచ్ఛక్తికి తార్కికమై ఆధ్యాత్మిక తత్త్వ చింతన (Rational Aesthetism) కుతార్కాణాలు.

లతాంగి - ఆది

పాలనేత్రానల -ప్రబల విద్యుల్లతా
కేళీ విహారల - లక్ష్మీనారసింహా

ప్రళయ మారుత ఘోర - భస్త్రికా పూత్కార
లలిత నిశ్వాస డో - లా రచనయా
కులశైల కుంభినీ - కుముద హిత రవిగగన
చలన విధి నిపుణ ని - శ్చల నారసింహా

వివర ఘనవదన దు - ర్విధహసన నిష్యూత
లవ దివ్యపరుష - లాలా ఘటనయా
వివిధ జంతువ్రాత - భువన మగ్నీకరణ
నవనవ ప్రియగుణా - ర్ణవ నారసింహా

దారుణోజ్జ్వల ధగ - ద్ధగిత దంష్ట్రానల వి
కార స్ఫులింగ - సంగక్రీడయా
వైరి దానవ ఘోర - వంశ భస్మీకరణ
కారణ ప్రకట వేం - కట నారసింహా

శ్రీవేంకటేశ్వరునిపై అన్నమాచార్యులు చెప్పినన్ని కీర్తనలు ఏ యితర దైవంమీదా చెప్పలేదు. వాటితర్వాత అత్యధిక సంఖ్యలో చెప్పినవి నరసింహస్వామిపై కీర్తనలే. శ్రీమన్ శఠగోపయతి వద్ద అన్నమయ్య పుచ్చుకొన్న మంత్రరాజం నృసింహమంత్రమే. ఈ సంస్కృత సంకీర్తనలో ప్రతిచరణమూ ఒకే సమాసంలో ఏర్పడటం విశేషం ! సంకీర్తనాచార్యుల సంస్కృత భాషాధికారానికి సంకేతం.

లక్ష్మీనారసింహా ! నుదుటనున్న అగ్నిరూపమై ప్రబలమైన విద్యుల్లతతో కేళి నల్పే లక్ష్మీ నారసింహా !

ప్రళయకాలపు ఝంఝుమారుతంతో సమానమైన భయంకరమైన పూత్కార మనే లలితమైన ఉచ్ఛ్వాస నిశ్వాసయేల,ఊ రేలసనకవతాలను, భూమి, చంద్ర, రవి గగనాదులను ఉయ్యాలలూపుతూ నిశ్చలంగా ఉన్న లక్ష్మీనారసింహా !

తెరచిన నీ ఘనమైన ముఖం నుండి వెలువడే దుస్సహమైన అట్టహాసంవలన ఉమిసిన - దివ్యమూ, తీవ్రమూ అయిన - లాలాజలలవఘటనచేత, సమస్త చరాచర జగత్తునూ లయింపజేయగల నిత్యనూతనమైన గుణాలకు సముద్రమా ! లక్ష్మీ నారసిం హమా !

దారుణమై అత్యుజ్జ్వలమై ధగద్ధగాయమానంగా మెరుస్తున్న దంతాల నుండి ఉదయిస్తున్న జ్వాలల నుండి వెడలుతున్న నిప్పురవ్వల లీలచే అవలీలగా శత్రువు లైన ఘోర రాక్షసుల వంశాలను భస్మీకరించే కారణ నైపుణ్యంవల్ల తెలియబడుతున్న శ్రీవేంక టగిరి విహారీ ! శ్రీలక్ష్మీనరకేసరీ ! అని సంబోధిస్తూ ఉగ్ర లక్ష్మీనరసింహ మూర్తికి ఈ సం కీర్తన సమర్పించారు అన్నమాచార్యులు.

మోహన రవళి - ఆది

పిల్లంగ్రోవి పట్టు మంటా - చెదరే చీని మా
గొల్లవారి పిల్లగ్రోవి - కోరోచల్లా

పాడుంటా దండెమీటె - బలుమారును దా
వేడుక నెవ్వెతె పాట - వినవచ్చెనో
వాడలో జల్లలమ్మే - వనిత నింతే శ్రుతి
గూడినే బాడేటి చల్ల - కోరోచల్లా

చేరి నన్నునాడు మంటా -చె క్కునొక్కీనీతా
గారవాన నెవ్వెతాట - గని వచ్చెనో
మారుకు మారాడేటి - మంద వారముమేము
కోరికినాడేటి చల్ల - కోరో చల్లా

కిన్నెర మీటుమంటా - గెలసీని నన్ను
కిన్నెర మీట్లనేది - గిలిగించెనో
కన్నుల కలికి వేం - కట పతిపై వెట్టి
గొన్న కిన్నెర గుబ్బల - కోరో చల్లా

గొల్లపడుచుల పెరుగు చల్లలమ్మేపాట ఈ 'కోరోచల్ల'పాట. 'కొనరో' అన్న పదంలో కొ ప్లస్ నా - కో అయి గొల్లెతల గ్రామ్యశైలిలో 'కోరోచల్ల' - 'కొనరోచల్ల'కు రూపంగా ఏర్పడినట్లుంది. నాచిన్నప్పుడు మా అమ్మమ్మగారు పాడే ఒక పాట - కర్తృత్వం తెలియదు - అందులో ఒక గోపిక పెరుగు అమ్ముదామని 'పెరుగో పెరుగో' అనబోయి, 'గోవింద దామోదర మాధవ' అని అరుస్తూ వీధులన్నీ తిరిగిందని మధురమైన ఊహ. తోడిరాగం లో అని జ్ఞాపకం, పాట పల్లవి అనుపల్లవి మాత్రం స్మృతిలో ఉన్నవి.

గోవింద దామోదరా - మాధవయని
గోపకన్య పెరు - గమ్మెనే
భావించి పెరుగో పెరుగో యనబోయి
బాలకృష్ణుని మీది మోహవశముచే ॥గోవింద

చిన్నికృష్ణుని బాల్యక్రీడను చిత్రించిన మనోజ్ఞమైన సంకీర్తనమిది. ఇందులో నాయి క ముగ్ధ గోపిక - బాలకృష్ణుని క్రీడలు వర్ణిస్తూ చల్లలమ్ముతోంది ఆమె. తన మురళిని పట్టుకొమ్మని బెదరిస్తున్నాడమ్మా మా యాదవకుల మురళి (చల్లమ్మా కొనండి పెరుగమ్మా కొనండి)

పాట పాడమని తంబుర మీటుతున్నాడే కొంటె కృష్ణయ్య, ఎవతె పాట అతని చెవుల లో ఇంకా మర్మోగుతోందో గానీ, చల్ల పెరుగులమ్ముకునే దానను నేనేంపాడతాను. తంబురశ్రుతిలో పాడినా నాపాట చల్లపాటే: చల్లమ్మా చల్ల: పెరుగమ్మా పెరుగు!

నృత్యమాడు - చిందులువేయమని నా చెక్కిలి నొక్కుతున్నాడే చిలిపి గోవిందుడు. ఎవతె నృత్యం చూసివచ్చాడో యేమో గంతులు వేయమంటున్నాడు. మేం గొల్లవారం. మాటకు బదులు మాట మాత్రం ఆడగలం. ఈ ఆటలు గెంతులు మాకే మి తెలుసు. నాకు తెలిసిన ఆట అల్లా చల్లలమ్మే ఆటే చల్లమ్లా చల్ల: పెరుగమ్మా పెరుగు

కిన్నెర వాయించమని ఒత్తిడి చేస్తున్నాడు నన్ను, ఈ వేంకటపతికి అందమైన కన్ను లు గల ఎవర్తె తన పలుద చన్ను గుబ్బలపై ఇతని చేత వెట్టి చాకిరీ చేయించుకుంటూ, కిన్నెర మీటుల్లాంటి చక్కిలిగింతలు పెట్టిందో యేమో! చల్లోయమ్మ చల్ల: పెరుగోయమ్మ పెరుగు, అంటూ ఈ 'కోరోచల్ల' పాటలో తన మనసులోని గుట్టంతా రచ్చకెక్కించు కు న్నది పాపం ఆ మాయ తెలియని గొల్ల కన్నె, ఆగోపికా, తాను మధురభక్తి ముగ్ధ ప్రేమల లో బింబ ప్రతిబింబాలు గనుక సంకీర్తనాచార్యులు రమణీయమైన ఈ జానపద గీతాన్ని సరసమధురంగా సంతరించారు.

భూపాల - ఆది తాళం ఖండగతి

పొలయలుక నిద్దురలు - భోగించ దొరకొంటి
వలరివడి మేల్కొనవె - అఖిలేశ్వర

1. తరుణిమైనపుడె పరి - తాప సూర్యుడు వొడిచె
వరుస జెలి కన్నుగలు - వలు మొగిచెను
మరుని సాయకపు తా - మరలు వడి వికసించె
కరుణతో మేల్కొనవె - కమలేశ్వరా...

2. కాంత నిట్టూర్పులను - గాలియును నగ్నియును
వంత చెమటల వాన - వరుణుండును
వింతలుగ నిన్ను సే - వింతుమని యున్నారు
పంతమున మేల్కొనవె - పరమేశ్వర....

3. మెలుత పెనుదురుమనెడి - మేఘ మండలములో
నలుగడలఁ జెలగె సుమ - నస పంక్తులు
కులికి పూవుల వాన - కురియంగ నున్నదిదే
చలముడిగి మేల్కొనవె - సర్వేశ్వరా ...

4. కదిసి పులకల సృష్టి - కడలేక పొడమించు
మదనుడను మానసక - మలభవుడును
ముదితకోపపుహరుడు - మొనసియున్నారిదే
నిదుర మేల్కొనవె జల - నిధి శయనుడ ..

5. ఒడికముగ జెలిలోన - నుదయరాగము వొడమె
వెడలె నవె పలుకుఁ గో - విలరవములు
పడతి గూడితివి రతి - పరవశంబికనైన
కడగి మేల్కొనవె వేం - కట రమణుడ ...

నిద్రబోయేస్వామికి  మేలుకొలుపు చూశాము క్రిందటి సంకీర్తనలో, ప్రణయపు టలుకల దొంగనిద్ర పోతున్నవానికి ఈ సానునయపు మేలుకొలుపు.

దొంగ యలుకల నిద్ర నటిస్తూ కులుకుదామనుకుంటున్నావు గానీ అఖిలేశ్వరా అతి త్వరగా లే. ఈ విచిత్రాలు తిలకించు సమయం మించిపోగలదు.

పరితాపం అనే సూర్యుడు తరుణి దేహాన ఉదయించాడు. ఆమె కన్ను కలువలు ఆ అరుణోదయం తాళలేక ముడుచుకొన్నవి. నీ వామెపై వేసిన మన్మధ బాణపు తామర లు మిక్కిలిగా వికసించినవి. (చెలియకై) కరుణతో మేల్కొనవయ్యా! కమలేశ్వరా.

ఈ సుందరి నిట్టూర్పులోని గాలీ, వేడీ అనే వాయ్వగ్నులూ, నీతోడి జగడాల పొడమిన ఘర్మవర్షమనే వరుణుడూ, వింతరీతులలో ( ఈమె నిట్టూర్పులూ, చెమట వానల


ద్వారా ) నిన్ను సేవించ పంతగించియున్నారు. ఈ విధంగా వారి సేవ లందుకొనేటందు లకై పరమేశ్వరా మేలుకో.

మేఘమండలంవలె నున్న రమణి నెరికొప్పులో విరితురుములు అలరి ఉన్నవి. నీపై యిప్పుడు పూలవాన కురియబోతున్నదయ్యా కుహనాకోపం చాలించి సర్వేశ్వరా లేవయ్యా.

ఒడికముగ (మనోహరంగా, ఇంపుగా) ఈమెలో ఉదయరాగము ఉత్పన్నమైనది. ఆమని ఈమెను ఆశ్రయించింది. తార్కాణంగా ఆమెకు కోకిల కూజిత రవములు పలు కులై వెడలినవి. మునుపు ఆమెతో కలసి రతి పారవశ్యమందినాడవు. ఇప్పుడు కర్తవ్యమూ అదే. జాగుసేయకు. మేల్కొనవయ్యా ! వేంకటరమణుడా.

అంతులేని పులకరింతల సృష్టికర్త మనసు దామరలో జనించిన మన్మధుడను బ్రహ్మ, ఈ తరుణి కోప రూపం ధరించిన శివుడూ, నీకై వేచి ఉన్నారు. జలనిధి శయను డా ! నిదుర మేల్కొనవయ్యా.

అన్నమాచార్యుల శృంగారాధ్యాత్మిక విషయ సమ్మేళనపు మనోజ్ఞ రసజ్ఞ వైభవానికి అత్యద్భుత నిదర్శనం ఈ సంకీర్తనం. ఇందుగల అందం 'నభూతో న భవిష్యతి'.



చంద్రికా హిందోళం ఖండ ఏక ఝుంప తాళం

పుడమినిందరి బట్టె - భూతము కడు
పొడవైన నల్లని - భూతము

కినిసివోడ మిం - గెడి భూతము
పునుక వీపు పెద్ద - భూతము
కనలి కవియు జీ - కటి భూతము
పొనుగు సింగపు మోము - భూతము

చేటగాళ్ల మిం - చిన భూతము
పోటు దొరలపెద్ద - భూతము
గాటపు జడల బిం - కపు భూతము
జూటరి నల్లము - సుగు భూతము

కెలసి బిత్తలే తిరి - గేటి భూతము
పొలుపు దాంట్ల పెద్ద - భూతము
బలుపు వేంకటగిరి - వయి భూతము
పులుగు మీది మహా - భూతము

దశావతారాలను దశవిధాలుగా వర్ణించారు అన్నమా చార్యులు. శ్రీవేంకటేశ్వరుని తో ఆయనకున్న చనవు అపారమైంది. ఆ చనువుతో స్వామిని ఒక భూతంగా మార్చి అపూర్వమైన అపరమైన ఈ సంకీర్తన వెలయించారు. శ్రీవిష్ణువును భూతం అంటే ఏమి దోషం ? సహస్రనామస్తోత్రంలో మొదటి శ్లోకంలోనే భూత శబ్ద సంబంధంగలవాడుగదా ఆ శ్రీమహావిష్ణువు.

ఓం విశ్వం విష్ణు ర్వషట్కారో భూతభవ్య భవత్ప్రభుః

భూతకృత్ భూతభృత్ భావో భూతాత్మా భూతభావనః

పంచభూతములూ తనయందు ఆవిర్భవించే భూతము అది. పంచభూతాశ్రయమై నది ప్రపంచం. పంచభూతాకారంగా ప్రపంచాన్నంతటినీ పట్టిన భూతం, తన మాయా తిమిరాకృతి జగత్తు నంతటినీ ఆవరించిన పొడవైన నల్లని భూతం అట ఆ శ్రీవేంకటాచ లేశ్వరుడు.

ఓడలు మింగగల పెద్ద చేప భూతం - మీనావతారం.

పునుక లేనంత పెద్ద వీపుగల భూతం - కూర్మం.

కనలికవియు చీకటి భూతం - వరాహావతారం

పొనుగు సింగపు మోము - భూతం నృసింహావతారం.

చేటగాళ్ల మిం - చిన భూతం -మూడు పాదాలతో విక్రమించిన వామనావతారం.

పోటు దొరల పెద్ద భూతం - రాజులందరినీ హతమార్చిన పరశురామావతారం. గాటపు జడల బింకపు భూతము - పధ్నాలుగు సంవత్సరాల వనవాసపు బింకపు పట్టుదల తో జుట్టు జడలు గట్టిన శ్రీరామావతారం.

జూటరి నల్లము - సుగు భూతం శ్రీ కృష్ణావతారం.

కెలసి బిత్తలే తిరి - గేటి భూతము. బుద్ధావతారం - బౌద్ధులకు శిరోముండనం సంప్రదాయం.

పాలుపుదాంట్ల పెద్ద - భూతము -గుఱ్ఱాన్నెక్కిదూకించే కల్కావతారం.

పులుగు మీద మహా - భూతము - గరుడాధి రూఢుడైన మహావిష్ణువు.

మధ్యమావతి - ఖండ ఏక

రాజీవ నేత్రాయ - రాఘవాయ నమో
సౌజన్య నిలయాయ - జానకీశాయ

దశరథతనూ జాయ - తాటకదమనాయ
కుశిక సంభవయజ్ఞ - గోపనాయ
పశుపతి మహాధను - ర్భంజనాయ నమో
విశద భార్గవరామ - విజయకరణాయ

భరితధర్మాయ శూ - ర్పణఖాంగ హరణాయ
ఖరదూషణాదిరి పు - ఖండనాయ
తరణి సంభవసైన్య - దక్షకాయనమో
నిరుపమ మహావారి - నిధిబంధనాయ

హతరావణాయ సం - యమినాధవరదాయ
అతులితా యోధ్యాపు - రాధిపాయ
హితకర శ్రీవేంక - టేశ్వరాయ నమో
వితత వావిలిపాటి - వీరరామాయ

ఋగ్వేదంలోని రుద్రాధ్యాయంలో నమక చమక మంత్రాలున్నాయి. 'ఓం నమో భగ వతేరుద్రాయ; నమస్తే రుద్రమన్యవ ఉతోత ఇషవేనమః నమస్తే అస్తుధన్వనే బాహుభ్యాము తతేనమః' మంత్రాలతో నమకపాఠం మొదలౌతుంది. 'నమో భవాయచరుద్రాయచ నమ శ్శర్వాయచ పశుపతయేచ - 'నమోజ్యేష్టాయచ కనిష్టాయచ - నమో దుందుభ్యాయ చాహనన్యాయచ - నమస్సోమాయచ నమస్తామ్రాయచా రుణాయచ' ఇత్యాది మంత్రా లతో రుద్రునికి, శివునికి నమస్కారం అర్పిస్తూ జలాద్యభిషేక సమర్పణ చేయడంవల్ల

గృహస్థులకు సర్వాభీష్టసిద్ధి, సర్వాఘశుద్ధి లభిస్తుందని వైదికమతరీత్యా సాయణాదిభాష్య కారుల ఉవాచ.

అన్నమాచార్యుల ఈ సంకీర్తనం నమకమంత్రానుసారమే అనడం సాహసం కాదని నా విన్నపం. రుద్రనమకంవలె ఈ కీర్తనకూడా చతుర్థీ విభక్తిలో సాగింది. రుద్రునికి బదులుగా శ్రీరాముడు - శ్రీ వేంకటేశ్వరుని పూర్వావతార స్వరూపుడు నెలకొన్నాడు. శ్రీ రామ గుణవిశేషాలు రుద్రగుణవిశేషణలయ్యాయి రుద్రుని ధ్వనిగా నుతించితనది ఋగ్వేదం. శ్రీరాముని ధ్వనిగా, శివధనుర్భంజన మహామన్విగా నుతించినది అన్నమాచార్యుల ఆంధ్రవేదం.

సంకీర్తనాతాత్పర్యం ఇది -రాజీవనేత్రుని రాఘవుని, సౌజన్యనిలయమని, జానకీ వల్ల భుని కొరకై నమస్కారం. దశరథుని పుత్రుని కొరకు, తాటక దమనునకై, కౌశిక యాగా న్ని రక్షించినవానికై, ఈశ్వరుని విల్లు విరిచినవానికై, పరశురాముని జయించినవానికై ఈ నమస్కారం.

ధర్మాన్ని భరించినవానికై, శూర్పణఖ ముక్కు చెవులు ఎత్తుకొనిపోయిన వానికై, ఖరదూషణాదులైన రాక్షసులను ముక్కలు చేసినవానికై, కోతులసైన్యాన్ని సమర్థంగా నిర్వహించినవానికై, మహాసముద్రాన్ని నిరుపమానమైన విధంగా బంధించినవానికై ఈ నమస్కారం.

రావణుని వధించినవానికై, మునులెల్లరకూ వరములిచ్చినవానికై, అసమానమైన అయోధ్యానగరాధిపతికై, జగత్తంతటికీ హితమొనర్చే శ్రీ వేంకటేశ్వరునకై శ్రీ వేంకటేశ్వరు ని రూపాంతరమైన వావిలిపాటి వీరరామునకై ఈ నమస్కారం. 'నమోరుద్రేభ్యోయే పృథి వ్యాం' అనే బదులు 'నమోరామేభ్యో' అని దిద్దేవా నమస్కార మంత్రం సమర్పించడమే మి గిల్చారు అన్నమాచార్యులు ఈ ఆంధ్రవేద వీర శ్రీరామ నమక సంకీర్తనలో.

ఆనందభైరవి - ఆది

రావేకోడల - రట్టడికోడల
పోవేపోవే అత్తయ్యా - పొందులు నీతోచాలును

రంకెలు వేయుచు - రాజులెదుటనీవు
గొంకు కొసరు లేని - కోడలా
పంకజముఖి నీవు - పలు దొడ్డవారిండ్ల
అంకెల దిరిగేవు - అత్తయ్యా

ఈడాడ పదుగురు - నేగురు మగలతో
కూడి సిగ్గు లేని - కోడలా
వాడకు పదుగురి - వలపించుకొని నీవు
ఆడాడ దిరిగేవు - అత్తయ్యా

బొడ్డున బుట్టిన - పూవనికేనిను
గొడ్డేరి తెస్తినే - కోడల
గుడ్డముపైనున్న - కోనేటి రాయని
అడ్డగించుకొంటి - వత్తయ్యా

అత్తా కోడళ్ళ జగడాలు లోకసామాన్యం, తను మోసి, కని, పెంచిన కొడుకుని నడుమంతరంగా వచ్చి కొంగున కట్టుకుంటుందని అత్తకూ, తన సర్వస్వాన్ని అర్పించి అర్ధాంగి కాగా తన భర్తను పూర్తిగా తనకు కాకుండా చేస్తున్నదని కోడలికి పరస్పరం ఈర్ష్యాద్వేషాలు పెరిగి, ఒకరినొకరు దుయ్యబట్టుకుంటూ ఉంటారు. ఒకరి శీలాల నొకరు శంకిస్తూ ఎత్తిపొడుస్తూ ఉంటారు. లక్ష్మి సరస్వతులు ఇక్కడ అత్తాకోడళ్ళు. జగడం వాళ్ళకూ తప్పలేదు. వాళ్ళ సంభాషణ, రణఘోషణ ఈ విధంగా ఉంది.

లక్ష్మి :రావమ్మా సంసారం రట్టు చేసే కోడలా

సరస్వతి: పోవమ్మా అత్తా. నీతో పొందులు (నీవిచ్చే ధనమూలక సుఖాలు) చాల్లే.

లక్ష్మి: రాజులెదురుగా నువ్వు రంకెలు వేస్తూ (రాజాశ్రయులైన కవి పండితుల ముఖవాణి పై ) ఏమాత్రం జంకూ, బిడియం లేకున్నావు.

సరస్వతి:

అత్తయ్యా ! నువ్వు తక్కువదానవా ? డబ్బుగల పెద్ద పెద్ద వాళ్ళ యిళ్ళలో నువ్వు అంకెల్లో లెక్కలలో / సంఖ్యలలో తిరగటం లేదా ?

లక్ష్మి :ఇక్కడా, అక్కడ నువ్వు పదిమంది - పదిహేను మంది మగవాళ్లతో (మొగుళ్లతో) తిరుగుతున్నావే సిగ్గులేని కోడలా (కృతి సరస్వతీ రూపం. కృతి భర్త కృతికన్యాభర్తగనుక సరస్వతికి మొగుళ్లు అని లక్ష్మిచమత్కారం).

సరస్వతి:ఊరికి పదిమందిచేత వలపించుకొని నీవు ఒక్కదగ్గర స్థిరంగా ఉండక అక్కడా, అక్కడా తిరగడం లేదా? (డబ్బున్నవాళ్లు ఊరికి పదిమంది తప్పక ఉంటారు. వారందరూ నీ భర్తలే అని చమత్కారం).

లక్ష్మి :నా భర్త బొడ్డున పుట్టిన ఆ అమాయకపు (బ్రహ్మ) బిడ్డడికోసం నిన్ను తెచ్చుకున్నాను.గొడ్డేరి మోసపోయాను. నా కొడుకును వల్లో వేసుకున్నావు నువ్వు.

సరస్వతి:తల్లీ నువ్వు మాత్రం తక్కువ తిన్నావా. ఏడు కొండలపై నున్న కోనేటిరాయుణ్ణి మంత్రించి,అంతటివాణ్ణి చిన్నపిల్లవాడికివలె నీ ఒళ్లో అడ్డంగా వేసుకుని కులకడం లేదా? (వేంకటపతి నీకు పూర్తిగా కైవసమైన వాడేగా).

అన్నమయ్యగారికి కొంచెం సరస్వతీ పక్షపాతం ఉన్న ట్లుంది. ఈ వాదులో సరస్వతి నే గెలిపించాడు. సరస్వతి లక్ష్మిని గెలిపించింది. వేంకటేశుడు లక్ష్మికి ఓడినవాడైనాడు.

## కృష్ణవేణి - ఆది

సదయ మానస సరో - జాత మాదృశవశం
వదముదా హం త్వయా - వంచనీయాకిం

జలధి కన్యాపాంగ - చారు విద్యుల్లతా
వలయ వాగురి కాంత - వనకురంగ
లలిత భవదీక్షావి - లాసమన సిజబాణ
కులిశ పాతైరహం - క్షోభణీయాకిం ?

ధరణీ వధూపయో - ధరకనక మేదినీ
ధర శిఖర కేళిత - త్వర మయూర
పరమ భవదీయ శో - భన వదన చంద్రాశు
తరణి కిరణైరహం - తాపనీ యాకిం ?

చతుర వేంకటనాధ - సంభావ యసి సం
ప్రతియధా తత్త్వకా - రం విహాయ
అతిచిర మనాగత్య - హంత సంతాపకర
కితవ కృత్యై రహం - ఖేదనీ యాకిం ?

దయగల మనసు దామరలుగల నావంటివాళ్లను మభ్యపెట్టి లోబరచుకొనే మాట నేర్పరికాడా ? హాస్యానికైనా, ఆటగానైనా నీవు నన్ను వంచింపవచ్చునా ? నీచే వంచిం పదగిన దాననా నేను అని స్వామియందు అవ్యాజానురాగంతో, విరహతాపం చెందిన ఒ క నాయిక, శ్రీభూదేవులకన్న అన్య అయిన భామ పల్కిన నెయ్యపు పల్కులివి.

జలధికన్యయైన లక్ష్మీదేవి సుందరమైన కంటి కొనచూపుల విద్యుల్లతా వలయపు ఉచ్చులో చిక్కుకొని ప్రకాశిస్తున్న వనకురంగమా ।- అడవిజింకల రాజా ! అని సంబోధ న. లలితములైనప్పటికీ నీ చూపులనే మన్మధుని తూపుల వజ్రాయుధ ఘాతములతో క్షో భపెట్టదగినదాననా నేను ?

భూదేవి కుచములనే బంగారుకొండలపై ఆటలాడు నేర్పరి నెమలీ ! (అని సంబోధ న) శోభస్కరమైన నీ మోము నుండి వెడలే వెన్నెలతో నాపాలిట సూర్యుని (ఎండగా పుతో) కిరణములతో నన్ను తపింపజేయవచ్చునా ? తపింపబడదగినదాననా నేను ?

చతురుడవైన శ్రీ వేంకటపతీ ! అప్పటిదాకా నాతో ప్రవర్తిస్తున్న నీ వైఖరి మార్చుకో. (ఎప్పుడూ నా చెంతరాక నాకు బాధ కల్గజేస్తున్నవాడా) కపటకృత్యము లొనర్చకు. బూటకపు ప్రేమ చూపకు. అటువంటి వాటిచే నేను బాధింపదగ్గదాననా ? అంటూన్న ఈ శృంగార నాయిక మాటల చాటున అన్నమాచార్యుల మనసు సొగసు తొంగిచూస్తున్నది.

సామ - ఆది

సందెకాడ బుట్టినట్టి - చాయల పంట యెంత
చంద మాయ జూడరమ్మ - చందమామ పంట

మునుపు పాలవెల్లి - మొలచి పండిన పంట
నిను పై దేవతల - నిచ్చ పంట
గొనకొని హరి కన్ను - గొనచూపుల పంట
విను వీథి నెగడిన - వెన్నెలల పంట

వలరాజు పంపున - వలపు విత్తిన పంట
చలువ పున్నమి విర - జాజర పంట
కలిమి కామినితోడ - కారు కమ్మిన పంట
మలయుచు దమలోని - మట్టి మాని పంట

విరహుల గుండెలకు - వెక్కసమైన పంట
పరగ చుక్కలరాశి - భాగ్యము పంట
అరుదుగ తూరుపుకొండ - నార బండిన పంట
యిరవై శ్రీవేంకటేశు -నింటిలోన పంట

ఆంధ్ర సాహిత్యంలో ఆధ్యాత్మిక చంద్రుని ఉదయింపజేసినది ఇద్దరే. వారు అన్నమాచార్యులూ ధూర్జటి మహాకవీ. ధూర్జటి పద్యానికీ అన్నమయ్య పాటకీ ఉన్న సామ్యం మనోజ్ఞమనోహరమైనది. శ్రీకాళహస్తీశ్వర మహోత్మ్యంలో ధూర్జటి పద్యం -

ఉదయగ్రావము పానపట్టమభిషేకోదఃప్రవాహంబు వా
ర్థిదరధ్వాంతము దూప ధూమము జ్వలద్దీ ప ప్రభారాజి కౌ
ముది తారానివహంబు లర్చిత సుమంబులాతమోదూర సౌ
ఖ్యదమై శీతగభస్తి బింబ శివలింగం బొప్పె ప్రాచీ దిశన్

తూర్పున చంద్ర బింబమనే శివలింగం పొద్దు పొడిచింది. తూర్పుకొండ పానవట్టమైంది ఆ శివలింగానికి సముద్ర జలమంతా రుద్రాభిషేక మొనరించిన జలరాశి.

కొంచెం కొంచెంగా మిగిలి ఉన్న చీకటి అగరువత్తుల పొగయై అలరించి ఆ చంద్రుని వెన్నెలల దీప్తులు దీపములయ్యాయి. ఆకాశమంతా పరుచుకున్న నక్షత్రాలు శివార్చన చేసిన మల్లెపూవులై వెల్లివెరిసినవి. అజ్ఞానతిమిరం తొలగి జ్ఞానాంకురమై రసోదయమై జగత్తుకు బ్రహ్మానందం అనుభవమైంది. ధూర్జటి పలుకులు నమకచమక సామ్రాజ్యపట్టాభిషేక మంత్రములయ్యాయి. మార్గకవితాశైలిలో.

అన్నమాచార్యులు ఆధ్యాత్మిక శృంగార చంద్రునిపంట ఈ దేశికవితా సంకీర్తనంలో పండించారు. సంధ్యాకాలంలో పుట్టిన ఈ చందమామ పంటను చూడండి ఎన్ని కళలతో వెలుగుతున్నదో అంటూ ఆ పంట ఎంతటి పర్వమైనపంటయో పలుకుతున్నారు.

క్షీర జలధిని మొలకెత్తి పండిన పంట అది. జ్యోతిశ్చక్రంలో గ్రహాలకు అమరులకు - అనుదినపు పంట. (చంద్రమంగళ, గజకేసరి, అనఫ, సునఫ దురుధర చంద్రాదియోగాలు చంద్రునివల్ల కలుగుతాయని జ్యోతిషశాస్త్రం) శ్రీమహావిష్ణుని కరుణాకటాక్ష వీక్షణల పంట ఆకాశంలో చల్లని వెలుగు వెల్లియల ఈ వెన్నెలపంట

మన్మధుడు పుత్తెంచగా జగత్తులో అందరి మనసులలో వలపు పంటకు విత్తనమైన వలపునారుపంట. చలువ పున్నమల కార్తీకపౌర్ణమి రాత్రులలో కన్నెలు జాజరపాటలు పాడే పంట, లక్ష్మీదేవి తోడబుట్టి, శ్రీసతితో వామనగుంటలాడిన సిరిపంట, రసాన్వేషులకు, చిత్తిపాసులకు అత్యల్పంగా ఆరంభమై అత్యున్నతంగా పెరిగే భక్తిజ్ఞాన వైరాగ్యముల మట్టిచెట్ల పంట ఈ చందమామ పంట.

విరహిజనులకు విరహతాపం హెచ్చించే పంట. నక్షత్రముల భాగ్యమైన పంట. (చంద్రుడు ఏ నక్షత్రంలో పూర్ణుడౌతాడో ఆ నక్షత్రం పేరు ఆ మాసానికి వస్తుంది. మన పంచాంగం చంద్రమానం. ఉదా-కృత్తికాతారలో పౌర్ణమి అయితే కార్తీకమాసం. చిత్రలో పౌర్ణమి అయితే చైత్రం ఇత్యాది గ్రహింపవలె). సకృతుగా తూర్పున వండే పున్నమి పంట (పౌర్ణమి నెలకు ఒక్కసారే వస్తుంది) శ్రీవేంకటేశ్వరుని అత్తవారింట్లో పండి ఆ స్వామియింటికి అరణమై, సతమైన పంట అని సాహిత్యపరంగానూ, సహస్రార కమలాలలో ఉన్న లక్ష్మీనారాయణులపై కాంతులు జల్లే నిత్య కళాసహిత నిత్యపూర్ణ చంద్రుడని శ్రీవిద్యాయోగతంత్రపరంగానూ భావం.

ఈ వెన్నెలపంట పాటకు మంత్రం కూడా ఉన్నది 'ఓంహ్రీం చంద్రికే హంసా క్లీం స్వాహా' ఇది చంద్రికామంత్రం - అమృతసిద్ధికై సాధకులు వినియోగిస్తారు.

మోహన - ఆది

సత్యభామ సర - సపు నగవు
నిత్యము హరిమది - నేనెలవాయ

రుకుమిణిదేవికి రూపయవ్వనికీ
సకల విభవముల - సౌమ్యతలు
చికురాంబరమున - చెదిరిన యలుకలు
వికచాబ్జ ముఖములు - వేయివేలాయె

తొడవుల శ్రీసతి - తొలుమెరుగులకీ
నడపుల మురిపెపు - నగుమోము
తడయక వారిధి - ద్రచ్చినహరికీ
బడలిక బాపను - పరమంబాయె

అనుదినమును నీ - యలమేలుమంగ
కనుగవ జంకెన - గర్వములు
దినదినములు నల - తిరువేంకటపతి
చనవుల సొబగుల - సంపదలాయె

లక్ష్మీ సహస్రనావస్తోత్రంలో, లక్ష్మీ అష్టోత్తర స్తోత్రంలో పేర్కొనబడ్డ విషయం శ్రీమహా లక్ష్మీ శ్రీ విష్ణు హృదయవాసిని అని. అందుకు ప్రమాణాలు కొల్లలు: లక్ష్మీ సమస్రనామధ్యాన శ్లోకమిది.

సర్వజ్ఞాం సర్వ జననీం విష్ణు వక్షస్థలాలయాం
దయాళుమనిశంధ్యాయేత్సుఖసిద్ధి స్వరూపిణీం

లక్ష్మీ  అష్టోత్తరంలోని వందన శ్లోకమది.

మాతర్నమామి కమలే కమలాయతాక్షీ
శ్రీ విష్ణు హృత్కమలవాసిని విశ్వమాతః
క్షీరోదజే కమల కోమలగర్భ గౌరీ
లక్ష్మీ ప్రసీద సతతం నమతాం శరణ్యే ;

శ్రీమహా లక్ష్మీ  త్రిగుణాకారయై రుక్మిణీ సత్యభామలు తానే అయి, అలమేల్మంగా కృతియై అలరినది. శ్రీవేంకటేశ్వరుడే శ్రీకృష్ణుడు. 'రుక్మిణీ సత్యభామాభ్యాతదిదం కృష్ణ మాశ్రయే' అని విష్ణు సహస్రనామ స్తోత్రపీఠిక తిరుమలపైన శ్రీవేంకటేశ్వరుడొక్కడే ఉన్న ప్పటికీ పూర్వాశ్రమపు పురంధ్రులు రుక్మిణీ సత్యభామల సొబగుల సరవులకు ఆయన యెద నిలయమైనది. సత్యభామాదేవి సరసపు సెలవినవ్వు స్వామి మనస్సులో హత్తుకొని నిత్యనూతనంగా విరాజిల్లుతున్నది.

రుక్మిణీదేవికి - నిత్య యౌవనరూప సౌందర్య వైభవ సర్వస్వస్నిగ్ధతతో వికసించిన ఆమె ముఖ కమలం, చెదరిన ఆమె తురుములోని అలకలలో దోబూచులాడుతున్నందు న తద్వదన కమలపునః పునర్దర్శనంవల్ల దశ గుణిత శత సహస్ర కమలోదయం స్వామి అలరింపుకై కలగినదట.

లక్ష్మీ దేవి మేని ఆభరణాల సొబగులను పొందిన ముచ్చటైన స్మిత ముఖం - క్షీర సాగరమధనం చేసి, కూర్మమై మందరగిరిని మోచిన హరికి కలిగిన అలనటను పొగొ ట్టి సేదదీర్చే అమృతౌషధం అయినది - అమృత సహోదరి నగుమోము అమృత మధను నికి అలసట తీర్చే అమృతౌషధం అయినది. అనునిత్యం ఈ అలమేలుమంగ కను బొమ వింటి వంపుల అతిశయం (సత్యభామగా, రుక్మిణిగా, శ్రీలక్ష్మిగా స్వామికి అలరింపులొనర్చి తానలరినందున గల్గిన అతిశయంవల్ల ఆమె కనుబొమలు పైకి లేచినవి అని చమత్కా రం) శ్రీవేంకటపతికి దినదినపు చనవుల సొబగుల సంపద లైనవి అని అన్నమాచార్యు లు రుక్మిణీ సత్యభామా శ్రీమహాలక్ష్మీ అలమేల్మంగలకూ శ్రీకృష్ణ శ్రీవిష్ణు శ్రీవేంకటేశ్వరు

లకూ అభేదం పాటించి మాలాదీపకాలంకార సువర్ణ సుమమాలా సంకీర్తనం స్వామికీ, స్వామి దేవేరులకూ, సాతార చంద్ర దశ శత సహస్రంగా సమర్పించారు.

## ధన్యాసి ఖండ ఏక

షోడశ కళానిధికి - షోడశోపచారములు
జాడతోడ నిచ్చలును - సమర్పయామి

అలరు విశ్వాత్మకున - కావాహనమిదె సర్వ
నిలయున కాసనము - నెమ్మినిదే
అలగంగాజనకున - కర్ఘ్య పాద్యాచమనాలు
జలధి శాయికిని మ - జ్జనమిదే

వరపీతాంబరునకు - వస్త్రాలంకారమిదె
సరి శ్రీమంతునకు భూ - షణములివే
ధరణీధరునకు గం - ధపుష్ప ధూపములు
తిరమిదె కోటి సూర్య - తేజునకు దీపము

అమృత మథనునకు - నదివోనై వేద్యము
గమి చంద్రనేత్రునకు - గప్రవిడెము
అమరిన శ్రీవేంక - టాద్రి మీద దేవునికి
తమితో ప్రదక్షిణాలు - దండములు నివిగో

శ్రీ వేంకటేశ్వరుడు షోడశ కళానిధి. చంద్రునికి 15 కళలే ఉంటాయట. 16వ కళ షోడశీ కళ పరమేశ్వరపాలభాగాలంకారం. ఈ సంకీర్తనంలో 15 ఉపచారాలే చెప్పబడ్డ వి. కర్పూర నీరాజనం అమ్మవారి పేర వేరే కృతిలో ఉన్నది.

శ్రీవిద్యాప్రకరణంలో పంచదశి, షోడశి మంత్రములున్నవి. షోడశి చెప్పుకొన్నవారు లమిత్యాది పంచపూజలూ, షోడశ, చతుష్షష్ట్యుపచారాలూ చేసేటప్పుడు 'పరికల్పయామి' అని అర్పిస్తారు. పంచదశీ సాధకులు సమర్పయామి అని సమర్పిస్తారు ఆయా ఉపచారా లని. 'సమర్పయామి' అన్న క్రియాపదం ద్వారా అన్నమాచార్యులు ఈ విషయాన్ని సూచి స్తున్నారు. లమిత్యాది పంచపూజావిధి వస్తువుగా ఈ సంకీర్తనలో ధ్వనిస్తున్నది.'ధరణీధరు నకు గంధ పుష్పధూపములు' అన్నప్పుడు 'ఓంలంపృథివీతత్వాత్మనే శ్రీ వేంకటాచలపతయే గంధం సమర్పయామి' అన్న భావం, 'అమృతమధనునకు అదివోనైవేద్యము' అన్నచోట ఓం వం అమృతతత్వాత్మనే శ్రీ వేంకటాచలపతయే అమృతమహానైవేద్యం సమర్పయామి' అన్న ఊహా ప్రకటింపబడ్డాయి. ఈ 'సమర్పయామి' చివర 'నమః' చేర్చవలసి ఉంది. అన్నమాచార్యులు సర్వ స్వతంత్రులు గనుక 'నమః' ని తెలుగు చేసి 'దండములు నివిగో'

అనగలిగారు. 'గీతం శ్రావయామి' అని ఈ సంకీర్తనం పాడి 16 ఉపచారాలూ చేసిన ఘనుడు అన్నమాచార్యులు ఈ 'సమర్పయామి' అన్న క్రియా పదాన్ని ప్రతిఉపచారం చివర తాళం చెడకుండా చెప్పవచ్చు. అన్నమాచార్యుల సంగీత సాహిత్య మంత్రశాస్త్ర పరిజ్ఞాన దేవతార్చనా విధాన సమ్మేళనా ప్రతిభా సామర్థ్యాలకు ఈ సంకీర్తన ఒక ఉదాహరణ.

లలిత - ఆది

తలగరో లోకులు - తడయకురో మము
కలిగినదిది మా - కాపురము

నరహరి కీర్తన - నానిన జిహ్వా
నొరుల నుతింపగ - నోపదు జిహ్వా
మురహరు పదముల - మొక్కిన శిరము
పరుల వందనకు - బరగదు శిరము

శ్రీపతినే పూ - జించిన కరములు
చోపి యోచనకు - జొరవు కరములు
యేపున హరికడ - కేగిన కాళ్ళు
పాపుల యిండ్లకు - బారవు కాళ్ళు

శ్రీ వేంకటపతి - జింతించు మనసు
దావతి నితరము - దలచదు మనసు
దేవుడతని యా - ధీనపు తనువు
తేవల నితరా - ధీనము గాదు

జనులందరూ దారి తొలగండి మాకు. మమ్ము వేధించకండి. మాకు సిద్ధించిన జీవన విధానమిదే.

నరహరి కీర్తనలో నానిన మా నాలుకలు పరుల నుతింపజాలవు. నరసింహుని కీర్తించే మా రసనం నరులను కీర్తింపదు. మురహరుని చరణాల వ్రాలి మ్రొక్కే మా తల పరుల పాదాలకు వ్రాలదు, వంగదు.

శ్రీపతినే మా హస్తాలు అభ్యర్థించగలవు. శ్రీరమణుని పూజించే మా చేతులు యాచనకు దిగజారవు. శ్రీమహావిష్ణువంతటివాడు మేమొనర్చిన షోడశోపచార పూజలు స్వీకరిస్తాడు. అప్పుడు గూడా మా చేయి పైనే ఉంటుంది. అటువంటి మా చేతులు యా చనకై నరుల ముందుకు సాగుతాయా? సాగవు. పరమోత్సాహంతో హరి వద్దకు భూలో క వైకుంఠమైన తిరుమలపై వెలసిన శ్రీనివాసుని వద్దకు పరుగు పెట్టే మా పాదాలు పాపుల యిళ్ల దిక్కుగా ఒక అడుగు కూడా వేయవు.

శ్రీ వేంకటేశ్వరుని అహర్నిశలూ 'పానీయంబులు ద్రావుచున్ కుడుచుచున్, భాషించుచున్ హసలీలా నిద్రాదులు సేయుచున్ ఏయే వేళల ఏయే కర్మలొనరిస్తే ఆయా వేళల ఆయా  పూజలని శ్రీహరికి కాగలవని, చింతింతే మనసు ఇతర విషయాసక్తికి లోనుగాజాలదు. పరమేశ్వరుడైన ఆ తిరువేకంటేశ్వరుని అధీనమైన మాధనమాన ప్రాణ మనోవాక్కులన్నీ ఆ స్వామికే ఏనాడో సమర్పితం. అటువంటి తనువు ఇతరుల అధీనం ఎన్నటికీ కాదు. ఎవరికీ మాపై అధికారం లేదు. అన్న అన్నమాచార్యుల ఈ సంకీర్తన విని రాయలు ఆగ్రహించి మూరురాయరగండ ముద్రగల సంకెల వేయించి ఆచార్యులవారిని మొగసాలలో కూర్చోబెట్టాడు.

ఆ రాజు పాపం అజ్ఞాని.

విశ్వేశ్వర మజం దేవం జగతః ప్రభుమవ్యయం
భజన్తియే పుష్కరాక్షం నతే యాన్తి పరాభవం
నతేయాన్తి పరాభవం ఓంనమన్నతి

అనీ, విష్ణు భక్తులకు పరాభవం ఉండదనీ అప్పటికింకా అతనికి తెలియలేదు.

మాయామాళవగౌళ - చతురశ్ర ఏక

తందనాన ఆహి - తందనానపురె
తందనాన భళా - తందనాన

బ్రహ్మమొక్కటే పర - బ్రహ్మమొక్కటే
బ్రహ్మమొక్కటే పర - బ్రహ్మమొక్కటే

కందువగు హీనాధి - కములిందు లేవు
అందరికి శ్రీహరే - అంతరాత్మ
ఇందులో జంతుకుల - మింతా నొక్కటే
అందరికి శ్రీహరే - అంతరాత్మ.

నిండార రాజు నిద్రించు -నిద్రయునొక్కటే
అండనే బంటు నిద్ర - అదియునొకటే
మెండైన బ్రాహ్మణుడు - మెట్టు భూమి యొకటే
చండాలు డుండేటి - సరి భూమి యొకటే

కడగి యేనుగుమీద - గాయు నెండొకటే
పుడమి శునకము మీద - బొలయు నెండొకటే
కడు పుణ్యులను పాప - కర్ములను సరిగావ
జడియు శ్రీవేంకటే - శ్వరు నామ మొక్కటే

అన్నమాచార్యులు అద్వైతి అన్న మాటను ఈ సంకీర్తనలోని అద్వైతతత్వం బలపరుస్తుంది. బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే అని ఉద్ఘాటించారు అన్నమాచార్యులు. ఏకం సత్ - విప్రా బహుధావదంతి అని తత్ప్రమాణం.

సృష్టిలో ఉన్న న్యూనాధికతలు, ఎక్కువతక్కువలు లేని చోటు ఒక్కటే - పశుపక్షి మత్స్యాది జీవకోటికి సమత్వం సిద్ధించేది భగవత్సన్నిధిలో మాత్రమే. ఆ శ్రీహరి జగదంతరాత్ముడు గనుక జగత్తంతా ఒక్కటే.

రాజుకీ సేవకునికి - తదితర పశుపక్ష్యాదులకూ ఆహార నిద్రాభయమైథునాలు తుల్యాలు. ఈ విషయాన్ని గుర్తించేవారు పండితులని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముని

ప్రబోధం.

విద్యావినయ సంపన్నే బ్రాహ్మణేగ విహస్తినీ
శుని చైవశ్వపాకేచ పండితాస్సమదర్శినః అన్నగీతావాక్యార్థమిదే.

ఏనుగు మీద గాసినా, కుక్కపైన ప్రసరించినా ఎండ ఒక్కటే. గర్భేష్వం భోరుహాణాంశిఖరిషుచ శితాగ్రేషుతుల్యం పతంతః అని సూర్యశతకం. తామర బొడ్డులో నూ, పర్వతశిఖరపు వాడి అగ్రంపైనా తుల్యంగానే పడుతుంది సూర్యకాంతి.

పుణ్యులైనా పాపకర్ములైనా ఎవ్వరైనాగానీ వారికి ఐహికాముష్మిక రక్షణ నిచ్చేది, ఇవ్వగలిగినది శ్రీవారితిరునామమే, శ్రీవేంకటేశ్వరుడే బ్రహ్మం - పరబ్రహ్మం. అదీ ఇదీ ఒక్కటే అంటూ తందనానల చిందులువేస్తూ అద్వైత్వాన్ని అందలమెక్కించారు అన్నమా చార్యులు.

హంసధ్వని - ఆది

తానేకాకెవ్వరు మాకు - దాతయుదైవము
లోనబెట్టుకొని మాకు - లోనైనవాడు

చదివించి, కూడువెట్టి - జారకుండ నిల్లు గట్టి
బెదురులేని బుద్ధి - పిన్ననాడే చెప్పి
యెదిరినడిగి ద్రవ్య - మిది గొమ్మనుచునిచ్చి
పదిలమై మమ్ము - బాలించువాడు

మోహవియోగమ్ము - మోహానురాగమ్ము
దేహవిభాగంబు - దెలిసిన కలికి
ఐహికమున వేంకటాచ - లాధీశుడైసర్వ
దేహరక్షకుడై - తిరుగుచున్నాడు

అన్నమాచార్యులు దశావతారవర్ణనలో పాటించిన వైవిధ్యం, కల్పించిన వైచిత్రి అపూర్వమైనవి. ఆయన దశాధిక విధాల వర్ణించిన దశావతార సంకీర్తనలలో దశగణిత దశావతారుడైనాడు శ్రీవేంకటేశ్వర స్వరూప శ్రీమహావిష్ణువు. అల్పశబ్దంలో అనల్పార్థాన్ని ధ్వనింపజేసే మహాకవి కవితావైదగ్ధ్యమూ, తల్లిదండ్రులకు తనఎడగల ప్రేమాభిమానాలగూర్చి అప్యాయంగా, ముద్దు ముద్దు మాటలలో చెప్పు కొనేచిన్న అమాయకపు బాలకుని మౌగ్ధ్యమూ, విష్ణుతత్వాన్ని ఆమూలాగ్రం ఆకళింపు చేసుకున్న జ్ఞానయోగి భక్తిస్నిగ్ధతా ఈ సంకీర్తనంలో తొణికిసలాడుతున్నవి.

పాండురంగ మహాత్మ్యంలో రసజ్ఞకవిశేఖరుడు తెనాలి రామకృష్ణుని దశావతార వర్ణనమొక సీసపద్యం వున్నది. ఆ పద్యంలో అవలంబింపబడిన విధానంకూడా అత్యంత రమణీయమైనది.

సీ॥ నీటితో జివుకక నిలిచి క్రుమ్మరుపూన్కి
కఠిన కర్పరపు చుక్కాని బిగువు
దంష్ట్ర నెత్తిన మహీతలపుగాడుపు జీర
యురుదారు కలనయం దుదయమగుట
పరులకు తనకట్ల బలిమి చూపు విధంబు
పులిమిన నెత్రు గుగ్గిలపు నూనె

ద్వీపాంతరమునకు దెగువమైజనుపెంపు
చేముట్టు నాగంటి జీని తగులు
సౌగతాగమ మాలిమి శాస్త్రసరణి
వల్గు వలన చిత్ర దావనముగల్గు
నిన్నుదరిసేసి భవవార్ధి నిస్తరించి
దరిదరియకున్న గలదె ముదము

శ్రీమహావిష్ణుని దశావతారాల ఓడగా చిత్రించాడు రామకృష్ణుడు.

పద్యతాత్పర్యమిది.

శ్రీమహావిష్ణువు ఒక పెద్ద నావ. ఆ నావ నీటిలో చివికిపోకుండా, నానినా చెక్కు చెదరకుండా తిరుగుతూ ఉంటుంది. (మీనావతారం) దాని చుక్కానిగట్టి చట్రంలో బిగింపబడి (వీపు కఠినం - కూర్మావతారం), భూమిని కోరతో పైకెత్తినట్లు ఆనావ తెరచాప రెపరెపలాడుతుంది. (వరాహావతారం) కొయ్యస్తంభాలవల్ల నావ రూపుదిద్దు కుంటుంది. (నృసింహావతారం)

తన కట్టుబడి - మూడడుగులు నాకు సర్వజగమూ అన్న మాట అంతటి బలం గల దో బలికి చూపించిన వామనుడని ధ్వని - పూర్వకాలంలో నావలన పెద్ద పెద్ద కొయ్య దుంగలు చేర్చి బలమైన మోకులతో కట్టి బిగించేవారు. నావలోని కొయ్యదుంగల కట్టుబ డికీ వామనుడి మాటకట్టుబడికీ అభేదం. నావ అడుగుభాగాన, (పక్కలాఉన్న ఉపరితలా లకూ, మేకులవంటి లోహపు వస్తువులకీ తడి అంటి నిప్పు పట్టకుండా గుగ్గిలం నూనె వాడేవారు. అది ఎఱ్ఱగా ఉంటుందేమో రక్తం వరద కట్టించిన పరశురామత్వపు సూచ న, ద్వీపాంతరయానం చేసేది నావ ద్వీపాంతరం (శ్రీలంకకు)వెళ్లి జయించిన వాడు శ్రీ రాముడు. నావలంగరు నాగేటివలె ఉంటుంది. బలరాముడని వ క్రోక్తి, పడవపాట గీతా గానమై శాస్త్రాన్ని గీతగా బోధించిన శ్రీకృష్ణుడు, గుఱ్ఱపు స్వారీలాగ చిత్రమై కుదుపుల నా వ అది. (కల్క్యావతార ధ్వని) అలాటి నావపైన నిన్ను ఆశ్రయించి (ఎక్కి) సంసార సముద్రాన్ని దాటి,నీతో ఐక్యత చెందడమే బ్రహ్మానందం.

ఆ శ్రీవేంకటేశ్వరుడే కాక మాకు ఇంకెవ్వరు తల్లీ తండ్రీ. గురువూ మిత్రుడు మా సర్వస్వమూ శ్రీవేంకటేశ్వరుడు, ఆ శ్రీమహావిష్ణువు తనలోనే మమ్మందరినీ ఉంచుకొని మాఅందరి యందూ తానే నెలకొని ఉన్నాడు. అంటూ పల్లవిలో తిక్కనసోమయాజులు మహాభారతం శాంతిపర్వములో చెప్పిన భీష్మోక్తమైన విష్ణుమంత్ర ప్రభావ వివరణా ఘట్టంలో పద్యాన్ని పొదిగారు ఆచార్యులు.

హరియందేనును నాయం

దరయంగా హరియుగలము హరినాకునునా
హరికేను ననశ్వరులము
హరిప్రసాదోదయము మహత్తర మహిమన్:- ఈ పద్యంలో ఉన్నట్లుగానే జీవాత్మా పరమాత్మ లిద్దరూ ఒక్కటే. కానీ వారు రెండుగా భాసిస్తారు. ఇక్కడ 'హరి' 'నేను' అన్న పదాలకు పారమ్యమైన రూపం ఒక్కటే 'హరి'. ఈ విషయాన్ని సదాశివ బ్రహ్మేంద్రయతి ఒక కీర్తనలో ఇలా చెప్పారు.

తద్వజ్జీవత్వం బ్రహణి తద్వజ్జీవత్వం;;;;
యద్వత్తోయే - చంద్ర ద్విత్వం
యద్వన్ముకురే - ప్రతి బింబత్వం ॥ తద్వజ్జీవత్వం

ఏవిధంగా సరస్సునీటిలో చంద్రుడ రెండుగా గోచరిస్తాడో, ఎలాగైతే అద్దంలో ముఖం చూచుకుంటే మనకు ప్రతిబింబం గోచరిస్తున్నదో అదే విధంగా బ్రహ్మమొక్కటే ఒక్కటే. 'అంతర్బహిశ్చా నారాయణః' నిరంజనో నిష్కళంకో నిర్వికల్పో నిరాఖ్యాత శ్శుద్ధో దేవ ఏకో నారాయణః నద్వితీయో స్తికశ్చిత్ - య ఏవం వేద నవిష్ణురేవభవతి శుద్ధంగా ఈ సంకీర్తన పల్లవిలో అమర్చారు అన్నమాచార్యులు. చదివించి సోమకాసురుడెత్తుకొని పోయిన వేదవిజ్ఞాన సర్వస్వాన్ని వెతికి తెచ్చి యిచ్చి మాకు చదువు చెప్పించిన మీనావతారవిష్ణువు.
కూడువెట్టి - శరధి మథింపజేసి, హరిభక్తులైన దేవతలకు అజరామరమైన దివ్యాహారాన్ని, అమృతాన్ని తెచ్చియిచ్చిన కూర్మావతార విష్ణువు. (మేమూ (జగత్తంతా) హరిభక్తులమే. మాకూ యిచ్చాడు అమృతం హరి పదధ్యానామృతం, హరినామగానామృతం.)
జారకుండ నిల్లుగట్టి - ఈ భూమి సముద్ర పతనం కాకుండా గాపాడిన వరాహస్వామి
బెదురులేనిబుద్ధి పిన్ననాడే చెప్పి - ముల్లోకాలనూ గెలిచి, గడగడ లాడించిన
హిరణ్యకశిపుడంటే ఏమాత్రమూ భయములేని బుద్ధిని గర్భస్థ శిశువుగా ఉండగానే నారదునిచే చెప్పించిన నృసింహావతార విష్ణువు.
యెదిరినడిగి - శత్రువైన బలిని మూడడుగుల నేల దానమిమ్మన్న వామనావతార వర్థిష్ణువు:
ద్రవ్యమిది గొమ్మనుచునిచ్చి - బ్రాహ్మణులందరికీ భూమినంతా దానమిచ్చిన పరశురామ రూప శ్రీమహావిష్ణువు.
పదిలమై మమ్ము పాలించువాడు - జగత్తంటటికీ శ్రీరామరక్షగా రాజ్యమేలిన శ్రీరామధర్మ వర్తిష్ణువు.
మోహవియోగంబు - నిత్యం తీర్థయాత్రలకేగే బలరామ నిర్మోహచరిష్ణువు.
మోహానురాగంబు - విశ్వమంతటినీ మోహింపజేసే కృష్ణావతార రమాలంకరిష్ణువు.

దేహవిభాగంబు - స్త్రీశరీరం, పురుషదేహమూ కూడా కలిగిన కల్క్యవతార జిష్ణువు.

అతడే నేడు శ్రీవేంకటాచలపతియై జగద్రక్షణా దురంధరుడై ప్రపంచమంతా వ్యాపించి ఉన్నాడు.

అన్నమాచార్యుల ఈ దశావతార సంకీర్తనం తర్వాత కవులకు రామకృష్ణుని వంటి వారికి, ఆదర్శమూ మార్గదర్శకమూ అయినదనడం సత్యదూరం కాజాలదు.



వకుళాభరణం - రూపకం

తెప్పగా మఱ్ఱాకు మీద - తేలాడు వాడు
ఎప్పుడు లోకములెల్ల నేలేటి వాడు

మోత నీటిమడుగులో - ఈతగఱచినవాడు
పాతగిలే నూతిక్రింద - బాయనివాడు
మూతిదోసి పట్టి మంటి - ముద్దపెల్లగించు వాడు
రోతయైన పేగుల పే - రులు గలవాడు

కోడికూత నోరివాని - కుఱ్ఱతమ్ముడైన వాడు
బూడిద బూసిన వాని - బుద్ధులవాడు
మాడవన్నె తేడివెంట - మాయల బడినవాడు
దూడల నావులగాచి - దొరయైనవాడు

ఆకసాన బారేవూరి - అతివల మానములు
కాకు సేయువాడు తుర - గముపైవాడు
ఏకమై వేంకటగిరి - నిందిరా రమణి గూడి
యేకాలము బాయని - యెనలేని వాడు

ప్రళయ జల వలయంలో వటపత్రంపై తేలియాడుతున్న సర్వలోకాల నిత్య రక్షకుని దశావతార స్తోత్ర సంకీర్తనం ఇది.

మోతనీటి మడుగులో ఈత గఱచినవాడు : ప్రళయాంబుధిలో మీనమై సోమకాసురాహృతమైన శ్రుతులను తిరిగి తెచ్చిన మీనావతార శ్రీమహావిష్ణువు.

పాతగిలే నూతిక్రింద బాయనివాడు : కూర్మం (తాబేలు) పురాతనమైన నూతులలో నివసిస్తుంది. క్షీర సాగరం పాత నూయిగా, ఆ తాబేలు కూర్మావతార విష్ణువుగా చిత్రితం.

మూతి దోసి పట్టి...
:- తన దంష్ట్రతో భూమీస్థలిని సముద్రంలో పతితం కాకుండా పైకెత్తి రక్షించిన వరాహావతార విష్ణువు.

రోతయైన పేగుల పేరులగలవాడు : - హిరణ్యకశిపుని గుండె చీల్చి, ప్రేవులు హారమాలికలుగా అలంకరించుకొన్న నర సింహ విష్ణువు.

కోడికూత నోరివాని కుఱ్ఱ తమ్ముడైనవాడు :- అహల్యా వంచనకై కోడిలాకూసిన ఇంద్రుని చిన్న తమ్ముడు వామనుడని వక్రోక్తి.

బూడిదబూసినవాని బుద్ధుల వాడు :- విభూతి రేఖలు దాల్చిన పరశురాముడు.

మాడవన్నె లేడివెంట మాయల బడినవాడు :- బంగారు లేడి వెంటబడిన శ్రీరామచంద్రుడు.

దూడల నావులగాచి దొరయైనవాడు :- గోపాలకుడైన బలరాముడు.

ఆకసాన బారేపూరి - కాకు సేయువాడు :- గొల్లకన్నెల మనోమానచోరుడైన గరుడాధిరూఢుడు - శ్రీకృష్ణుడు

తురగముపైవాడు :- గుఱ్ఱమెక్కి కూర్చున్నవాడు. కల్క్యవతారము. దశావతారములెత్తిన ఇతడే శ్రీవేంకటగిరిపై ఇందిరాదేవితోకలసి శాశ్వతుడైన, అద్వితీయు డైన శ్రీమహావిష్ణువు.

పాడి - ఝుంప

తొల్లి కలవే యివియు - తొల్లి తాను గలడే
కల్లయును గాదు యిది - కడు నిజము గాదు

కను దెరచినంతనే - కలుగు వీ జగము
కను మూసినంతనే - కడు శూన్యమౌను
కనురెప్ప మరుగుననె - కలిమియు లేమియు
తన మనో భావనల - దగిలి దోచీని

తలచినంతనె యెంత - దవ్వైన గాన్పించు
తలపు మరచిన మదికి - దట్టమౌ తమము
పొలసి మతి మరుగుననె - పుట్టుటలు పోవుటలు
పలుచంచల వికార - భావమీ గుణము

ముందు తాగలిగితే - మూడు లోకములు గల
వెందు తా లేకుంటె - యేమియు లేదు
అంది శ్రీ వేంకటేశు - నాత్మలో ననె వీడె
కందువల నీతని సం - కల్ప మీ పనులు

నర పరంగా, నారాయణ పరంగానూ శబ్దంలోని అర్థశ్లేషా భేదాలచే ఏర్పడిన మహా సూక్త సంకీర్తనమిది. నర పరంగా అర్థం ఇది. ముందు జీవుడున్నాడా ? జీవుడున్న ప్పుడు ఉన్న ఈ వస్తు విషయ వ్యామోహాదులు జీవుడు లేనప్పుడు ఉన్నవా ? ఇది నిజమా, అసత్యమా, అని ప్రశ్న. ఇది అసత్యము కాదు. (పంచేంద్రియ జ్ఞానం చేత తెలి యబడుతున్నవన్నీ కేవలం మిధ్య అని ఎలాగ అనగలం ?) ఇది నిజం కూడా కాదు. (తను లేనప్పుడు ఏమి ఉందో ఎలా తెలియటం ? తను లేకపోతే ఈ సృష్టి అసత్యమన్న మాట).

జీవుడు ఉదయించగానే ఈ విశ్వంఅంతా (అతడికి సంబంధించినంతవరకూ ఉ దయిస్తుంది. క్రమ పరిణామంగా తెలియబడుతుంది. జీవుడు మరణించగానే ఒక్కసారి అంతా శూన్యమే. జీవుని ఈ ఈక్షణాశక్తి యొక్క అస్తిత్వ రాహిత్యాల వల్లనే ఉన్నది - లేని ది - అన్న భావం కలిమి, లేమి అన్న ఊహా కలుగుతున్నాయి. ఈ భావం జీవుని భ్రమ, నిజమూ కాదు - అవాస్తవమూ కాదు. ఈ భ్రమ జీవుని మనసు ఆక్రమించి అల్లరి చేస్తూ ఉన్నది.

ఈ మనసు - మతి యెటువంటిది ? - భావ మాత్రం చేత ఎంత దూరమైనా ప రిగెట్టగలదు. ఎంత దూరమైనా చూడగలదు. భావం లేకపోతే మతికి అంతా అంధకార మే. అగమ్యగోచరమే. ఈ భ్రమించిన మనో బుద్ధుల చాటున జనన మరణాలు సంభవి స్తున్నవి. (నిజంగా చావు పుట్టుకలు అన్నవి లేవు. అది భ్రమ,శక్తి ద్రవ్యరాశిగానూ, ద్రవ్య రాశి శక్తి గానూ పరివర్తనం చెందుతున్నది అంతే అని శాస్త్రజ్ఞుల వాదం. $E=MC^2$ అన్న Albert Einstein సిద్ధాంతాన్ని తిరగవేస్తే $M = E/C^2$ అవుతుంది. E అంటే శక్తి సర్వస్వం. M అంటే ద్రవ్యరాశి సర్వం. $C^2$కాంతి వేగాన్ని కాంతి వేగంతో గుణిస్తే వచ్చే లబ్దం వేగంగా గల కాంత్యుత్తర పదార్థ శక్తి) జననమరణాలు సత్య మని నమ్మించే గుణం బుద్ధికి జ్ఞానేంద్రియాల ద్వారా కలుగుతున్న వికారమే కాని సత్యం కాదు.

అస్తిత్వానికి వస్తే ముందు తాను (జీవుడు) ఉంటే ముల్లోకాలూ ఉన్నవి. లేకపోతే ఏమి ఉన్నది ? ఏమీ లేదు జగత్సర్వం తానే అయినాడు శ్రీవేంకటేశ్వరుడు. ఆయనలోనే ఉన్నవాడు ఈ జీవుడు ఇరువురూ అన్యులుగా భాసించినప్పటికీ ఏకస్థులే. ఈ సృష్టి ఈ భ్రమలు అన్నీ ఆ తిరుమలేశుని ఇచ్ఛవల్ల కల్గుతున్నవని జీవుడు ఆ విషయం గ్రహించవల సినదనీ నరపరంగా అర్థం.

ఇక నారాయణపరంగా -

ముందు, అన్నిటికన్నా ముందు ఏముంది ? ఈ సృష్టి ఉందా ? అసలు తాను ఉన్నాడా నారాయణుడు ? ఇది నిజమా, కల్లా ? రెండూ కాదు, రెండూనూ ఋగ్వేదం లో నాసదాసీ సూక్తం ఉన్నది.

ఓం 'నాసదాసీన్నోసదా సీత్తదానీం నాసీద్రజో నోవ్యోమో పరోయత్
కిమావరీవః కుహకస్య శర్మన్నంభః కిమాసీద్గహనం గభీరం'
"నమృత్యురాసీదమృతం నతర్హి నరాత్ర్యా అహ్న ఆసీత్ ప్రకేతః"

సృష్టికి పూర్వం ఏమి ఉన్నది? ఏమీలేదు. ఎందువల్ల? ఈ ప్రశ్నోత్పత్తికి కూడా అవ కాశంలేక ఏమీలేని స్థితి, నిః స్థితి నిస్థితి ఉన్నది. ఈ నిస్థితినుండి నారాయణుడు - సం కల్పశక్తిగలిగిన బ్రహ్మసామర్థ్యం ఆవిర్భవించాడు. (ఈ బ్రహ్మసామర్థ్యం ఉపసంహృతమై తిరిగి నిస్స్థితి ఏర్పడుతుంది. సర్వమూ అందు లయిస్తుంది. ఆకాశంకూడా లయిస్తుం దని శంకరుల ఉవాచ. The State of Absolute Negation. Negation is the Origin of Creation అని ఆధునిక భౌతిక శాస్త్రం చెప్తున్నది. )

నారాయణుడు సంకల్పించగా మనసు ఏర్పడి, అందునుండి పంచభూతములు ఏర్పడి జగ న్ని ర్మాణ సామగ్రి ఏర్పడింది.

"తస్మాద్వా ఏ తస్మాదాకాశ స్సంభూతః ఆకాశాద్వాయుః వాయోరగ్నిఃఅగ్నే రాపః

అద్భ్యః పృథివీ పృథివ్యా ఓషధయః ఓషధీభ్యోన్నమ్ అన్నాత్పురుషః" అని తైత్తిరీయోపనిష ద్వాక్యం. విరాట్పురుషుడైన నారాయణుని సంకల్పం. ఆయన కామన ప్రకారంగా చేతనా చేతన జగత్సృష్టి ఏర్పడ్డదని నారాయణోపనిషత్ చెపుతున్నది. " ఓం అథపురుషోహవై నా రాయణో కామయతా ప్రజాస్సృజేయేతి నారా యణాత్ప్రాణో జాయతే మనస్సర్వేంద్రియాణి చ. ఖంవాయుర్జ్యోతిరాపః పృథివీ విశ్వస్యధారిణీ" ఇత్యాది ఉపనిషద్వాక్య ప్రమాణాలనను సరించి అసలు  నారాయణుడు లేడు. నిస్థితి మాత్రమే ఉన్నది. ఈ జగమంతా నిస్స్థితి లోంచి వచ్చిన బ్రహ్మసామర్థ్యం అనే నారాయణుని సంకల్పం నుండి ఉద్భవించినది. మరి ఇదంతా ఏమిటి నిజమా-కల్లా అంటే ఇదంతా సాపేక్షంగా - నిజము. సాపేక్షంగా మిథ్య. గజంమిథ్య అంటే పలాయనం కూడా మిథ్య అన్న శ్రీశంకరుల ప్రతిపాదన ఇటువంటిదే సాపేక్ష సత్యాసత్యాల సంధ్యాసమయంలో సర్వచరాచర విశ్వమూ సంచరిస్తున్నదని శం కరులు సెలవిచ్చిన విశేషమిదే.

జగదుత్పత్తి క్రమవివరణ చిత్తిపన్నంలోని పురుషసూక్తంలో పేర్కొనబడ్డది. పురుష సూక్త పూర్వచర్చ నాసదాసీ సూక్తంలో కూర్చబడ్డది. పల్లవిలోనే ఈ రెండింటి సారాంశాన్నీ సూచనప్రాయంగా, వక్రోక్తిగా, రహస్యంగా చెప్పిన అచతుర్వదనుడైన బ్రహ్మ పదకవితా పితామహుడు.

ముందుగా ఆ నిస్థితిలో ఉదయించే నారాయణుడు కనుదెరచితే సంకల్పిస్తేనే ఈ సృష్టి ఏర్పడింది. ఆ నారయణుడు కన్ను మూస్తే వికల్పిస్తే సృష్టి అంతా ఆయనలో లీనమౌ తున్నది. ఘనద్రవవాయ్వాకాశ తదితర రూపమైన పదార్థ వస్తువులన్నీ తమ అస్తిత్వాన్ని కో ల్పోయి సృష్టికర్తృత్వ తత్వంలో ఐక్యమవుతున్నాయి. నారాయణుని కనురెప్పమరుగులోనే - ఆవిరాట్పురుషుని సంకల్పముల ఛాయలో సృష్టియొక్క అస్తిత్వనాస్తిత్వములు ప్రకటిత మౌతున్నవి. శ్రీమన్నారాయణుని మనోభావాలకు అనుగుణంగా ఆయన సంకల్పేచ్ఛా నిరీ చ్ఛలనుబట్టి జగత్పర్వం ఉన్నది లేదు అన్న విషయం జిజ్ఞాసువులైన బ్రహ్మజ్ఞానులకు తోస్తు న్నది.

ఆయన సంకల్పమాత్రంచేత అనంతమైన విశ్వాంతరాళాలలోకి కోట్ల కోట్ల కాంతి సంవత్సరాల సుదూర వైశాల్యాలకు ఈ సృష్టి విస్తరిస్తున్నది. సంకల్పరాహిత్యం చేత తన అస్తిత్వాన్నంతటినీ కోల్పోయి కాంతిహీనమైన అంధకారబంధుర నాస్తిత్వంలోనికి ఈ సృష్టి జారిపోయి లయిస్తున్నది.

ఆ అనంతస్వరూపుని యిష్టానిష్టాల మీదనే సృష్టిలోని సర్వప్రాణుల పుట్టుకలూ, మ రణములూ నిర్ణీతమై ఉన్నవి. ఈ విషయం ఎరుగని ప్రాణులు తమ జననజీవన శరణాల

కు మూలం వేరే ఏదో అని భ్రమిస్తున్నారు. అటువంటి భ్రమలు కల్గజేసే సృష్టికర్త మాయా మహాత్మ్యం ఇది.

నారాయణుడుంటేనే సృష్టి లేకపోతే ఏమీలేదు. నాసదాసీత్ అని ఋగ్వేదంలో రచించినట్లు. ఈ నారాయణుడెవరు - ఆయనే శ్రీవేంకటేశ్వరుని యాత్మ. ఆయనే శ్రీవేంకటేశ్వరుని సమగ్రస్వరూపం. ఆ నారాయణుడే శ్రీ వేంకటేశ్వరుడు. ఈ సంకీర్తన లో పైన పేర్కొనబడ్డ విషయమంతా ఈ సంకీర్తన. ఇది పాడే, చదివే వినే వారితో సైతం అంతా శ్రీమన్నారాయణుడే అతని సంకల్పమే ఈ సర్వమూ యఏవంవేద ఇత్యుపనిషత్ అని సంకీర్తనాచార్యులు నాసదాసీన్నారాయణోపనిషత్తులను సంకీర్తనగా సంతరించి, ఆంధ్రవేదసామగానం ఆలపించారు అన్నమాచార్యులు.

మధ్యమావతి - మిశ్రచాపు

వాడల వాడలవెంట - వాడెవో
నీడనుండి చీరలమ్మే నేత బేహారి

పంచ భూతములనెడి - పలువన్నెనూలు
చంచలపు గంజితోడ - చరినేసి
కొంచెపు కండెల నూలి - గుణములనేసి
మంచి మంచి చీరలమ్మే - మారుబేహారి

మట మాయముల దన - మగువ పసిడినీరు
చిటిపొటి యలుకల - జిలికించగా
కుటిలంపు జేతలు - కుచ్చులుగా గట్టి
పటవాళి చీరలమ్మే - బలుబేహారి

మచ్చికజీవుల పెద్ద - మైల సంతలలోన
వెచ్చపు కర్మధనము - విలువచేసి
పచ్చడాలుగా గుట్టి - బలువేంకటపతి
యిచ్చకొలదుల నమ్మే - యింటిబేహారి

తెనాలి రామకృష్ణుని 'దశావతారములఓడ' వంటిది ఈ సంకీర్తనలోని ప్రతి వస్తూపమలంకారం:-

శ్రీవేంకటేశ్వరుడి కీర్తనలో నేత బేహారి - బట్టలునేసి, కుట్టి అమ్మే వ్యాపారి అయ్యాడు. వాడల వాడల వెంట - జగత్తంగా - నీడనుండి - తనమాయాఛాయలో తానుండి - మాయ అనే నీడలో ఉండి - చీరలమ్ముతున్నాడు.

పంచభూతాలనే పంచరంగులు నూలును - చాంచల్యమనే గంజిపెట్టి పడుగూ, అరిషడ్వర్గపు గుణాలతో పేకా - నిలువూ అడ్డమూ - నేసి మంచిమంచి చీరలమ్ముతున్నాడు. వింత వింత శరీరాలను విక్రయిస్తున్నాడు జీవులకు.

ఆ చీరలకు బంగారు జరీ పోగులకుచ్చులు ఏర్పడ్డాయట ఏమిటవి ? కడు మాయగత్తె అయిన ఆయన ఇల్లాలు లక్ష్మీదేవి తన కోపపు కంటినీరు చిలికిస్తే ఆ పసిడిమగువ కన్నీళ్ళు బంగారు పోగులైనాయట. వాటితో కుటిలపు పనులు కుచ్చులుగా కుట్టి అమ్ముతున్నాట్ట జీవులకు ఆ మాయవ్యాపారి.

తనకు సహజమైన తన సృష్టిస్థితి క్రియానైపుణ్యంచేత నిర్వహించబడుతున్న జీవుల జననమరణాల అమ్మకపు కొనుగోళ్ల అపవిత్రమైన సంతలలో - వారివారి కర్మ డబ్బుగా విలువగట్టి, వారివారి కర్మానుసారం వారికి అర్హమైన జన్మలు అనే ఉడుపులుకుట్టి యింటింటా దిరిగి అమ్ముతున్నాడట శ్రీవేంకటపతి రూపుదాల్చిన ఆమాయనేతల చేతలవాడు. ఆయన యిచ్చకొలది, సంకల్పం మేరకు జీవుల జననమరణ పునర్జనన పునర్మరణా లేర్పడు తున్నవని ధ్వని - ఈ 'అంగడి అమ్మకాల' ప్రయోగం కవిబ్రహ్మ తిక్కన సోమయాజులు కూడా కావించారు.

ప్రణమదవన విద్యా ప్రౌఢ సంరూఢ కాంతి
ప్రణుత చరణ పద్మా; పద్మజా దిత్యసత్పో
షణ చతురదయా విస్ఫారితాలోక లోకా
పణనిపుణ జనాంచద్భక్తి విక్రీతమూర్తీ!

ప్రపంచమనే అంగడిలో నేర్పరులైన వారి భక్తి అనే సొమ్మునకు అమ్ముడుపోయిన స్వరూప స్వభావముగలవాడా ? అని హరిహరాకార పరబ్రహ్మానికి సంబోధన. సూక్ష్మోక్తి కవిబ్రహ్మది. విశదోక్తి పదకవితాబ్రహ్మది.

శ్రీరాగము - ఝంప

వలపులధికము సేయు - వైభవములు
తలపులధికము సేయు - దలపోతలు

కోపమధికము సేయు - కోరికలు
తాపమధికము సేయు - తదుకంబులు
కోపంబు తాపంబు - గూడ నధికము సేయు
యేపయిన మోహముల - నేమందమే

మచ్చికధికము సేయు - మన్ననలు
యిచ్చలధికము సేయు - నీరసములు
మచ్చికలు నిచ్చలును - మగుడ నధికము సేయు
నెచ్చరిక కూటముల - నేమందమే

అందమధికము సేయు - నైక్యములు
పొందులధికము సేయు - పొలయలుకలు.
అందములు పొందులును - నలర నధికము సేయు
నెందు నరుదగు శ్రీ వేంక - టేశు కృపలు

అలమేల్మంగా శ్రీ వేంకటేశ్వరుల అన్యోన్య దాంపత్యం ఈ సంకీర్తనలోని వస్తువు, నిత్యయౌవన అలమేల్మంగ. పాతకొత్తలు లేని త్రికాలస్వరూపుడు ఆ స్వామి. వారిరువురి ప్రత్యేక వైభవాలూ పరస్పరం వలపులని హెచ్చిస్తున్నవి. వలపు తలపులు ఎన్ని తలచినా పాతగిల్లక (వారు నిత్యులు కాబట్టి) కొత్తతలపులు ఉత్పన్న మౌతూనే ఉన్నాయట పుంఖాను పుంఖాలుగా 'నవతా దూర పురాణతా నుపగతా' అంటారు తిక్కనగారు కొత్త పాతలు లేని పరతత్వాన్ని.

పరస్పరం వారిద్దరకూ ఎన్నో ముచ్చట్లున్నాయి. అవి తీర్చుకొనే వ్యవధి లేదు (వారిద్దరూ కాలరహితులేగద) తీరని ముచ్చట్లవల్ల కోపాలు వస్తున్నాయట. కోపాలవల్ల తమకములు, (అతిశయించిన తీరని కోర్కెలు) అధికమైన తాపాన్ని కలుగజేస్తున్నవి. కోపతాపాల రెండింతలు చేస్తున్న వీరి పరస్పరమోహానురాగాల నేమనవచ్చు ? ఏమనగలం ? ఏమని వర్ణింపగలం ?

వారిద్దరూ పరస్పర గౌరవాదరణలున్నవి వాటివల్ల వారిమధ్య మైత్రి ఇనుమడిస్తున్న ది. తమ ఇచ్ఛలన్నిటికీ పూర్తి యిష్టాపూర్తి కాకపోయినందున వారికి అలసటా నీరసమూ వచ్చాయి. కాని ఆ నీరసం, అలుపూ వల్ల యిచ్ఛలు యింతకు యింతయ్యాయి గాని ఏ మాత్రం తగ్గలేదుట. వారుభయులకు పరస్పర మైత్రినీ, మర్యాదలనూ మాటిమాటికీ ఉజ్జృంభితం చేసే, ఒకరికొకరు హెచ్చరించుకొని కలసే కలయికల నేమనవచ్చు ? ఏమ నగలం ? ఏమని వర్ణింపగలం ?

వారి ఐక్యత ఉన్నదే అది వారుభయుల సౌందర్యాలనూ శతగుణితం చేస్తున్నది, వారి పరస్పరమైన అందాల పోటీలో పొలయలుకల వల్ల వారి సంభోగ శృంగారం సహస్ర గుణితమై అలరుతున్నది. అరుదైన వేంకటేశుని దయవల్ల ఇలా జరుగుతోంది గాని ఏమనవచ్చు ? ఏమనగలం ?  ఏమని వర్ణింపగలం ?

వారి ఐక్యత ఉన్నదే అది వారుభయుల సౌందర్యాలనూ శతగుణితం చేస్తున్నది, వారి పరస్పరమైన అందాల పోటీలో పొలయలుకల వల్ల వారి సంభోగ శృంగారం సహ స్ర గుణితమై అలరుతున్నది. అరుదైన వేంకటేశుని దయవల్ల ఇలా జరుగుతోంది గాని ఏ మనవచ్చు ? ఏమనగలం ? ఏమని వర్ణింపగలం వారికి వారే సాటి అంటూ అనన్వయా లంకార రసాభరణాన్ని అలమేల్మంగా శ్రీవేంకటేశ్వరులకు అలంకరించారు అన్నమాచార్యు లు.

ఆహిరి - ఆది

వననిధి గురిసిన - వానలివి మతి
పనిలేని పనుల - భారములు

అడవుల వెన్నెల - లారడి బదుకులు
తడతాకుల పరి - తాపములు
వొడలొసగిన హరి - నొల్లక యితరుల
బడి బడి దిరిగిన - బంధములు

కొండల నునుపులు - కొన కొన మమతలు
అండలకేగిన - నదవదలు
పండిన పంటలు - పరమాత్ము విడిచి
బండయి తిరిగిన - బడలికలు

బచ్చన రూపులు - పచ్చల కొలువులు
నిచ్చల నిచ్చల - నెయ్యములు
రచ్చల వేంకట - రమణుని గొలువక
చచ్చియు చావని - జన్మములు

హరిభక్తి లేనివారి జన్మ వ్యర్థం నిరర్థకం అని చాటారు అన్నమాచార్యులు ఈ కీర్తన లో.

హరిభక్తి రహితుని జన్మ ని ష్ప్రయోజనం. సముద్రంలో కురిసిన వర్షం వంటిది. మతిలేని, పనిలేని పనులవలె అత్యంత శ్రమదాయకం.

జన్మనిచ్చిన జగన్నాధుని విస్మరించి, నేను నావాళ్ళు అనుకొని తిరిగే బంధాలు మృ గతృష్ణలు. అటువంటి జన్మలు అడవిని గాచిన వెన్నెలలు.

పండిన పంటగా నున్న పరమేశ్వరుని విడచి మూర్ఖంగా ప్రాకులాడే జన్మలు నిరర్థ కం. ఆ ప్రాకులాటలు తాపత్రయాలు దూరపు కొండల నునుపులు. ఆధారం కొఱకై ఆకా శాన్ని పట్టుకొనే ప్రయత్నాల వంటివి.

లక్ష్మీనివాసస్థవాలు, హిరణ్యవర్ణాలు, నిత్యత్వమైత్రీ సంధాయ కమైన శ్రీవేంకటేశ్వర పదచర్చలు మాని యితరాన్ని వెదికేజన్మ జీవచ్ఛవపు జన్మ అంటున్నారు అన్నమాచార్యులు. ఈ కీర్తన వంటిది భాగవతంలో ఒక పద్యం పోతనగారిది ఉన్నది.

అంధేందూదయముల్ మహా బధిర శంఖారావముల్ మూకస
ద్గ్రంధా ఖ్యాపనముల్ నపుంసక వధూకాంక్షల్ కృతఘ్నావలీ
బంధుత్వంబులు భస్మహవ్యములు లుబ్ధద్రవ్యముల్ క్రోడస
ద్గ్రంధముల్ హరిభక్తి వర్జితుల రిక్తవ్యర్థ సం సారముల్

నరజీవనకు సార్థకతను సంతరించేది నారాయణ నామస్మరణ సంకీర్తనమేనని పోతనగారి ప్రహ్లాదు డన్నమాట. అదే అన్నమయ్యగారి పాట.

వరాళి - ఆదితాళం (ఖండగతి)

వెలయునీకల్యాణ - వేదిగా మతినుండి
కలికి జవ్వనపు యా - గము జేసెనతడు

మలయు నీనాభి హో - మపు గుండమునను
నెలకొన్న విరహాగ్ని - నిండాబోసి
పొలయు నీ నిట్టూ - ర్పుల విసరుచును
ఒలుకు జెమటల నా - హుతివోసె నతడు

కదిసి నీ నెన్నడిమి - గగనము నందు
పొదలిన యారుచే - పొగ నిండగా
మదిరాక్షి నీ మంచి - మానపు బసువు
నదనెఱిగి వేలిచె - నతివ నీకతడు

కాటుకకన్నుల నిన్ను - గడు నలయించి
బూటకముల చిటి - పొటి సిగ్గుల
గాటపు కరుణ వేం - కటగిరి విభుడు
కోటి హోమము సేసె - కూడి నిన్నతడు

ఇక (శ్రీవేంకటగిరి) నాయకుడు చేసిన కామయాగం. ఇదీ వైదికకర్మానుసారమే యజ్ఞద్రష్ట, ఉద్గాత అన్నమాచార్యులు. యాజి శ్రీవేంకటేశవిభుడు. యజ్ఞపశువు అల మేల్మంగ అనాఘ్రాత సుమత్వం. ఆమె సౌందర్య యౌవనానుభవమే యజ్ఞఫలం. హవిర్భా గాలు సర్వదేవతాస్వరూపులైన అలమేల్మంగా శ్రీవిభులకు చెలిసగంగా అతిశయించినవి. ఉద్గాత సంకీర్తనాచార్యులు అలమేల్మంగకు విన్నవిస్తున్నారు నిత్య కల్యాణ స్వరూపమైన నీమనస్సు కల్యాణవేదికగా, తనువు యజ్ఞవాటికగా నీవిభుడు జవ్వనపు జన్నము ఆడినా డమ్మా. నీ గంభీరనాభి అనే హోమగుండాన ఇన్నాళ్ల ఎడబాటుల నిప్పులు(విరహాగ్ని) నిం డించి రస శృంగారోర్ధ్వ తమైన నీ నిట్టూర్పుల గాలిచే (ఆ నిప్పుల మంటలను) విసరు తూ తదుష్ణ జాత ఘర్మాజ్యాన్ని ఆహుతి చేసినాడమ్మా తిరుమలేశుడు.

ఆకాశం వలె మిక్కిలి చిక్కిన నీ నడుమునడుమ యిటు పొదలిన రోమావళి అనే పొగ అలముకోగా (మరన మద ఘూర్ణిత నేత్రవై నీవున్నప్పుడు) నీ మంచి కన్యాత్వమనే పశువు అనువులను సమయమెరిగి హరించి యజ్ఞవిధి నిర్వహించినాడు.

కాటుక కన్నులతో నలరు నిన్ను మొగమోటపు మాటలతో, ప్రగల్భాలతో, ప్రధమ సమాగమపు చిరు సిగ్గుల నిన్ను గాఢమైన కృపతో శ్రీవేంకటపతి మిక్కిలిగా అలపు చెందించి, నిన్ను కంతుకేళి గలసి చౌశీతి రతి బందానుష్టానంగా పునః పునః కృతంగా కోటి హోమము, అఖండమైన హోమం ఆచరించాడు గదమ్మా అని ప్రధమ సమాగమపు సంభోగ శృంగారాన్ని వైదిక కర్మగా తీర్చిదిద్దినారు అన్నమాచార్యులు. సంభోగ శృంగారానికి ఉపకరణాలుండవు, 'క్రియాసిద్ధిః సత్వేభవతి మహతాం నోవకరణైః' అన్నది ప్రమాణంగా రత్యుపకరణాలన్నీ రతియజ్ఞోపకరణాలైనవి.

యజ్ఞంలో సామవేదతంత్రం నడిపేవాడు ఉద్గాత. సామవేదజం సంగీతం. సంగీతాంగం సంకీర్తనం. సంకీర్తనాచార్యులు తాము గనుక అన్నమయ్య ఈ శృంగార సంకీర్తనా యౌవన యాగద్రష్టా, ఉద్గాతా అయినారు.

భైరవి - ఆది

వీడెవో యిదె - వింత దొంగ
వేడి పాలు వెన్న - వెరజిన దొంగ

వెలయనీట జొప్పు - వేసేటి దొంగ
తలగాననీక - దాగు దొంగ
తలకక నేల - దవ్వేటి దొంగ
తెలిసి సందెకాడ - దిరిగేటి దొంగ

అడుగుకింద లోక - మడచేటి దొంగ
అడరి తల్లికినైన - నలుగు దొంగ
అడవిలో నెల - వై యున్న దొంగ
తొడరి నీలికాసె - తోనుండు దొంగ

మోసమింతుల జేయు - ముని ముచ్చు దొంగ
రాసి కెక్కిన గు - ఱ్ఱంపు దొంగ
వేసాల కిటు వచ్చి - వేంకటగిరిమీద
మూసిన ముత్యమై - ముదమందు దొంగ

వెన్నదొంగ చిన్నికృష్ణుడు ఆటలో అరటిపండుగా వేంకటగిరిపై శ్రీవేంకటేశ్వరుడైనాడు. ఆ చిన్ని వెన్నదొంగ దశావతారుడైన దొంగల దొంగ. అన్నమాచార్యుల ఈ కీర్తనలో శ్రీకృష్ణుడు వింతదొంగ శ్రీవేంకటేశ్వరుడు. దొంగ దశావతారాలెత్తినాడని చమత్కృతి.

ప్రళయ జల వలయపుటలలలో తేలియాడిన దొంగ (మీనం). మందరపర్వతం క్రింద దాగిన దొంగ ( కూర్మం). నీటినుండి భూమిని కోరతో త్రవ్వి తీసిన దొంగ (నరసింహం).

పాదముక్రింద జగత్తునంతటిని అదిమిన దొంగ వటువు వామనుడు. తల్లిమీద అలిగిన పరశురాముడు. అడవిలో కాపురమున్న దొంగ శ్రీరాముడు. నీలాంబర ధారియైన దొంగ బలరాముడు.

గోపస్త్రీలను వంచించిన మునిముచ్చు దొంగ శ్రీకృష్ణుడు. అశ్వాధిరూఢుడైన దొంగ కల్కి. లీలావిలాసంగా ఇప్పుడు శ్రీవేంకటాద్రిపైన మందిరంలో మూసిన ముత్యంలాగ దాగుడుమూతలాడుతున్న దొంగ పరమేశ్వరుడు. అని మనోజ్ఞ సుందరమైన దశావతార సంకీర్తనం సంతరించారు ఆచార్యులు.

చక్రవాకం రూపకం

విన్నపాలు వినవలె - వింతవింతలూ
పన్నగపు దోమతెర - పైకెత్తవేలయ్యా

తెల్లవారె జామెక్కె - దేవతలు మునులు
అల్లనల్ల నంత నింత - నదివోవారే
చల్లని తమ్మిరేకు - సారస్యపుగన్నులు
మెల్ల మెల్లనే విచ్చి - మేలుకొనవేలయ్యా

గరుడ కిన్నరయక్ష - కామినులు గములై
విరహపు గీతముల - వింత తాళాల
పరిపరి విధములను - బాడేరు రాగాల నిన్నదివో
సిరిమొగము దెఱచి - చిత్తగించవేలయ్యా

పొంకపు శేషాదులు తుం - బురు నారదాదులు
పంకజభవాదులు నీ - పాదాలు చేరి
అంకెలనున్నారు లేచి - అలమేలుమంగను
వేంకటేశుడా రెప్పలు - విచ్చి చూచిలేవయ్యా

యోగనిద్రలోనున్న శ్రీవేంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవా పురస్సరంగా ఈ మేలుకొలుపుల సంకీర్తనం సమర్పించారు అన్నమాచార్యులు. ప్రభూ! నీ శేషతల్పపు దోమతెర అయిన ఆదిశేషుని పడగని ఇంక పైకి ఎత్తు. ఎన్నో, ఎన్నెన్నో విన్నపాలు వింతవింతలైన సరళులలో నీకిప్పుడు విన్నవించనున్నాము.

తూర్పున సంధ్యారాగాలు తగ్గి, లేపొద్దు తెలిచాయలలముకొన్నవి. జాము గడచింది. నీ సేవాకైంకర్యాలకు నిర్జరులూ, ఋషులూ జంటజంటలుగా నీ అభ్యంతరమందిరం అంతటా నిండి ఉన్నారు. మెల్లమెల్లగా నీ చల్లనైన జలజాత దళాయత నేత్రాలు విచ్చి మేలుకో స్వామీ, నీకిదే మేలుకొలుపు.

గరుడయక్షకిన్నర కాంతలు ఇంపైన గొంతులతో, శ్రుతిపక్వంగా, లయ బద్ధంగా, విరహ గీతాలను, నీ శృంగార సంకీర్తనలను తమతమ బయగారపు విన్నాణం తెల్లంగా, బహుముఖాలుగా, వింత వింత తాళరీతులతో రాగ మంజరులలో మధురగానం చేస్తున్నారు. నీ శ్రీముఖాన్ని విచ్చి, నీ సుప్రభాత స్తోత్ర గానాన్ని ఆలకించు.

శేషముఖ్యులైన నాగులు, సంగీత సామ్రాజ్య చక్రవర్తులు నారద తుంబురాది

గాయకులూ, బ్రహ్మాది దేవతలూ అంతా నీ దర్శనార్థం వేచి ఉన్నారు. రెప్పలువిచ్చి శ్రీవేంకటేశుడా అలమేల్మంగను చూచి లేవయ్యా.

అమృతవర్షిణి - ఆది

విన్నవించితిమి నీకు - వేడుక వేళ
కన్నెను నీవు దయ - గాచేటి వేళ

1. మచ్చికలు దయివారె - మనసెల్ల జైవారె
వచ్చె జవ్వనానకు - వసంతవేళ
చొచ్చి నిన్ను బాసి తాప - సూర్యుడెండగాయగా
విచ్చల విడిగా దోచె - వేసగి వేళ

2. సిగ్గులు మొలువజొచ్చె - చెమట లేరులు హెచ్చె
కగ్గు లేక వచ్చె వాన - కాలపు వేళ
వెగ్గళించి సెలవుల - వెన్నెలలు చూపట్ట
ఒగ్గీ శరత్కాలము - ఒదిగీ నీవేళ

తత్తరపు చలి మించె - తలపోత మంచు మించె
యెత్తి అలమేల్మంగకు - హే మంత వేళ
బత్తితో శ్రీ వేంకటేశ - పైకొని కూడితి విట్టె
చిత్తజు కాకలు దీరె - శిశిర వేళ

స్వామికది మన్మధ విలాస వేళ. అన్నమయ్య అలమేల్మంగను స్వామితో శోభనవేళకు అప్పగింతలు పెట్టేవేళ. ఆ వేళ షడృతువులూ ఆమె లో విలసిల్లినవి. ఋతు సుదర్శనుడు ఆ వేంకటపతి. 'ఋతు స్సుదర్శనః కాలః' అని విష్ణు సహస్రనామస్తోత్రం జీవులకు ఉచ్ఛాస్వ నిచ్ఛ్వాస క్రియచే ప్రాణశక్తి పరిణామం చెంది వారి వారి జీవనకాల ప్రమాణం హరింప బడుతూ ఉన్నందున కాలప్రభావం తెలుస్తున్నదని కావ్యకంఠ వాసిష్ఠ గణపతి ముని ఉవాచ. అలమేల్మంగ నిత్యయౌవన కాలరహిత కాలస్వరూపుడు స్వామి దిక్కాలాదుల ప్రభావం వారి కంటదు.

'దిక్కాలా ద్యనవచ్ఛినాయంత మూర్తయే
స్వానుభూత్యేక మానాయ, నమశ్శాన్తాయ తేజసే' అంటాడు
భర్తృహరి కాలాకాళాదులచేత అనవచ్ఛేద నీయమూ, అనంతమూ అయి స్వానుభవం అనే కొలతకు మాత్రమే కొలవవచ్చే శాంతాకార తేజోకృతియైన కేవలజ్ఞాన మూర్తికి నమస్కారం అని భావం. కాలప్రభావం అలమేల్మంగను అంటరాదు కానీ అదే జరిగిందంటున్నారు అన్నమాచార్యులు.

1. అలమేల్మంగ సౌందర్యముతో నెచ్చెలితనం నిగిడించిన ప్రకృతికి మనసు నిలువ రాక, ఆమనిగా అలమేల్మంగను అలంకరించిన వేళ - వసంతర్తువు.

2.అలమేల్మంగ నిత్యవిరహిణి. స్వామి దూరమైన కారణాన విరహతాప సూర్యుడు ఎండలు మండించగా ఆమెలో ప్రస్ఫుటమైనది వేసవివేళ - గ్రీష్మర్తువు.

3. ఆమెలో సిగ్గుల పంటలు మొలకలెత్తినవి. చెమట వానలు హెచ్చినవి. ఏమాత్రం వసివాడని ఆమెను అతిశయించిన వానకాలం ఆశ్రయించిన వేళ - వర్షర్తువు.

4. అలమేల్మంగ కళాస్థానాలలో దర్శనమిచ్చి తమ వెన్నెలల విభవాలన్ని ఆమెలో ఒది గించి, శరజ్జ్యో త్స్నలు అలరిన వేళ - శరదృతువు.

5. ప్రథమ సమాగమంలోని జంకు, వణుకులతో, చల్లని తెల్లని మధురోహల మం చులు మించి ఆమెను ముంచెత్తినవేళ హేమంతర్తువు.

6. శ్రీవేంకటేశ్వరుడామెతో గూడి, మరుకుంపటి వద్ద చలిగాగినవేళ అది - శిశిర ర్తువు.

అలమేల్మంగ ప్రకృతికాంత. స్వామి పురుషోత్తముడు అందుకే ఆయనకై ఆమెలో షడృతువులూ ఏకకాలమందు పరిఢవిల్లినవి. అనంత వసంతాల సంతత రసామృతవర్షి ణీసంకీర్తనం అన్నమాచార్యులది.